నేటి దినపత్రిక

సూర్య

www.suryaa.com

సంపుటి11 | సంచిక 96

బుధవారం | 31 జనవరి 2018 | విజయవాడ | పేజీలు 12+12+12 | వెల: రూ. 5.00

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం

శ్రీ హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయనం, శిశిర రుతువు, మాఘ మాసం, శుక్ల పక్ష తిథి : చతుర్దశి రా.10.12, పునర్వసు రా.8.18, వర్జ్యం ఉ.9.07 నుంచి 10.35 వరకు, తిరిగి తె.3.45 నుంచి 5.15 వరకు రాహుకాలం: సా.3.00 నుంచి 4.30 వరకు; దుర్ముహూర్తం: ఉ.8.24 నుంచి 9.12 వరకు, తిరిగి రా.10.46 నుంచి 11.36 వరకు సూర్యోదయం : ఉ.6.52 గం; సూర్యాస్తమయం: సా. 6.06 గం.



దారులన్నీ మేడారం వైపే

నేటి నుంచి తెలంగాణ కుంభమేళా

అభయారణ్యంలో వెలసిన అడవి తల్లులు. జాతర వస్తే జనారణ్యాన్ని తలపించే మహాక్షేత్రం. ఇసుకేస్తే రాలనంత భక్తులు. ఎన్నో వింతలు.. కళ్లకు కనిపించే విశేషాలు. ఆద్యంతం భక్తి పారవశ్యం. చుట్టూరా ఆదివాసీ.. గిరిజనం. ఆచారాలు.. సంప్రదాయాల కలబోత. మేడారం అనే కేవలం మూడక్షరాల పదానికి దాసోహం. మహా కుంభమేళాను తలపిస్తూ ఆసియాలోనే అతిపెద్ద జాతరకు సర్వం సిద్ధమైంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెండోసారి జరుగుతున్న మేడారం సమ్మక సారలమ్మ మహా జాతర ఈనెల 31వ తేదీన ప్రారంభం అయి ఫిబ్రవరి 3న ముగియనుంది. దీంతో తెలంగాణాలోని అన్న దారులన్నీ మేడారంవైపు సాగనున్నాయి.

- ఈసారి ఉపరాష్ట్రపతి వెంకయ్య రాక
- ఫిబ్రవరి 2న అమ్మవార్లను దర్శించుకోనున్న సీఎం కేసీఆర్
- ప్రయాణికులను చేరవేస్తున్న హెలికాప్టర్లు
- మహానగరాన్ని తలపిస్తున్న మేడారం
- భక్తులకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్న అధికార యంత్రాంగం
- మేడారంలోనే మకాం వేసిన ఉన్నతాధికారులు
- ఏర్పాట్లు, బందోబస్తుపై నిరంతరం పర్యవేక్షణ





హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః సాధారణ సమయంలో కనిపించని జన సంచారం నేటి నుంచి మేడారం చీమలదండులా మారుతున్నది. రాష్ట్ర దారులన్నీ మేడారంవైపు పయనించనున్నాయి. దీంతో మేడారం వెళ్లే రహదారులన్నీ వాహనాలు, భక్తులతో కిటకిటలాడనున్నాయి. తాత్కాలిక గుడారాలు, లెక్కకు మిక్కిలి వాహనాలతో మేడారం మహానగరాన్ని తలపిస్తున్నది. కోటిమంది భక్తుల కొంగు బంగారమైన సమ్మక్క-సారలమ్మ మహా జాతర నేటి నుంచి ప్రారంభం కానుంది. పిల్లాపాపలతో వనదేవతలను దర్శించుకొనేందుకు పయనమవుతున్నారు. మహాజాతర బుధవారం నుంచి శనివారం వరకు అంగరంగ వైభవంగా జరుగనున్నది. బుధవారం సాయంత్రానికి కన్నెపల్లి నుంచి సారలమ్మను

మిగతా 6లో

పాక్‌పై భారత కుర్రాళ్ల

శివతాండవం

యూ-19 వరల్డ్ కప్ సెమీస్‌లో ఘనవిజయం



12లో

- పరుగుల వేటలో చతికిల పడ్డ పాకిస్థాన్
- 69 పరుగులకే ఆలౌట్ అయిన పాక్
- అండర్-19 వరల్డ్ కప్ ఫైనల్స్‌కు భారత్
- ఐదు మ్యాచ్‌లు ఆడిన భారత జట్టు
- ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ తిరుగులేని విజయాల నమోదు
- ఫైనల్‌లో కూడా భారత్‌కే అవకాశాలు అంటున్న విశ్లేషకులు
- ఫైనల్స్‌లో ఆస్ట్రేలియాతో తలపడనున్న భారత కుర్రాళ్లు

మనమే గెలవాలి

- ప్రతి నియోజకవర్గంలో మనదే గెలుపు కావాలి
- మీరు మారాలి..మార్పును ప్రజలు గుర్తించాలి
- పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘిస్తే సహించను
- సమన్వయ కమిటీ సమావేశంలో చంద్రబాబు నాయుడు



(అమరావతి-సూర్య ప్రధాన ప్రతినిధి) : మీరు మారాలి...మీ మార్పును ప్రజలు గుర్తించాలి..అని టీడీపీ శ్రేణులనుద్దేశించి ఆపార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. మంగళవారం అమరావతిలో టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చంద్రబాబు ప్రసంగిస్తూప్రభుత్వంపై సానుకూలత ఉందని, దానిని పార్టీపట్ల సానుకూలతగా మార్చుకోవాలన్నారు. అలాగే గ్రామం అభివృద్ధి చెందడం తోపాటు పార్టీ అభివృద్ధి చెందాలని, పంచాయతీ సభ్యులు, జన్మభూమి కమిటీ సభ్యులు, సేవామిత్ర, సాధికారమిత్ర అందరూ ఊరు బాగు కోసం కృషి చేయాలన్నారు. నెలకోసారి గ్రామాభివృద్ధిపై సమావేశం జరపాలని, ప్రతి గ్రామంలో దళితవాడకు వెళ్లాలని, దళిత యువతతో మమేకం కావాలని చంద్రబాబు అన్నారు. అలాగే బీసీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలతోనూ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నెలలో నాలుగైదు రోజులు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రులు పార్లమెంట్ స్థానంపై దృష్టిపెట్టి పార్టీని బలోపేతం చేయాలన్నారు. కాగా ప్రజల్లో సంతృప్తి డిసెంబర్‌లో 57శాతం ఉందని, జనవరిలో 62శాతానికి పెరిగిందన్నారు. పెళ్లి కానుకలు ఇస్తున్నామని, దీంతో ఫిబ్రవరిలో మరో 4శాతం, మార్చిలో 4శాతం సంతృప్తి స్థాయి పెరగాలన్నారు. నిరుద్యోగ భృతి, అన్న క్యాంటీన్లతో మరో 10శాతం సంతృప్తి స్థాయి పెరుగుతుందని, మొత్తం 80 శాతం సంతృప్తి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. పనులన్నీ చేశామని, మన ప్రవర్తనలోనే మార్పు

మిగతా 6లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్



'నవయుగ'కే పోలవరం

- స్పిల్‌వే కాంట్రాక్ట్ పనులకు కేంద్రం ఓకే
- ఢిల్లీలో ముగిసిన కీలక భేటీ
- ప్రాజెక్టు నిర్మాణానికి తొలగిన అడ్డంకులు
- పనులను సమీక్షించిన కేంద్ర మంత్రి గడ్కరీ



న్యూఢిల్లీ, సూర్య ప్రత్యేక ప్రతినిధి :పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఒక్కొక్కటిగా అడ్డంకులు తొలగిపోతున్నాయి. స్పిల్‌వే కాంట్రాక్టు పనులను నవయుగకు అప్పగించేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. స్పిల్‌వే కాంక్రీట్, స్పిల్‌వే చానల్ పనులను ఇక నవయుగ సంస్థే చేపట్టనుంది. పాత ధరలకే ఈ పనులను చేయనుంది. మంగళవారం ఢిల్లీలో ఏపీ అధికారులతో జరిగిన సమావేశంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పోలవరం పనులను సమీక్షించారు. పోలవరం పనులకు గాను ఏపీ ప్రభుత్వం టెండర్లను పిలవగా పాత ధరలకే పను లు చేస్తామని నవయుగ ముందుకురాగా ప్రభుత్వం టెండర్లను నిలిపివేసింది. మంగళవారం ఏపీ అధికారులతో సమావేశం అయిన గడ్కరీ ఈ మేరకు ఆమోదం తెలిపారు. పోలవరం ప్రాజెక్టుపై ఢిల్లీలోని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వద్ద కీలక భేటీ జరిగింది. ప్రాజెక్టులో స్పిల్‌వే కాంక్రీటు, స్పిల్ ఛానల్ పనులను కొత్త గుత్తేదారుకు అప్పగించే అంశంపై ఈ సమావేశ ంలో ఓ స్పష్టత వచ్చింది. దీనిపై రెండు

మిగతా 6లో

బీసీలకే అధిక సీట్లు

బడుగు బలహీనులకే ప్రాధాన్యమన్న జగన్

- చేనేతన్నలు నా ఫొటో ఇంట్లో పెట్టుకునేలా మేలు చేస్తా
- ప్రజా సంకల్పయాత్రలో వై.ఎస్.జగన్
- చేనేత అన్నలు ఆత్మహత్యలు చేసుకొంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు
- అభివృద్ధి అంటే గతాని కంటే ఈ రోజు మెరుగైన జీవనం గడుపుతున్నామని అర్థం
- అలాంటి అభివృద్ధి రాష్ట్రంలో లేదు
- వైసీపీ అధికారంలోకి వస్తే చేనేతలకు ప్రత్యేక కార్పొరేషన్





(వెంకటగిరి నుంచి సూర్య పొలిటికల్ బ్యూరో ప్రత్యేక ప్రతినిధి) : వచ్చే ఎన్నికల్లో బడుగు, బలహీనవర్గాలకే మేజార్టీ సీట్లు కేటాయిస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు న్యాయం జరగాల్సిన అవసరముందని ఆయన చెప్పారు. చనిపోయిన తర్వాత తన ఫొటోను, వైఎస్సార్ ఫొటోను చేనేతలు తమ ఇళ్లలో పెట్టుకునేలా తోడుగా నిలబడతానన్నారు. నెల్లూరు జిల్లా కలిచేడులో చేనేతల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. "నాలుగు సంవత్సరాలు పాలన ముగిసిందని, మరో ఏడాదిలో ఎన్నికలు వస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్యకర్తలతో చెబుతున్నారు. ఎన్నికలు వస్తున్నాయని బాబు చెబుతున్న తరుణంలో మనకు ఎలాంటి నాయకుడు కావాలి అనే విషయాన్ని మనకు మనం ప్రశ్నించుకోవాలి. బాబు నాలుగేళ్ల పరిపాలనలో మన జీవితాలు మెరుగుపడ్డాయా, లేదా అనే విషయాన్ని తరచిచూసుకోవాలి. లక్షన్నర ఖర్చు తో ప్రతి చేనేత కుటుంబానిక సొంత ఇల్లు, మగ్గాన్ని ప్రభుత్వం ఇప్పిస్తుందని చెప్పాడు. ఇచ్చాడా? దేవుడి దయ వల్ల మనం అధికారంలోకి వస్తే

మిగతా 6లో

అంతే ఇంతే!




ముందు టిడిపి-బిజెపి భేదాభిప్రాయాలపై చర్చించాలి సార్

బీద ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్



ఆస్తి కేవలం రూ. 1,520

- నామినేషన్ వేసిన మాణిక్ సర్కార్
- జనవరి 20 నాటికి ఆయన బ్యాంకు ఖాతాలో రూ. 2,420
- 1998 నుంచి త్రిపురకు సీఎంగా మాణిక్ సర్కార్



తెలుగు 'చంద్రు'లపై గ్రహణ ప్రభావం

నేడు అరుదైన సంపూర్ణ చంద్రగ్రహణం



- ఇద్దరు చంద్రులపై జనవరి 31 ప్రభావం ఎంత?
- ఇద్దరిదీ కర్కాటక రాశే
- అదే రాశిలో ఏర్పడనున్న గ్రహణం
- రాజకీయ సమీకరణాల్లో మార్పులపై ఆసక్తి
- నేడు తెలుగు రాష్ట్రాల్లో మూతపడనున్న ఆలయాలు

6లో

ప్రజా కంటకంగా టీఆర్ఎస్, కాంగ్రెస్ నిర్ణయాలు

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న విధానాలు, సిద్ధాంతాలు ప్రజ లకు వ్యతిరేకంగా ఉన్నాయని తెలుగుదేశం పార్టీ తెలంగాణ అధ్యక్షుడు ఎల్.రమణ ఆరోపించారు. ప్రజలకు అనుకూలంగా ప్రభుత్వం, ప్రతిపక్షపార్టీల నిర్ణయాలుండాలని, అయితే అందుకు విరుద్ధంగా రాష్ట్రంలో అధికారంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ నిర్ణయాలున్నాయని విమర్శించారు. మంగళవారంనాడు ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ-టీఎస్ అయిదో బ్యాచ్ శిక్షణా తరగతులను రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే ఏకైక పార్టీ తెలుగుదేశం మాత్రమేనని అన్నారు. నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీతోనే అణగారిన వర్గాలకు న్యాయం జరిగిందన్నారు. తెలుగుదేశం పార్టీ బడుగు, బలహీనవర్గాలకు అండ అని అన్నారు. సమాజంలో పేదరిక నిర్మూలను పాటుపడే ఏకైక పార్టీ తెలుగుదేశం అని తెలిపారు. 2019 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్టీ కార్యకర్త నుంచి నాయకులందరం సమన్వయంతో ముందుకు సాగుదామని రమణ పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీకి తెలంగాణాలో బలమైన కేడర్ ఉందని, నాయకులు వెళ్లినంత మాత్రాన కార్యకర్తలు మొక్కవోని ధైర్యంతో పార్టీకి అంతికభావంతో పనిచేస్తున్నారన్నారు. పార్టీ కార్యకర్తల బలంతో వచ్చే 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో తిరిగి బలమైన శక్తిగా ఎదుగుదామని, ఇందుకోసం ప్రతి ఒక్కరు కృషిచేయాలని కోరారు. అంత కు ముందు జిల్లా పార్టీ నాయకుల, మండల పార్టీ అధ్యక్షుడు, పార్టీ అనుభంద సంఘాల నాయకులను శిక్షణా తరగతులకు ఆహ్వానించారు. పార్టీ జెండాను రమణ ఆవిష్కరించి శిక్షణా తరగతులను ప్రారంభించారు శిక్షణా తరగతులలో పాల్గొన్న శ్రేణుల పరిచయ కార్యక్రమం తర్వాత శిక్షణలో శ్రేణులు పాటించాల్సిన నియమనిబంధలను పార్టీ కార్యక్రమాల కమిటీ కన్వీనర్ జి.బుచ్చిలింగం వివరించారు. శిక్షణ తరగతులకు హాజరైన నాయకులకు మ్యాక్స్ క్యూర్ హాస్పిటర్ డాక్టర్ అనిల్ కృష్ణ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు.

రైతును ఆదుకోండి

- రైతుకు రుణం ఇవ్వడం దేశానికి సేవ చేసినట్లే
- వ్యాపార కోణంలో చూడొద్దు
- మానవీయ కోణంలో రుణాలివ్వండి
- పాడి, పంట కలిగినచోట రైతు ఆత్మహత్యలుండవు
- ఎస్ఎల్‌బీసీ సమావేశంలో మంత్రి ఈటెల

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: తెలంగాణా రైతులను ఆదుకోవాలని బ్యాంకర్లకు రాష్ట్ర ఆర్థిక, పౌరసరఫరాలశాఖ మంత్రి ఈటెల రాజేందర్ కోరారు. మంగళవారంనాడు మారిగోల్డ్ హోటల్ లో 'నాబార్డ్' నిర్వహించిన స్టేట్ క్రెడిట్ సెమినార్ కార్యక్రమానికి మంత్రులు ఈటల రాజేందర్,హరీష్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఈటెల రాజేందర్ మాట్లాడుతూ రైతులకు మరిన్ని రుణాలు అందించాలని, వారికీ ఋణం ఇవ్వడం అంటే దేశానికి సేవ చేయడమేనని పేర్కొన్నారు. రైతులకు రుణం మంజూరులో వ్యాపారకోణంలో ఆలోచించవద్దు మంత్రి బ్యాంకు అధికారులను కోరారు. లెక్కలు, జీడీపీ ల కోణం లో కాకుండా మానవీయకోణం లో పేదలకు రుణాలు ఇవ్వండిని కోరారు. పాడి పంట కలగలిసి ఉన్న చోట రైతు ఆత్మహత్యలుండవని, సంపద కేంద్రీకృతం అవ్వడం పేదరికానికి కారణం.. ఇది మన రాజ్యాంగ స్ఫూర్తి కి విరుద్ధమని ఈటెల పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల రైతు రాజు కాబోతున్నాడని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ అన్నారు అన్నారు. అందుకు అనుగుణంగా బ్యాంకులు మద్దతు ఇవ్వాలని అయన అన్నారు. గతంలో లాగ గ్రౌండ్ వాటర్ ని పెంచడాన్ని కి ఎక్కువ ఖర్చు చేయాల్సిన అవసరం లేదన్నారు. నీటిపారుదల ప్రాజెక్టులు, మిషన్ కాకతీయ కార్యక్రమములతో తెలంగాణ లో ఉన్న అన్ని చెరువులు, కుంటలు, వాగుల్లో నీరు ఎప్పటికి ఉండేలా చూస్తున్నామని తెలిపారు. ఇదో మానవ అద్భుతం అని ఈటల రాజేందర్ అన్నారు. కాబట్టి బావులు బోర్లు తవ్వడానికి ఎక్కువ రుణాలు ఇవ్వాల్సిన అవసరం లేదని మంత్రి బ్యాంకర్స్ తో అన్నారు. భారీ నీటిపారుదల ప్రాజెక్టులు నిర్దేశిత సమయంలో పూర్తి చేయకపోవడం వల్ల అంచనాలు 300% పెరిగిన సందర్భాలు కూడా ఉన్నాయన్నారు. కానీ నేడు అనుకున్న దానికంటే ముందే ప్రాజెక్టులు పూర్తిచేస్తున్నామని తెలిపారు. దీనివల్ల రుణ భారంకూడా తగ్గించగలిగామన్నారు. తుపాకుల గూడెం, సుందిళ్ళ ,అన్నారం,మేడిగడ్డ లను మిడ్ మానేరుకు అనుసంధానం చేయడం ద్వారా 70% తెలంగాణ భూములకు సాగు నీళ్లు అందుతాయన్నారు.

గతంలో గోదాముల నిర్మాణానికి కూడా పెద్ద మొత్తం లో రుణాలు ఇచ్చేదని ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వమే భారీ స్థాయిలో గోదాముల నిర్మాణం చేపట్టిందని తెలిపారు. తెలంగాణ వచ్చినప్పుడు రాష్ట్రం లో 4 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములు ఉండగా ప్రస్తుతం 18 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములను రెడీగా పెట్టినం. కాబట్టి వీటికోసం ఇచ్చే రుణాలు రైతులకు వేరే అవసరాలకోసం ఇవ్వాలని మంత్రి బ్యాంకర్స్ ని కోరారు. రైతులకు స్కేల్ అఫ్ ఫైనాన్స్ పెంచాలని విజ్ఞప్తి చేసారు.

విద్యుత్ అందిచడం ద్వారా కాలిపోయే మోటార్ల ఖర్చుని రైతుకు ఆద చేయగలిగామని అన్నారు. దేశంలో 24 గంటల విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. దేశంలో సర్ప్లస్ పవర్ ఉందని, తక్కువ ధరకు దొరుకుతుందని మిగతా పార్టీలు చె ప్తున్నాయి కదా .. అలాంటప్పుడు దేశం లో ఇతర రాష్ట్రాల్లో ఎందుకు ఉచిత విద్యుత్ అందిచడం లేదని ఈటల ప్రశ్నించారు. రైతు వ్యాపారి కాదు అని , అయన వ్యాపారకోణంలో ఆలోచిస్తే మనం అన్నం ఉండదని అన్నారు. రైతు చెమట ధారపోసి కష్టపడుతున్న అతనికి సాయం చేయడం అంటే దేశానికి సేవ చేయడం అని అన్నారు.అందుకే 8000 సంవత్సరానికి అందిచబోతున్నామన్నారు. మనలో చాల మంది రాజకీయనాయకులు , అధికారులు రైతు బిడ్డలమని చెప్పుకుంటున్నారు కానీ ఆ రైతుకు ఇప్పటివరకు ఒరిగింది ఏమి లేదు అన్నారు. ఇప్పుడు చేపడుతున్న సమగ్ర చర్యల వల్ల రైతు కుటుంబాల్లో మార్పు వస్తుందని ఆశిస్తున్నట్టు మంత్రి తెలిపారు. వ్యవసాయ అనుబంధ రంగాలను అభివృఎద్ధిచేయాలని ప్రభుత్వం పని చేస్తుంది. అందుకే గొర్రెల మేకల పంపిణీ చేస్తున్నాం 4 వేల కోట్ల రూపాయల సంపదను అందించాం జయతి ఘోష్, రామచంద్ర రెడ్డి కమిషన్ లు ఇచ్చిన రిపోర్ట్స్ లో రైతు ఆత్మహత్యలు ఆగాలంటే పాడి-పంట కలిసి ఉండాలి అని చెప్పారు. అలా చేయడం వల్లనే చిత్తూర్ లో ఆత్మహత్యలు లేవని అన్నారు. బ్యాంకులు మరింత ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఈటెల కోరారు. . గ్రామీణ ప్రాంతాల్లో టార్గెట్స్ ఇంకా పూర్తి కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడు లెక్కల రూపంలో కాకుండా మానవతా కోణం లో చూసి అప్పు ఇవ్వండని కోరారు. పేద గ్రామీణ మహిళలకోసం రూ.1000 కోట్ల తో ప్రత్యేక రుణసదుపాయం కల్పించండి అని కోరారు. సంపద కొద్దీ మంది దగ్గర పోగు కావడం సమాజానికి మంచిది కాదని, ఇది మన రాజ్యాంగానికి కూడా విరుద్ధం అని మంత్రి అన్నారు. సంపద అందరి అవసరాలను తీర్చాలని ఆయన తెలిపారు.



బడ్జెట్ కేటాయింపులపై ఏపీ ఆశలు



(అమరావతి-సూర్య ప్రత్యేక ప్రతినిధి): నవ్యాంధ్రలో 2019 ఎన్నికలకు ముందు కేంద్రం ప్రవేశపెట్టనున్న చివరి బడ్జెట్ ఇదే కావడంతో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయింపులకు సంబంధించి ఉత్కంఠ నెలకొంది. రెండురోజుల్లో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో విభజన సమస్యల పరిష్కారం సహా నిధుల కేటాయింపుపై కేంద్రం సానుకూలంగా స్పందిస్తుందనే ఆశతో ఏపీ ప్రభుత్వం ఉంది. ఇప్పటికే సమస్యల జాబితా, పెండింగ్‌లో ఉన్న నిధుల నివేదికను కేంద్రానికి పంపింది. అయితే మరిన్ని వివరాలు కావాలని పీఎంవో అధికారులు కోరినందున బడ్జెట్ అశాజనకంగా ఉంటుందని చంద్రబాబు ప్రభుత్వం అంచనా వేస్తోంది. కేంద్రం సిద్ధం చేస్తున్న బడ్జెట్ నిధుల విడుదలకు సంబంధించి రాష్ట్రానికి ఇది చివరి అవకాశం. విభజన జరిగి నాలుగేళ్లు పూర్తికావచ్చినా ఇప్పటి వరకు కేంద్రం నుంచి వచ్చిన నిధులు అంతంతమాత్రమే. అన్ని రాష్ట్రాలకు వచ్చినట్లుగానే ఆంధ్రప్రదేశ్‌కూ వస్తున్నాయి. ఏపీని ప్రత్యేకంగా పరిగణిస్తామన్న కేంద్రం హామీలు మాటలుగానే మిగిలిపోయాయనే అభిప్రాయం నెలకొంది. ఇప్పుడు ఎన్నికలు కూడా దగ్గరపడ్డాయి. కేంద్రం నుంచి సాధ్యమైన్ని నిధులు రాబట్టేందుకు రాష్ట్రం అన్ని ప్రయత్నాలు చేసింది. రాజధాని నిర్మాణం, ఆర్థిక సంఘం నిధులు, ద్రవ్యలోటు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు, కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల విడుదలకు సంబంధించి డిమాండ్లను కేంద్రం ముందు ఉంచింది. రాజధాని నిర్మాణానికి ఇవ్వాల్సిన రూ.1000 కోట్లు కేటాయించాలని కేంద్రాన్ని ఇప్పటికే అడిగింది.

ఆ నివేదికతో బ్లాక్‌మెయిల్

వైసీపీ నేత గుడివాడ అమర్నాథ్



విశాఖపట్నం, మేజర్‌న్యూస్: విశాఖ భూదందా విషయంలో సిట్ ఇచ్చిన నివేదికతో చంద్రబాబు నాయుడు టీడీపీ ఎమ్మెల్యేలను బ్లాక్‌మెయిల్ చేస్తారని వైసీపీ అనకాపల్లి అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ ఆరోపించారు. విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పెద్దలను పక్కన పెట్టి..సిట్ ఎవ్వరి పేర్లు వెల్లడించకుండా నివేదికను సీపీకి ఇచ్చారని, ప్రభుత్వ ప్రతినిధిలుగా విచారణ చేపట్టినప్పుడు ఎందుకు పేర్లు వెల్లడించలేదని ప్రశ్నించారు. టీడీపీ నాయుకుల హస్త ఉంది కాబట్టే పేర్లు బయట పెట్టలేదని వ్యాఖ్యానించారు. విజయవాడలో బోండా ఉమా భూదందాలకు పాల్పడుతుంటే చంద్రబాబు మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో మంత్రులు, అధికారపార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇష్టమొచ్చినరీతిలో భూదందాలకు పాల్లడుతున్నారని ఆరోపించారు. సిట్ విచారణ చేస్తున్న నేపథ్యంలో తాము కోర్టుకు వెళ్లలేకపోయామని, ఇప్పుడు కోర్టుకు వెళ్లడానికి సిద్దమముతున్నామని చెప్పారు. విశాఖలో భూదందాలపై సిట్‌తో కాకుండా సీబీఐతో విచారణ చేయాలని తొలి నుంచి వైసీపీ డిమాండ్ చేసిందని గుర్తు చేశారు. కానీ తమ వారిని కాపాడుకోడానికే సిట్ వేసి చేతులు దులుపుకొన్నారని మండిపడ్డారు. కేవలం రాయపాటి, అవంతి తప్ప మరెవ్వరూ రైల్వే జోన్ కోసం లేఖ ఇవ్వలేదని ఆర్టీఐ ద్వారా తెలుసుకున్నామని, విశాఖ ఎంపీ హరిబాబు కేవలం వైసీపీ మద్దతు కోరుతు ఇచ్చిన లేఖను మాత్రమే పంపించారని చెప్పారు. రైల్వే జోన్ కోసం వైసీపీ ఆధ్వర్యంలో విశాఖలో ఫిబ్రవరి ఒకటిన దీక్ష చేపడుతున్నట్లు వెల్లడించారు.

ఎంపీ, ఎమ్మెల్యేల పనితీరుపై సమగ్ర సర్వే

- సర్వే ఫలితాల ఆధారంగానే సిట్టింగ్‌లకు టికెట్లిచ్చే ఛాన్స్?
- తాజాగా మరోసారి సర్వే చేయించిన సీఎం కేసీఆర్
- త్వరలోనే ఫలితాలు వెల్లడించే అవకాశం
- రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కేసీఆర్ ప్రణాళికలు



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : అధికార టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు సర్వే గుబులు పట్టుకుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ తాజాగా చేయించిన సర్వే వివరాలను త్వరలోనే వెల్లడిస్తారన్న ప్రచారం పార్టీ వర్గాల్లో కొనసాగుతుంది. ఎమ్మెల్యేలు,ఎంపీల పనితీరుపై ఆయన సమగ్ర సర్వే చేయించినట్లు తెలుస్తోంది. ఎన్నికలకు సమయం సమీపిస్తుండడంతో సర్వే ఫలితాలు ఎలా ఉంటాయోనన్న ఆందోళన టీఆర్ఎస్ నేతల్లో నెలకొంది. సర్వేల ఆధారంగానే వచ్చే ఎన్నికలకు వెళ్ళాలన్న ఆలోచనతో కేసీఆర్ ఉన్నారని, దానికి తగ్గట్లే నేతలను కూడా సిద్ధం చేయనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలు దఫాలుగా సర్వేలు నిర్వహించి, ఆ వివరాలను పార్టీ ప్రజాప్రతినిధులకు కేసీఆర్ అందించారు. ఇలా అంతర్గత సర్వేలతో కేసీఆర్ నాయకులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూనే ఉన్నారు. అయితే కొంతమంది ఎమ్మెల్యేలు తమపనితీరు మార్చుకోకపోవడం పట్ల ఆయన పలుమార్లు అసంతృప్తిని వ్యక్తం చేశారు. తాజాగా సర్వేను పక్కా శాస్త్రీయంగా చేయిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గ స్థాయిలో పార్టీ పరిస్థితి, ప్రభుత్వ పనితీరు, ఎమ్మెల్యేల, ఎంపీల పనితీరుపై అభిప్రాయాలను సర్వే సంస్థలు సేకరించినట్లు సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10 లక్షల మంది అభిప్రాయాలను సేకరించి, వాటిని క్రోడికరించి, నివేదికను ముఖ్యమంత్రికి అందజేసినట్లుగా పార్టీ వర్గాలు చెబుతున్నాయ. సుమారు నెల రోజులపాటు నిర్వహించిన తాజా సర్వే, ఇటీవలే పూర్తయినట్లుగా తెలుస్తోంది. త్వరలోనే పార్టీ ప్రజాప్రతినిధులతో సమావేశమై ముఖ్యమంత్రి, సర్వే ఫలితాలను వెల్లడించే అవకాశాలున్నట్లు సమాచారం. అనెలఖారులో పంచాయితీరాజ్ చట్టసవరణ కోసం అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలని భావిస్తోన్న అధికారపార్టీ, ఆ సందర్భంగా ఏర్పాటు చేయనున్న శాసనసభా పక్ష సమావేశంలో సర్వే వివరాలు వెల్లడించే అవకాశాలున్నాయని టీఆర్ఎస్ పార్టీ వర్గాలంటున్నాయి. వచ్చే ఎన్నికల్లో కనీసం 30 నుంచి 40 శాతం మందికి టికెట్లు దక్కవన్న ప్రచార నేపథ్యంలో వెల్లడికానున్న సర్వే వివరాలే అధికారపార్టీ వర్గాల్లో సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

మరోసారి అధికారమే లక్ష్యంగా వ్యూహాలు

వచ్చే ఎన్నికల్లో మరోసారి అధికారం దక్కించుకోవాలని భావిస్తున్న అధికార పార్టీ నాయకత్వం దానికి అనుగుణంగా తన వ్యూహాలను పదను పెడుతోంది. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను ఎప్పటికప్పుడు అంచాన వేస్తూ, దానికి అనుగుణంగా పార్టీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేసే పనిలో నిమగ్నమయింది.

టీడీపీ సర్కార్ భూదోపిడీపై ప్రధానికి లేఖ

వైసీపీ నేత బొత్స సత్యనారాయణ



విజయవాడ, మేజర్‌న్యూస్: తెలుగుదేశం ప్రభుత్వ భూ దోపిడీపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాస్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజులు వారి స్వప్రయోజనాల కోసమే విజయనగరం జిల్లా భోగాపురం ఎయిర్‌పోర్టు టెండర్‌ను రద్దు చేశారని ఆయన మండిపడ్డారు. భోగాపురం ఎయిర్‌పోర్టు టెండర్ రద్దు వెనుక ఉన్న కుట్రలు, కుతంత్రాలపై ప్రధానమంత్రి నరేంద్రమోడీకి లేఖ రాస్తున్నట్లు ఆయన చెప్పారు. విజయవాడ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బొత్స సత్యనారాయణ మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో విజయనగరం జిల్లా భోగాపురంలో రాష్ట్రానికి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మిస్తామని కేంద్రం చెప్పిందని గుర్తు చేశారు. కానీ చంద్రబాబు కేబినెట్ సమావేశం పెట్టి భోగాపురం ఎయిర్‌పోర్టు టెండర్‌ను రద్దు చేశారని దీన్ని వైసీపీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. టెండర్ల రద్దుకు ఇంటిగ్రేటెడ్ ఎయిర్‌పోర్టు అని, భూసేకరణ జరగలేదని చంద్రబాబు కుంటిసాకులు చెబుతున్నారని మండిపడ్డారు.

చంద్రబాబులాంటి దుర్బుద్ధి కలిగిన వ్యక్తిని ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో ఎక్కడా చూడలేదని బొత్స విమర్శించారు. స్థానిక ఎంపీగా ఉన్న అశోక్ గజపతిరాజు కేంద్రంలో పౌర విమానయాన శాఖ మంత్రిగా ఉన్నా టీడీపీ తరపున పనిచేస్తున్నాడని ధ్వజమెత్తారు. కేంద్రమంత్రి హయాంలో ఎంత దోపిడీ జరుగుతుందో భోగాపురం ఎయిర్‌పోర్టు ఒక ఉదాహరణ అని బొత్స అన్నారు. 2013 సంవత్సరంలో భోగాపురంను గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుగా చేయాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించిందని గుర్తు చేశారు. 2015లో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు భోగాపురంకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అన్ని అనుమతులు మంజూరు చేసిందన్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి జరిగిన టెండర్‌లో అశోక్‌గజపతిరాజు శాఖకు సంబంధించిన ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ప్రభుత్వ రంగ సంస్థ, ఒక ప్రైవేట్ సంస్థ పాల్గొన్నాయని బొత్స గుర్తు చేశారు. టెండర్‌లో ప్రభుత్వరంగ సంస్థ 30.2 శాతం ప్రభుత్వానికి ఆదాయం ఇస్తామని కోడ్ చేసిందని, మరో ప్రైవేట్ సంస్థ 21.6 శాతానికి కోడ్ చేసిందన్నారు. ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియాకు టెండర్ ఇస్తే ఈ నాయకుల దోపిడీకి అవకాశం ఉండదు కాబట్టే టెండర్‌ను రద్దు చేశారన్నారు. దీనికి ఇంటిగ్రేటెడ్ ఎయిర్‌పోర్టు, భూసేకరణ జరగలేదని కుంటిసాకులు చెబుతున్నారని ధ్వజమెత్తారు. భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి 10 వేల ఎకరాలు సేకరిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధర్నా చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తే దిగొచ్చిందన్నారు. 10 వేల ఎకరాలను 5300 ఎకరాలకు తీసుకొచ్చి దాన్ని మళ్లీ 2560 ఎకరాలకు ఫైనల్ చేసిందన్నారు. దాంట్లో 2500ల ఎకరాల భూసేకరణ పూర్తయిందని, మళ్లీ భూసేకరణ జరగలేదని చెప్పడంలో ఆంతర్యం దోపిడీ అని స్పష్టంగా అర్థం అవుతుందన్నారు. ముఖ్యమంత్రి, కేంద్రమంత్రి మామూళ్లకు లాలూచీ పడ్డారని అర్థం అవుతుందని అన్నారు



సూర్య దినపత్రిక ఆంధ్ర ప్రదేశ్ డైరీని ఆవిష్కరించిన చైర్మన్ నూకరపు సూర్య ప్రకాశ్ రావు, సిబ్బంది

అనుమతి లేకుండా పాదయాత్ర

జోగి రమేష్‌పై కేసు నమోదు



మచిలీపట్టణం, మేజర్‌న్యూస్: అనుమతి లేకుండా పాదయాత్ర చేసిన వైసీపీ నేత జోగి రమేష్‌పై పోలీసులు కేసునమోదు చేశారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ నిర్వహిస్తున్న పాదయాత్ర సోమవారానికి 1000 కిలోమీటర్లు పూర్తయిన సందర్బంగా రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల్లో ఆ పార్టీ నేతలు వాక్ విత్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా కృష్ణా జిల్లాలో కూడా మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత జోగి రమేష్ ఆధ్వర్యంలో కొండపల్లి నుంచి ఇబ్రహీంపట్నం వెళ్లే రహదారిలో పాదయాత్ర నిర్వహించారు. అదే సమయంలో ఓ అంబులెన్స్ రాగా అది పాదయాత్రతో ట్రాఫిక్‌లో చిక్కుకుపోయింది. అంబులెన్స్‌లో హార్ట్ పేషెంట్ రాములు మృతిచెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న పోలీసులు అనుమతి లేకుండా పాదయాత్ర నిర్వహించి ఓ వ్యక్తి మరణానికి కారణమయ్యాడంటూ వైసీపీ నేత జోగి రమేష్‌పై కేసునమోదు చేశారు

ప్రజాసంకల్పయాత్ర 75వ రోజు సాగిందిలా



నెల్లూరు, మేజర్‌న్యూస్: ప్రజాసంకల్పయాత్ర ద్వారా ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన పాదయాత్ర 75వ రోజు పూర్తిచేసుకొంది. మంగళవారం ఉదయం వెంకటగిరి నియోజకవర్గం సైదాపురం శివారు నుంచి పాదయాత్రను ప్రారంభించారు. సిద్ధయ్య కోన, పొక్కనదాల క్రాస్ మీదుగా ఊటకూరు, గిద్దలూరు క్రాస్, తురిమెళ్ల కు పాదయాత్ర చేరుకుంది. దారిపొడవునా ఆయన ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. తురిమెళ్లలో ఆయన వైసీపీ జెండాను ఆవిష్కరించారు. ఆపై పాదయాత్ర ముందుకు కొనసాగించారు. అక్కడి నుంచి కలిచేడుకు ఆయన చేరుకున్నారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. కలిచేడులోనే ఆయన రాత్రి బస చేశారు. పాదయాత్రలో భాగంగా ఇప్పటిదాకా ఆయన 1005 కిలోమీటర్లు నడిచిన విషయం తెలిసిందే.

జాతిపితకు వైఎస్ జగన్ నివాళులు

వెంకటగిరి, మేజర్‌న్యూస్: ప్రజా సంకల్పయాత్రలో ఉన్న వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి జాతిపితా మహాత్మాగాంధీకి నివాళ్లులర్పించారు. మంగళవారం నాడు జాతిపిత మహాత్మాగాంధీ 70వ వర్థంతి. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గాంధీ చిత్రపటానికి మాల వేసి నివాళులు అర్పించారు. పలువురు వైసీపీ నేతలు కూడా నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు

శాఖల వారీగా బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం

- గత బడ్జెట్ నిధులతోపాటు బడ్జెటేతర నిధులు ఖర్చు చేశాం
- మిషన్ భగీరథ, నిరంతర విద్యుత్‌కు పెద్దమొత్తంలో నిధులు
- కాళేశ్వరం ప్రాజెక్టుకు సరిపడ నిధులు సమకూర్చునే యత్నం
- దేశ వృద్ధిరేటు, తలసరి ఆదాయం కంటే రాష్ట్ర వృద్ధిరేటు, తలసరి ఆదాయం అధికం
- రాష్ట్ర ఆర్థికమంత్రి ఈటల రాజేందర్

హైదరాబాద్, మేజర్‌న్యూస్: మార్చిలో ప్రవేశపెట్టబోయే 2018-19 వార్షిక బడ్జెట్ అధికారుల స్థాయిలో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. ఆర్థిక శాఖ వాటిని క్రోడీకరిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రాధాన్యతల వారీగా ప్రాథమిక కేటాయింపులు చేస్తున్నారని వెల్లడించారు. బడ్జెట్‌కు ఇక ముఖ్యమంత్రి తుది మెరుగులు దిద్దనున్నారని చెప్పారు. గత బడ్జెట్ లోపెట్టిన 1,49,646 కోట్లతో పాటు బుడ్జెటేతర నిధులు కూడా సేకరించి పెద్ద ఎత్తున ఖర్చు చేశామన్నారు. మిషన్ భగీరథ, 24 గంటల నిరంతర విద్యుత్ లాంటి నిర్దేశిత కార్యక్రమాల కోసం పెద్ద ఎత్తున నిధుల ఖర్చు చేశామని ఈటల అన్నారు. దేశం లో ఏ రాష్ట్రం చేపట్టని విధంగా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టినట్లు పేర్కొన్న ఈటల, ప్రాజెక్టుకు సరిపడ నిధులు సమకూర్చుకుని నిర్దేశిత సమయం కంటే ముందే పూర్తి చేసే దిశగా పనులు చేపడుతున్నామని అన్నారు. రాష్ట్ర వృద్ధిరేటు దేశ సగటు కంటే ఎక్కువ నమోదయ్యిందని, అదికూడా ప్రతి సంవత్సరం పెరుగుతూ వస్తుందని చెప్పారు. 2014-15 జాతీయ వృద్ధిరేటు 7.5 శాతంకాగా, రాష్ట్ర వృద్ధిరేటు 6.8 శాతమని పేర్కొన్న ఆయన, 2015-16 జాతీయ వృద్ధిరేటు 8 శాతం కాగా, తెలంగాణ 8.9 శాతమని చెప్పారు. 2016-17 జాతీయ వృద్ధిరేటు 7.1 శాతం కాగా, తెలంగాణ 10.2 శాతమని పేర్కొన్నారు. దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే తెలంగాణ తలసరి ఆదాయం



అధికమని రాజేందర్ అన్నారు. 2014-15 జాతీయ 86,454 శాతం కాగా, తెలంగాణ 1,24,058 శాతమని పేర్కొన్న ఆయన, 2015-16 జాతీయ 94,130 శాతంకాగా, తెలంగాణ 1,37,955 శాతం పెరిగిందని చెప్పారు. 2016-17 జాతీయ 1,03,219 శాతమని, తెలంగాణ 1,55,612 శాతంగా నమోదయిందన్నారు. రాష్ట్ర ఆదాయం గణనీయం గ పెరగడానికి టీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలే కారణమని పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలిస్తుండడం వల్ల పరిశ్రమల స్థాపనకు వారు ముందుకొస్తున్నారని చెప్పారు. దేశంలోనే అలాగే ఈజ్ అఫ్ డూయింగ్ బిజినెస్ లో తెలంగాణ రాష్ట్రం ప్రథమస్థానంలో ఉన్న విషయం తెలిసిందేనని ఈటల అన్నారు. ఇప్పటికి రాష్ట్రంలో మూడు వేల సంస్థలు వచ్చాయన్న ఆయన, లక్ష పదిహేనువేల కోట్ల పెట్టుబడితో దాదాపు 2 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించాయని చెప్పారు. నీతి ఆయోగ్ ప్రతిపాదనలకు అనుగుణంగా మిషన్ భగీరథకు 19 వేల కోట్లు , మిషన్ కాకతీయకు 5 వేల కోట్లు ఇవ్వాలని. మానవ అద్భుతంగా చెప్తున్న కాళేశ్వరం ప్రాజెక్టుకు తెలంగాణ ప్రభుత్వం 88 వేల కోట్లు ఖర్చు చేస్తోందని, కనీసం కేంద్ర ప్రభుత్వం 10 వేల కోట్లు కేటాయించాలని రాజేందర్ కోరారు. ఇదే విషయమై ఫైనాన్స్ సెక్రటరీ రామకృష్ణారావుతో కలిసి వెళ్లి కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీని కోరినట్లు తెలిపారు.

అలాగే రాష్ట్రంలో గిరిజన , హార్టికల్చర్ యూనివర్సిటీలకు, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీల ఏర్పాటుకు ఈ బడ్జెట్ లో నిధులు కేటాయించాలని కోరినట్లు వివరించారు. ఆయితే ఇప్పటివరకు కేంద్రం నుంచి సానుకూల స్పందన రాలేదన్న ఆయన, ఈ సారి అయినా స్పందిస్తారని ఆశిస్తున్నామని చెప్పారు. 2017-18 ఆర్థిక సంవత్సరం లో మౌలిక వసతుల కల్పనలో పురోగతి సాధించామన్న రాజేందర్, తెలంగాణ ను అగ్ర స్థానంలో నిలిపేందుకు కృషి చేశామని పేర్కొన్నారు. 2018-19 లో కూడా ఈప్రయత్నాన్ని కొనసాగిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి కెసిఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే రోల్ మోడల్ గా నిలిపేందుకు ఉద్యమ స్ఫూర్తి పనిచేస్తామని చెప్పారు .

రెండు నిమిషాలు ఆగిన రాష్ట్రం

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: జంట నగరాలతో పాటు రాష్ట్రం మొత్తంగా రెండు నిమిషాలపాటు నిలిచిపోయాయి. గాంధీ వర్ధంతి సందర్భంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించాలన్న ప్రభుత్వం ఆదేశాలను ప్రజలు స్వచ్ఛందంగా నగర ప్రజలు ఎక్కడివారక్కడే ఉండిపోయారు. స్వాతంత్ర్యం కోసం బలిదానం చేసిన వారి త్యాగాలను స్మరించుకుంటూ మౌనం పాటించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలకు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 2 నిమిషాల పాటు రాష్ట్ర వ్యాప్తంగా మౌనం పాటించారు. ఆ సమయంలో రహదార్లపై వాహన రాకపోకలను పోలీసులు ఎక్కడికక్కడే నిలిపివేశారు. ఆ సమయంలో వాహనదారులు హారన్లు కూడా మోగించలేదు. పాదాచారులు కూడా స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మరోకొన్ని చోట్ల కూడా విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, చిరు వ్యాపారస్థులు, ఇలా అన్ని వర్గాల ప్రజలు మౌనం పాటించారు. ఇందులో భాగంగా సచివాలయంతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులందరూ ఒకచోటికి చేరి మౌనం పాటించారు.

హైదరాబాద్‌లో రెండు నిమిషాలు మౌనం

మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా హైద్రాబాద్ నగరంలోని అన్ని ట్రాఫిక్ కూడళ్లలో రెండు నిమిషాలు మౌనం పాటించినట్లు నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్ రవీందర్ తెలిపారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల సంస్మరణార్థం నాంపల్లిలోని పోలీస్ కంట్రోల్ రూమ్ ముందు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రహదారులపై ఎక్కడికక్కడే వాహనాలు నిలిపివేసి మౌనం పాటించినట్లు ఆయన వెల్లడించారు. నగరంలోని ప్రధాన కూడలైన ఖైరతాబాద్ నాలుగు రహదారులకు రెడ్‌సిగ్నల్ వేసి పోలీసులు ట్రాఫిక్‌ను నిలిపివేశారు. పంజాగుట్టలోనూ ట్రాఫిక్ పోలీసులు వాహనాలను నిలిపివేసి నివాళులర్పించారు. పంజాగుట్ట కూడలి మీదుగా అమీర్‌పేట, కూకట్‌పల్లి వెళ్లే వాహనాలను, అదేవిధంగా సికింద్రాబాద్ నుంచి మెహదీపట్నం వెళ్లే వాహనాలను రెండు నిమిషాల పాటు నిలిపివేశారు. అనంతరం ట్రాఫిక్ పోలీసులతో పాటు వాహనదారులు, సామాన్య ప్రజలు గాంధీకి నివాళులర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ఏపీ పీసీసీ పగ్గాలు కేవీపీకా... చిరంజీవికా?

• రాహుల్ ఏఐసీసీ పగ్గాలు చేపట్టాకా ఇంకా చేయని ఏపీ పీసీసీల మార్పులు? • త్వరలో పీసీసీ మార్పులు అంటున్న ఏఐసీసీ వర్గాలు • ఏపీలో బలపడమే లక్ష్యంగా పీసీసీ అధ్యక్షుడి ఎంపిక? • వచ్చేది ఎన్నికల సమయం-అందుకే కేవీపీ...చిరంజీవి వైపు పార్టీ అధిష్ఠానం చూపు • పార్టీని ఉత్సాహంగా నడిపే నేతలుగా హైకమాండ్ దృష్టిలో కేవీపీ..చిరంజీవి • రాజకీయ సమీకరణలు మార్చే సత్తా వీరికేనన్న భావన? • వచ్చే ఎన్నికల్లో ఏపీ అసెంబ్లీలో కాలు మోపాల్సిందే? పార్లమెంటులో బలం పెంచుకోవాల్సిందేనన్న యోచనలో ఏఐసీసీ • పక్కా వ్యూహంతో ముందుకెళ్తున్న కాంగ్రెస్ అధినాయకత్వం?



(ఏపీ-పొలిటికల్ బ్యూరో) : రానున్నది ఎన్నికల సమయం కాబట్టి అందుకు తగ్గట్టు వ్యూహాలతోపాటు దేశంలోని అన్ని రాష్ట్రాలకు కొత్త పీసీసీలను ఎంపిక చేసే ప్రక్రియలో ఏఐసీసీ నాయకత్వం తలమునకలైనట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఈ సారి ఏపీ పీసీసీ పగ్గాలు ఉద్దండులైన నేతలకు అందించాలన్న యోచనలో ఉన్న కాంగ్రెస్ అధిష్ఠానం పార్టీ సీనియర్‌నేత, రాజ్యసభసభ్యుడు కేవీపీ రామచంద్రరావు, కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ నేత చిరంజీవి పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. వచ్చే ఎన్నికల్లో ఏపీ అసెంబ్లీలో కాలుమోపడమే లక్ష్యంగా ఈ రాష్ట్రం నుంచి మెజార్టీ ఎంపీ సీట్లే లక్ష్యంగా ఏపీ పీసీసీ అధ్యక్షుల ఎంపికను కాంగ్రెస్ అధిష్ఠానం చేపట్టనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రవిభజన అనంతరం ఏపీలో జరిగిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోరపరాజయం పాలైన విషయం తెలిసిందే. అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీ కాలుమోపలేకపోయింది. ఒక్క ఎంపీ సీటును సాధించుకోవడం అటుంచితే ఆ పార్టీ అభ్యర్థులు ఎన్నికల్లో తమ డిపాజిట్లను సైతం కోల్పోయారు. కానీ ఇటీవల ఏపీకి ప్రత్యేక హోదా, రాష్ట్రవిభజన బిల్లులోని హామీలపై కాంగ్రెస్ పార్టీ విస్తృత పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జనంలో పార్టీకి ఆదరణ ఉన్నా చరిష్మ ఉన్న నేత లేకపోవడం, పార్టీపై పట్టుసాధించే వారు లేకపోవడంతోనూ పార్టీకి ప్రతికూల ఫలితాలు వస్తున్నాయని ఏఐసీసీ భావిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఏపీ పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ఎన్.రఘువీరారెడ్డి జనంలోకి విస్తృతంగా వెళ్లి పనిచేస్తున్నారని ఏఐసీసీ అధిష్ఠానం గుర్తించినా ఆయన పదవీ కాలం ఇప్పటికే ముగ్గిసింది. అయితే రాహుల్‌గాంధీ ఏఐసీసీ అధ్యక్షుడు కావడంతో సహజంగానే అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులను పార్టీ అధినాయకత్వం మార్చాల్సి ఉంది. ఇదే సందర్భంలో ఏపీలో వచ్చే ఎన్నికల దృష్ట్యా పార్టీ పగ్గాలను సమర్థులైన వారికి అప్పగించాలన్న యోచనలో ఏఐసీసీ ఉంది. ఈ క్రమంలో ఏపీలో మరో ఏడాది లేదా ఎప్పుడైనా ఎన్నికలు వచ్చే అవకాశమున్నందున అక్కడ విజయమే లక్ష్యంగా ఏపీ పీసీసీ అధ్యక్షుడి ఎన్నికొనే విషయంలో ఏఐసీసీ ఆచితూచి అడుగులేస్తోంది. ఈ పదవీకి సైతం ఏపీ కాంగ్రెస్‌లో పోటీనెలకొన్నా పార్టీ అధినాయకత్వం మాత్రం పార్టీ సీనియర్ నేత, రాజ్యసభసభ్యుడు కేవీపీ రామచంద్రరావు, కేంద్ర మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నేత చిరంజీవి అభ్యర్థిత్వాలపైనే ప్రధానంగా దృష్టిసారించినట్లు సమాచారం. ఇలా ఆలోచించడానికి కాంగ్రెస్ అధిష్ఠానం యొక్క లెక్కలు కూడా ఉన్నాయని తెలుస్తోంది. ఈ ఇద్దరిలో ఎవరిని ఎంపిక చేసినా పార్టీ బలపడటమే కాదు అసెంబ్లీలో కాలుమెపడం, ఈ రాష్ట్రంనుంచి ఎంపీ సీట్లు సాధించుకోవచ్చని కాంగ్రెస్ అధినాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం.

ఈ నేతల ఎంపిక వెనక ఓ లెక్కుంది....?

ఏపీ పీసీసీ పగ్గాలు కేవీపీకి లేక చిరంజీవికి అప్పగించే విషయంలో ఓ ప్రత్యేక లెక్క ప్రకారం కాంగ్రెస్ అధిష్ఠానం ముందుకెళ్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ సీనియర్ నేత, రాజ్యసభసభ్యులు కేవీపీ రామచంద్రరావు విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం ప్రత్యేక లెక్కలతో ముందుకెళ్తోంది. వై.ఎస్.రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ఆయన పార్టీలో తిరుగులేని నేతగా ఎదిగారు. ఇందుకు కారణం వై.ఎస్.కు ఆత్మగా పేర్కొనబడే కేవీపీ రామచంద్రరావు వ్యూహాలు, తెరచాటు ఆయన చక్రం తిప్పడం వంటివి కీలకంగా మారాయని ఓ ప్రచారముంది. కేవీపీని సంప్రదించకుండా వై.ఎస్. ఎలాంటి నిర్ణయం తీసుకోరన్న ప్రచారం కూడా ఉంది. దీంతో కేవీపీ రామచంద్రరావు వద్ద మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నాడు ప్రదీక్షణలు చేసేవారు. తెరవెనక కాంగ్రెస్ పార్టీపై గట్టిపట్టును కేవీపీ సాధించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయనకు ఏపీ పీసీసీ పగ్గాలు అప్పగిస్తే కాంగ్రెస్‌తో దోస్తీ కోసం వైసీపీ దారిలోకి వచ్చే అవకాశాలున్నాయని హస్తం పార్టీ అధినాయకత్వం భావిస్తోంది. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇప్పుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు. వీరందరితో కేవీపీకి ఎనలేని బంధంతోపాటు ఆయనపై ఇప్పుడు వైసీపీలోని కొనసాగుతున్న కాంగ్రెస్ నేతలకు ఎనలేని గౌరవముంది. కేవీపీ పీసీసీ పగ్గాలు చేపడితే ఆయనపై గౌరవం ఉన్న నేతలు పార్టీలో ఉత్సాహంగా పనిచేయడంతోపాటు వైసీపీని దారిలోకి తెచ్చుకోవడం సాధ్యమవుతుందని హస్తం అధినాయకత్వం భావిస్తోంది. అదే క్రమంలో ఎన్నికల్లో వ్యూహాలు, తెరచాటు చక్రం తిప్పడంలో దిట్టా అయిన కేవీపీ పార్టీ పగ్గాలు చేపట్టేందుకు అంగీకరిస్తే పార్టీ దశనే మారుతుందని కాంగ్రెస్ హైకమాండ్ భావిస్తోంది.

కేవీపీ ఏపీ పీసీసీ పగ్గాలు పడితే పర్వాలేదు గానీ ఆయన స్పందన అందుకు భిన్నంగా ఉంటే మాత్రం ప్రత్యామ్నాయం దిశగా కేంద్ర మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నేత చిరంజీవి వైపు పార్టీ అధిష్ఠానం దృష్టిసారించే అవకాశాలున్నట్లు సమాచారం. సినీ హీరోగా చిరంజీవికి రాష్ట్రంలో మాస్‌గ్లామర్ మెండుగా ఉంది. అంతేకాకుండా ఇటీవల తన 150 చిత్రంతో చిరంజీవి రాష్ట్రంలో మరోసారి మాజ్‌లో ముద్రవేసుకొన్నారు. రాయలసీమకు చెందిన ఉయ్యాలవాడ



నర్సింహారెడ్డి చరిత్ర ఆధారంగా మరో సినిమాను చిరంజీవి చేపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో చిరంజీవి ఏపీ పీసీసీ పగ్గాలు చేపడితే బలమైన నేతలు పార్టీలో కొనసాగడమే కాకుండా వచ్చే ఎన్నికల్లో పార్టీకి మాస్ ఇమేజ్, జనంలో చరిష్మ ఉన్న నేత పార్టీకి లభించినట్లు అవుతుందని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తోంది. రాష్ట్ర రాజకీయాలలో జనసేన చొచ్చుకొస్తుంది. ఈ పరిస్థితుల్లో చిరంజీవి పార్టీ పగ్గాలు చేపడితే జనసేన అధ్యక్షుడిగా ఆయన సోదరుడు పవన్ కళ్యాణ్ ఉండటంతో కాంగ్రెస్ గట్టిగా ఈ రాజకీయ వాతావరణాన్ని తట్టుకోగలదని ఏఐసీసీ భావన. అయితే కేవీపీ ఏపీ పీసీసీ పగ్గాలు చేపట్టేందుకు విముఖత చూపే పరిస్థితుల్లోనే చిరంజీవి వైపు ఏఐసీసీ నాయకత్వం దృష్టిసారించే అవకాశముందని ఢిల్లీ కాంగ్రెస్ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఫిన్‌టెక్ అభివృద్ధిపై దృష్టి

వీఎం వేర్ సీవోవో రఘు రఘురాంను కలిసిన లోకేష్



(వెలగపూడి-సూర్య ప్రధాన ప్రతినిధి): వీఎం వేర్ సీవోవో రఘు రఘురాం ను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కలిశారు. ప్రస్తుతం అమెరికా పర్యట నలో ఉన్న లోకేష్ ఆయా సంస్థల ప్రతినిధులను కలుస్తున్నారు. పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగుతోంది. కాగా వీఎం వేర్ సివోవో రఘు రఘురాంను కలిసిన అనంతరం మంత్రి మాట్లాడుతూ అమెజాన్, గూగుల్ ఇండియా క్లౌడ్ కంపెనీలను ఏపీకి తీసుకొచ్చేందుకు చర్చలు జరుపుతున్నామన్నారు. అలాగే బ్లాక్ చైన్, ఫిన్‌టెక్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఐవోటీ, సెన్సర్లు, డ్రోన్లను పెద్ద ఎత్తున వినియోగిస్తున్నామని లోకేష్ పేర్కొన్నారు.

ఏపీతో కలిసి పని చేయడానికి సిద్ధం : రాజేష్ కాజాంచి

అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేష్ ప్రముఖ పారిశ్రామిక వేత్తలను కలుస్తూ బిజి బిజీగా ఉన్నారు. మంగళవారం కలర్ టోకెన్స్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ రాజేష్ కాజాంచిని కలిశారు. ఆ సంస్థ సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ సెక్యూరిటీ, డేటాబేస్ సెక్యూరిటీ సేవలు అందిస్తోంది. టెక్నాలజీ అనుసంధానంతో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని, వివిధ శాఖల సమాచారాన్ని అనుసంధానం చేస్తున్నామని మంత్రి రాజేష్ కాజాంచికి వివరించారు. లోకేష్ వ్యాఖ్యలపై స్పందించిన రాజేష్ ఏపీ ప్రభుత్వంతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. త్వరలోనే ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి అధ్యయనం చేస్తామని రాజేష్ కాజాంచి స్పష్టం చేశారు. తర్వాత క్లౌడ్ లెండింగ్ సొల్యూషన్స్ ప్రతినిధి స్నేహల్‌తో మంత్రి నారా లోకేష్ సమావేశం అయ్యారు. భారత్‌లో కార్యకలాపాలు విస్తరించాలనుకుంటున్నామని స్నేహల్ అన్నారు. బ్లాక్ చైన్ టెక్నాలజీపై ఏపీ ప్రభుత్వంతో పనిచేయడానికి సిద్ధమని, ఏపీలో పాలసీలు, రాయితీలపై అధ్యయనం చేసి, కంపెనీ ఏర్పాటుపై నిర్ణయం తీసుకుంటామని స్నేహల్ మంత్రి లోకేష్‌తో అన్నారు.

అంబేద్కర్ ఆలోచనలకు అనుగుణంగా సంస్కరణలు

• ఎస్సీ, ఎస్టీల రక్షణలో తెలంగాణ అగ్రస్థానం
• ఎస్సీ సంక్షేమశాఖ మంత్రి జగదీశ్ రెడ్డి

హైదరాబాద్, మేజర్‌న్యూస్ : విద్య, ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిస్తే అంటరానితనాన్ని పారదొలవచ్చన్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన అని రాష్ట్ర విద్యుత్, ఎస్సీ సంక్షేమశాఖ మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ ఆలోచనలకు అనుగుణంగా కేసీఆర్ సంస్కరణలు చేపడుతున్నారని చెప్పారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో పెద్ద ఎత్తున దళిత విద్యార్థుల కోసం గురుకులాల పాఠశాలలను సీఎం ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీల రక్షణకు చర్యలు తీసుకుంటున్న రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని ఆయన చెప్పారు. ఢిల్లీలో పీసీఆర్ చట్టం, పీవోఏ చట్టం అమలు తీరుతెన్నులపై జరిగిన 24 వ సదస్సులో మంత్రి జగదీష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సదస్సులో మంత్రి ఆయన మాట్లాడుతూ ఎస్సీలపై జరిగిన దాడుల్లో నమోదైన కేసుల పరిష్కారానికి తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పీసీఆర్, పీవోఏ చట్టాల అమలులో తెలంగాణ మొదటి స్థానంలో ఉందన్నారు. 20 శాతం కేసులు పరిష్కరించిన రాష్ట్రం ఒక్క తెలంగాణేనని ఆయన పేర్కొన్నారు. బాధితులకు ఆర్థిక సాయం, కేసుల విచారణకు ప్రత్యేక కోర్టుల్ను ఏర్పాటు చేశామన్నారు. పాత జిల్లాల్లో ప్రతీ జిల్లాలో ఒక కోర్టు, 9 మొబైల్ కోర్టులను ఏర్పాటు చేశామన్నారు. ఎస్సీ గురుకుల పాఠ్శాలల్లో వారంలో 7 రోజులు పౌష్టికాహారం అందిస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని అన్నారు. దళితులు సాధికారిత సాధించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తెలంగాణతో పాటు ఏపీ, బీహార్, గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిషా, రాజస్థాన్, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆయా రాష్ట్రాల్లో పీసీఆర్, పీవోఏ చట్టాల అమలుపై ఈసమావేశంలో చర్చించారు.

9 నుంచి ఓయూ శతాబ్ది రాష్ట్రస్థాయి పోటీలు

హైదరాబాద్, మేజర్‌న్యూస్: ఉస్మానియా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా వచ్చే నెల తొమ్మిదవ నుంచి ఓయూ శతాబ్ది రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించనున్నట్టు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా తెలంగాణ పాటలు, పెయింటింగ్, వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్, తెలంగాణ డ్యాన్స్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. వర్సిటీ పరిధిలోని అన్ని అనుబంధ కళాశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు వచ్చే నెల 7వ తేదీలోగా దరఖాస్తులు పంపించాలని సూచించారు.

సంపాదకీయం

editpage@suryaa.com

"ఎవరెన్ని హెచ్చరికలు జారీచేసినా తన పని తనదేనంటోంది ఉత్తరకొరియా.. తాజాగా అణుపరీక్ష నిర్వహించి మరోసారి అగ్రరాజ్యం అమెరికాకు సవాల్ విసిరింది. ఉత్తరకొరియా వరుస క్షిపణి ప్రయోగాలతో ఆసియా దేశాల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యం లోనే భారత్ ఉత్తరకొరియాపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉత్తర కొరియా చేస్తున్న ప్రయోగాలను భారత్ నిశితంగా పరిశీలిస్తోందని భారత విదేశీ వ్యవహారాల శాఖ చెప్పింది. కిమ్జాంగ్‌ఉన్ అణుఒప్పందాలను పదేపదే ఉల్లంఘించడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని వెల్లడించింది. ఇలాంటి చర్యలు శాంతికి విఘాతం కలిగిస్తాయని ఇప్పటికైనా ఉత్తరకొరియా ఇలాంటి ప్రయత్నాలను మానుకోవాలని హెచ్చరించడం గమనార్హం.. మరోవైపు ఉత్తర కొరియాకు ఊతం ఇస్తోన్న చైనా ఈ అణుపరీక్షను ఖండించింది. ఈ క్రమంలోనే ప్రపంచ దేశాలు ఉత్తరకొరియా చర్యలను వ్యతిరేకిస్తున్న తరుణంలో ఈ అణుపరీక్ష నిర్వహించడంపై మండిపడింది. ఇదిలా ఉంటే తాజాగా ప్రయోగించిన హైడ్రోజన్ బాంబ్‌తో ఉత్తరకొరియా ఇప్పటి వరకు ఆరు అణుబాంబులను పరీక్షించినట్లయ్యింది. ఉత్తుత్తి కొరియా'గా ఉత్తరకొరియాను ఒకప్పుడు అభివర్ణించిన అమెరికా ఇప్పుడు ఆ దేశం పేరు వింటేనే ఉలిక్కిపడుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదలుకొని ఆ దేశ నిఘా సంస్థ సీఐఏ అధినేత మైక్ పాంపియో వరకు అందరినీ ఉత్తరకొరియా ఎదుగుదలే ఆందోళనకు గురిచేస్తోందన్నది వాస్తవంగా కనిపిస్తోంది."

'ఉత్తిత్తి' కొరియా దెబ్బకి ఉలిక్కి పడ్డ ట్రంప్

ఉత్తరకొరియా హద్దుమీరుతోంది... ఎవరెన్ని హెచ్చరికలు జారీచేసినా తన పని తనదేనంటోంది. తాజాగా అణుపరీక్ష నిర్వహించి మరోసారి అగ్రరాజ్యం అమెరికాకు సవాల్ విసిరింది. ఉత్తరకొరియా వరుస క్షిపణి ప్రయోగాలతో ఆసియా దేశాల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యం లోనే భారత్ ఉత్తరకొరియాపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉత్తర కొరియా చేస్తున్న ప్రయోగాలను భారత్ నిశితంగా పరిశీలిస్తోందని భారత విదేశీ వ్యవహారాల శాఖ చెప్పింది. కిమ్జాంగ్‌ఉన్ అణుఒప్పందాలను పదేపదే ఉల్లంఘించడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని వెల్లడించింది. ఇలాంటి చర్యలు శాంతికి విఘాతం కలిగిస్తాయని ఇప్పటికైనా ఉత్తరకొరియా ఇలాంటి ప్రయత్నాలను మానుకోవాలని హెచ్చరించడం గమనార్హం.. మరోవైపు ఉత్తర కొరియాకు ఊతం ఇస్తోన్న చైనా ఈ అణుపరీక్షను ఖండించింది. ఈ క్రమంలోనే ప్రపంచ దేశాలు ఉత్తరకొరియా చర్యలను వ్యతిరేకిస్తున్న తరుణంలో ఈ అణుపరీక్ష నిర్వహించడంపై మండిపడింది. ఇదిలా ఉంటే తాజాగా ప్రయోగించిన హైడ్రోజన్ బాంబ్‌తో ఉత్తరకొరియా ఇప్పటి వరకు ఆరు అణుబాంబులను పరీక్షించినట్లయ్యింది.

అయితే ఒకప్పుడు ఉత్తరకొరియాను 'ఉత్తుత్తికొరియా'గా అభివర్ణించింది అమెరికా. ఇప్పుడు అదే ఉత్తుత్తికొరియా అమెరికా పాలిట పీడకలగా మారిందన్నది వాస్తవంగా కనిపిస్తోంది. ఇందుకు ప్రధాన కారణం- అతి తక్కువ వ్యవధిలోనే ఉత్తరకొరియా అత్యాధునిక అణ్వాయుధ పాటవ సముపార్జించిన తీరు తెన్నులే. ఉత్తర కొరియా సాధించిన అణుపాటవంపై అమెరికా నిఘా సంస్థ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ(సీఐఏ) ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పిస్తున్నా ట్రంప్ కి ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్‌ని రెచ్చగొట్టే ప్రకటనలు చేసారు మినహా, ఆ దేశంలో జరుగుతున్న వ్యవహారాలను కానీ ఆయుధ సంపత్తిని ప్రదర్శిస్తున్న తీరును కానీ పట్టించుకోలేదు. పైగా ఈ విషయంలో ఉత్తరకొరియాకు మిత్ర దేశాలుగా ఉన్న దేశాలను సైతం ఇబ్బందులు పెట్టేందుకు ప్రయత్నించారు.

ప్రస్తుతం జరిగిన అణుపరీక్షలతో మరోమారు సిఐఏ రంగంలోకి దిగి ఉత్తరకొరియా వ్యవహారాలను నిశితంగా గమనించడం ప్రారంభించింది. తాజాగా ఈ విషయాన్ని నిఘా సంస్థ అధినేత మీడియాకు వెలువరించడం గమనార్హం. ఆ నిజానికి ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగాలు చేపట్టడం ఒక ఎత్తు అయితే... అగ్రరాజ్యం అమెరికానే ఢీకొనే స్థాయికి చేరుకోవడం మరొక ఎత్తు. ఇప్పుడు ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ చేసింది. ఇదే. ఈ క్రమంలోనే వ్యూహాత్మకంగా తొలి నుంచి వ్యవహరిస్తున్న కిమ్ దేశంలో కరువు కాటకాలు ఉన్నప్పటికీ తన ప్రథమ ప్రాధాన్యత సైన్యానికి, అక్కడ జరిగే ఖర్చులకు ఇచ్చి పూర్తి స్థాయిలో బలోపేతం చేసారు. ప్రపంచ వ్యాప్తంగా పెరిగిన సాంకేతికతను ఎప్పటికప్పుడు పూర్తిగా తన సైన్యానికి అన్వయించడంతో పాటు ఎడాపెడా క్షిపణి ప్రయోగాలు జరిపి, ఏకంగా అమెరికానే సవాలు చేసే స్థాయికి ఎదిగారు. దీనికి ప్రధాన సాక్ష్యం.. అత్యంత తక్కువ సమయంలో ఆ దేశం అణుపాటవాన్ని పెంపొందించుకోవడమే. దీని వెనుక కిమ్ నేతృత్వంలోని ఉత్తరకొరియా శాస్త్రవేత్తల ఘనత అంతా ఇంతా కాదు. అయితే అమెరికాతో సహా ప్రపంచంలోని అన్ని దేశాలకూ అంతుపట్టని ప్రశ్నగా మారిన విషయమేమంటే, కొరియా నుంచి విడివడిన తదుపరి సాధారణ దేశంగా ఉన్న ఉత్తరకొరియా అనూహ్యంగా అణ్వాయుధాలను తయారు చేసే స్థాయికి ఎదగటం, అందుకు తగిన విధంగా సాంకేతిక పరిజ్ఞానం ఏ స్థాయిలో అందుకుందన్న దానిపైనే ఇప్పుడు చర్చ జరుగుతోంది. అయితే ప్రపంచ సాంకేతికతలో తనకంటూ ప్రత్యేక స్థానం దక్కించుకున్న చైనాతో పాటు ఉత్తరకొరియాకు పాకిస్తాన్ నుంచి కూడా ఈ విషయంలో సహాయం అంది ఉండి ఉంటుందని ఇప్పుడు అమెరికా అనుమానిస్తోంది.

ఉత్తుత్తి కొరియా'గా ఉత్తరకొరియాను ఒకప్పుడు అభివర్ణించిన అమెరికా ఇప్పుడు ఆ దేశం పేరు వింటేనే ఉలిక్కిపడుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదలుకొని ఆ దేశ నిఘా సంస్థ సీఐఏ అధినేత మైక్ పాంపియో వరకు అందరినీ ఉత్తరకొరియా ఎదుగుదలే ఆందోళనకు గురిచేస్తోందన్నది వాస్తవంగా కనిపిస్తోంది. అమెరికాపై దాడి చేస్తే, కనీసం మచ్చుకు కూడా ఆనవాళ్లు కనిపించని తీరుగా ఆదేశం ప్రదర్శించిన అణు సంపత్తి గుర్తించిన సీఐఏ డైరెక్టర్ మైక్ పాంపియో ఉత్తరకొరియా నుంచి అగ్రరాజ్యం అమెరికాకు పొంచి ఉన్న ముప్పు ఉన్నట్లు కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేయటం గమనిస్తే, అమెరికా కిమ్‌పేరు వింటేనే ఎంతలా భయపడిపోతోందో అర్థం అవుతుంది. సీఐఏ డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ఆయన తాజాగా మీడియా ముందుపలు విషయాలు వెల్లడించారు. ఉత్తరకొరియా అణ్వాయుధ సామర్థ్యం గణనీయంగా పెరుగుతోందని ట్రంప్ ప్రభుత్వం పసిగట్టిందని, అందుకే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆదిలోనే కిమ్‌కి హెచ్చరికలు పంపారని ఆయన పేర్కొన్నారు. అయితే పెరుగుతున్న ఉత్తరకొరియా అణుపాటవం నేపథ్యంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కొన్ని ప్రత్యామ్నాయాలు సూచించాల్సిన కర్త్యవ్యం తమపై ఉందని, ఈ ప్రత్యామ్నాయాలు దౌత్యేతర మార్గాల్లో ఉంటాయని ఏదో ఒక విధంగా ఉత్తరకొరియా ప్రాభవాన్ని తగ్గించేందుకు ఉన్న అన్ని మార్గాలను వినియోగించుకుంటామని వ్యాఖ్యానించడం చూస్తుంటే అమెరికా మరిన్ని కొత్త వ్యూహాలకు పదును పెడుతున్నట్లు కనిపిస్తోంది.

ఉత్తరకొరియాపై బలప్రయోగం భారీగా ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని, అమెరికాకు మిత్రపక్షాలైన దక్షిణ కొరియా, జపాన్ ఉండడంతో యుద్ధమంటూ సంభవిస్తే జరిగే పరిణామాలను అధ్యక్షుడు ట్రంప్ ముందుగానే పసిగట్టినందునే కిమ్‌ని పదవీచ్యుతుణ్ని చేయడం, లేదంటే అణ్వాయుధ సామర్థ్యాన్ని పరిమితం చేయడం వంటి ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టారు. మరి ఈ విషయంలో ట్రంప్ చేస్తున్న యత్నాలు ఎంతవరకు ఫలిస్తాయో చూడాలి.

తెరాసకు వ్యతిరేకంగా 'మహాకూటమి'?

ఎంవిఎస్ సత్య – హైదరాబాద్ 8333011972

- విపక్షాలను ఒకే గొడుకు చేర్పించే యత్నాలు
- కాంగ్రెస్ నేతృత్వంలో మహాకూటమికి ఏర్పాట్లు?
- వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న తెలంగాణ సిఎం
- టిడిపి, జనసేనలను తనవైపుకు లాగే ప్రయత్నం
- బహుజన్ ఫ్రంట్‌గా ఏర్పడుతున్న కమ్యూనిస్టు పార్టీలు



తెలంగాణలో టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అనుసరించిన విధానాల కారణంగా విపక్షాలు తీవ్రంగా నష్టపోయాయి. రానున్న రోజులలో ఏపార్టీ టిఆర్ఎస్‌ని ఎదుర్కొనే పరిస్థితి ఉండకూడదనే వ్యూహాన్ని అమలు చేసిన ముఖ్యమంత్రి కేసిఆర్ పన్నిన ఉచ్చులో అన్ని పక్షాలు పడి కకలా వికలమయ్యాయన్నది వాస్తవమేనన్న అభిప్రాయం సర్వత్రా నెలకొందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే 2019 ఎన్నికల్లో టిఆర్ఎస్ వ్యతిరేక ఓట్లను చీలిపోకుండా ఉండేందుకు విపక్షాలు ఇప్పటి నుండి ప్లాన్‌లో ఉన్నాయి. నిజానికి సింగరేణి ఎన్నికల సమయంలోనే విపక్షాలు అధికార టిఆర్ఎస్‌కు చెక్ పెట్టేందుకు ప్లాన్ చేసాయి. ఈ ఎన్నికల్లో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘాన్ని ఓడిస్తే 2019 ఎన్నికలకు మార్గం సుగమం అయ్యే అవకాశం ఉంటుందని విపక్షాలు భావించాయి. అయితే చివరి నిమిషం వరకు అంతా అంటకాగి తిరిగినా కేసీఆర్ తనయ, నిజామాబాద్ ఎంపి కవిత వ్యూహాత్మకంగా వ్యవహరించి విపక్షాలను ఛిన్నాభిన్నం చేయటంలో సక్సస్ కావటంతో తిజురుగులేని ఘనవిజయాన్ని అందుకుని తెలంగాణలో తెరాసకు తిరుగు లేదన్న భావనకు అన్ని పక్షాలను తీసుకురాగలిగారు. దీంతో 2019 నాటి ఎన్నికలలో తెరాసని ఓడించాలంటే అన్ని శక్తులు ఏకం కావాల్సిన అవసరం ఉందన్నది విపక్షాలన్నీ చెపుతున్నా, అదెంతవరకు సాధ్యమన్నది చూడాలి.

2004, 2009 ఎన్నికల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి అధికార కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా విపక్షాలు కూటమిని ఏర్పాటు చేసి పోటీచేశాయి. 2004లో ఈ ప్రయోగం విజయవంతమైంది. 2004లో టిడిపిని ఓడించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. 2009లో కాంగ్రెస్‌ను ఓడించేందుకు చేసిన కూటమి ప్రయోగం విజయం సాధించలేదు. కాంగ్రెస్ పార్టీ రెండోసారి విజయం సాధించి, అధికారాన్ని అందుకుంది. అయితే తెలంగాణలో ఇదే తరహ ఫార్ములాను అమలు చేయాలని విపక్షాలు భావిస్తున్నాయి. ఈ క్రమంలో 2019 ఎన్నికలకు ట్రయల్‌గా సింగరేణి ఎన్నికలను వేదికగా చేసుకొన్నాయి విపక్షాలు. రాబోయే ఎన్నికల్లో టిఆర్ఎస్‌ను ఓడించేందుకు తెలంగాణలో మహకూటమిని ఏర్పాటు చేసేందుకు విపక్షాలు రంగం సిద్దం చేస్తున్నాయి. కూటమిని ఏర్పాటుద్వారానే ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా ఉండేందుకు ఆస్కారం ఉందని అన్ని పార్టీ లు భావిస్తున్నాయి. ఈ కూటమిలో సిపిఐ, టిడిపి, కాంగ్రెస్, టిజెఎసి, సిపిఎం పార్టీలు ఉండే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. అయితే ఇప్పటికే కొందరు నేతలు కూటమి ఏర్పాటుపై ఇతర పార్టీల నేతలతో చర్చించినట్టు సమాచారం. అయితే విపక్షాలన్నీ ఈ కూటమిలో చేరుతాయా, లేదా ఓ వేళ చేరితే ఏఏ పార్టీ లు చేరుతాయనే దానిపై స్పష్టత రావడానికి సమయం పట్టే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

కాంగ్రెస్ ఈ కూటమికి సారధ్యం వహించే ఆస్కారం ఉందనిపిస్తోంది. అదే జరిగితే టిడిపి కూటమిలో కలుస్తోందా? అనే చర్చ కూడ లేకపోలేదు. అలాగే ఈ మహకూటమిలో సిపిఎం ఉండకపోవచ్చనే అభిప్రాయాలు కూడ వ్యక్తమౌతున్నాయి. ఇటీవలనే బహుజన లెఫ్ట్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేసి, తెలంగాణ లోని అన్ని స్థానాలకు పోటీ చేయనున్నట్టు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిసిన విషయమే. ఈ కారణంగానే మహకూటమి ఏర్పాటైతే సిపిఎం సారధ్యంలోని ఫ్రంట్ ఈ కూటమిలో చేరటం సాధ్యం కాకపోవచ్చన్న వాదలు వినిపిస్తున్నాయి. అభిప్రాయపడుతున్నారు.

2019 ఎన్నికల్లో టిడిపి పయమనమెటనేది కూడ చర్చనీయాంశంగా ఎమారుతోంది. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు మారుతున్న తరుణంలో టిడిపి ఏ రకంగా వ్యవహరిస్తోందనేది చూడాలి. మరోవైపు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, బి/జెపి రెండు పార్టీలతో కేసీఆర్ బలమైన పోటీని ఎదుర్కొనే అవకాశలున్నందున తనతో కలిసివచ్చే పార్టీలను కూడా కలువుకొని వచ్చే ఎన్నికల్లో గెలువు బావుటా ఎగరేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే తెరాస చేతిలో ఛిన్నాభిన్నమైన టీడీపీని ఎంచుకున్నట్టు కనిపిస్తోందని, ఇందుకు అనుగుణంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పార్టీని కూడా కలుపుకుపోయే ఆస్కారం ఉందన్న వార్తలు వస్తున్నాయి. ఇటీవల పవన్ కళ్యాణ్ తెలంగాణ సీఎం పాలనను ప్రశంసలతో ముంచెత్తడం వెనుక ఆంతర్యమిదేనని చెప్పేవారు ఉన్నారు. అయితే 2019 ఎన్నికల్లో ఒంటరి పోరు చేస్తానని తొలి నాళ్లలో చెప్పిన పవన్ కళ్యాణ్ తాజా పరిణామాల నేపథ్యంలో పొత్తుకు సిద్ధం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెపుతున్నా, పవన్ కళ్యాణ్తో ఇప్పటికే సిపిఎం, సిపిఐ రాష్ట్రాలకు చెందిన నేతలు కూడా ఆతనితో చర్చలు జరుపు తుండటాన్ని చూస్తుంటే ఆయన విపక్షాలతో కలిసి వెళ్తారా, టిఆర్ఎస్‌తో ముందుకు సాగుతారా అనే విషయంపై వేచి చూడాలి.

ఇక గత కొంత కాలంగా తెలంగాణ ప్రభుత్వానికి కంటిలో నలుసులా తయారైన తెలంగాణ జెఏసి ఛైర్మెన్ కోదండరామ్ సొంత పార్టీ కోసం ప్రయత్నాలు ప్రారంభించినా జెఏసిలోని వారు కొంతమంది వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గారు. అయితే విపక్ష పార్టీల కూటమికి మద్దతు ఇవ్వటంపై ఇప్పటికే పలువురు నేతలతో కూడ చర్చించినట్టు సమాచారం. అలాగే ఈ కూటమి ఏర్పాటు సారధ్యబాధ్యతలు వహించేందుకు సిద్ధం కావటంతో పాటు జెఏసి నుంచి పలువురికి టిక్కెట్లు ఇచ్చే ప్రతిపాదనలను కూడా పార్టీల ముందుకు ఉంచినట్లు తెలుస్తోంది. ఇందుకు కొన్ని పార్టీలు సానుకూలంగా ఉన్నాయనే సమాచారం. మరో వైపు కూటమి ప్రతిపాదనపై కాంగ్రెస్ పార్టీ ఇప్పటికిప్పుడే చొరవ చూపేందుకు ఇష్టపడడం లేదని, ఇతర పార్టీల నుండి ప్రతిపాదన వస్తే ఈ విషయమై చర్చించేందుకు సిద్దంగా ఉందని తెలుస్తోంది. కూటమిగా పోటీ చేస్తే సీట్ల సర్దుబాటు విషయమై తలనొప్పులు ఎదురయ్యే అవకాశం ఉన్నందున కాంగ్రెస్ కొంత వెనుకడుగు వేస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

తెలంగాణ ఇచ్చింది మేమే, తెచ్చింది మేమే అంటూ.. తెలంగాణ ప్రజలు రుణం తీర్చుకోవాలంటే కాంగ్రెస్‌కి ఓటేయాలని చాటుతూ ఒంటరిగా బరిలోకి దిగితే ఎలా ఉంటుందన్న విషయంపైనా పార్టీలో అంతర్గతంగా చర్చ ప్రారంభమైనట్లు విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు తెలుస్తోంది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల ఎంపిక అధిష్టానిదే తుది నిర్ణయం ఉంటుంది. కానీ ఈ సారి అభ్యర్థుల ఎంపికలో స్థానిక అభిప్రాయానికి ప్రాధాన్యత ఇవ్వటం, నియోజకవర్గం పరిధిలో నాయకత్వం అభిప్రాయం ఎవరి వైపు ఎక్కువగా మొగ్గు ఉంటే ఆ అభ్యర్థికే టికెట్ ఇవ్వాలని నిర్ణయానికి అధినాయకత్వం వచ్చినట్లు తెలుస్తుంది. ఇప్పటికే ఎంపీ, అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి అభిప్రాయాలను తీసుకున్నట్లు సమాచారం. టిఆర్ఎస్, బిజెపి పార్టీ అభ్యర్థులను ఢీ కొట్టే బలమైన అభ్యర్థిని ఎంపిక చేసి బరిలోకి దింపాలని అధిష్టానం భావిస్తోందని కాంగ్రెస్ నాయకులు అభిప్రాయరతోనే కాంగ్రెస్ చరిత్రలో ఏనాడూలేనట్టు మొట్టమొదటిసారి మండల, జిల్లాస్థాయి నాయకత్వం అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇచ్చేందుకు సిద్ధం కావటం పట్ల కూడా క్యాడర్ నుంచి ఆనందం వ్యక్తమవుతోంది.

ఏది ఏమైనా రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో.. ముక్కోణపు పోటీ తప్పనిసరి అయితే 1 శాతం ఓటు బ్యాంకు కూడా జాతకం తిరగబడేలా చేస్తుందాని చెప్పవచ్చు, ఇదే జరిగితే.. తెలంగాణలో పెను సంచలనం ఖాయం అంటున్నారు విశ్లేషకులు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

'కమలం' లోలోన వాడుతోందా?



సయ్యద్ నిసార్ అహమ్మద్
(పొలిటికల్ బ్యూరో) 7801019343

- 19 రాష్ట్రాలలో అధికారం ఉన్నా ఇంకా అనుమానమే
- పలుచోట్ల స్థానిక ఎన్నికలలో బిజెపి ఓటమి
- నేటికీ ఓటమిపై విశ్లేషించుకోని కమలనాధులు
- మత రాజకీయాలకు దూరంగా జరుగుతున్న ప్రజలు
- ప్రధాని నిర్ణయాలతో దేశ ఆర్థిక పరిస్థితిపై ఆందోళనలు



దేశంలోని 29 రాష్ట్రాలలో దాదాపు 19 రాష్ట్రాలలో బీజేపీ అధికారంలో ఉంది. కాబట్టి దేశంలోని రాజకీయ పార్టీలలో కమలం పార్టీయే బాహు బలిఅని ఇట్టే ఎవరైనా చెబుతారు. కానీ 19 రాష్ట్రాలలో బీజేపీ అధికారంలోకి వచ్చింది ఇప్పుడిపుడే కాదు మోడీ హవా అమాంతంగా సాగుతున్న సమయం నుంచి క్లిష్టపరిస్థితులు ఎదుర్కొంటున్న ఈ సమయం వరకు కూడా చెప్పవచ్చు. తమ పార్టీ ఇన్ని రాష్ట్రాలలో అధికారంలో ఉందని కమలం నేతలు గొప్పలు చెప్పుకొన్నా ఇటీవల జరుగుతున్న ఉప ఎన్నికలు, కార్పోరేషన్ ఎన్నికల్లో తమ పార్టీకి వస్తున్న వ్యతిరేక ఫలితాలను ఓ సారి బీజేపీ నేతలు పరిశీలించుకోవాల్సి ఉంది. గతంలో జరిగిన ఐదు ఉత్తరప్రదేశ్, ఉత్తారాఖండ్, పంజాబ్, గోవా, మణిపూర్ రాష్ట్రాల ఎన్నికలు జరగ్గా, ఒక్క పంజాబ్‌ను కాంగ్రెస్ కైవసం చేసుకొంది. మిగిలిన నాలుగు రాష్ట్రాలలో బీజేపీకి అనుకూల ఫలితాలు రాకపోయినా ఇతర పార్టీలనుంచి ప్రజా ప్రతినిధులు ఫిరాయింపులు చేయడంతో రాజకీయాలు తనకు అనుకూలంగా మారేలా కమలం పార్టీ చేసుకొంది. కానీ ఇటీవల జరుగుతున్న వివిధ రాష్ట్రాలలోని అసెంబ్లీ, లోకసభ ఉప ఎన్నికలతోపాటు పలు చోట్ల జరిగిన మున్సిపల్ కార్పోరేషన్, మున్సిపాలిటీ ఎన్నికల్లో మాత్రం ఫలితాలు బీజేపీకి రుచించని విధంగా వస్తున్నాయి. దీనిపై పలు రకాలుగా రాజకీయ విశ్లేషణలు సాగుతున్నాయి.

ఈ విశ్లేషణలు ఎలా ఉన్నా, ఇష్టమున్నా లేకున్నా బీజేపీ ప్రభావంలోనున్న కొన్ని కార్పోరేట్ మీడియా సంస్థలు సైతం కమలం వాడిపోతోందన్న వాస్తవాన్ని గ్రహించక తప్పదు. బీజేపీకి కొంత ప్రతికూల వాతావరణం ఏర్పడుతోంది అని చెబుతూనే దేశంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతుందన్న సంకేతాలు మాత్రం ఇవ్వడం లేదు. ఇటీవల జరిగిన గుజరాత్ ఎన్నికల ఫలితాలు కూడా ఈ విషయాన్ని స్పష్టంచేశాయి. ఈ ఎన్నికల్లో బీజేపీ మెరుగైన సీట్లు సాధిస్తుందని సర్వేలు తేల్చాయి. కానీ అతికష్టం మీద గుజరాత్‌లో బీజేపీ గట్టెక్కాల్సి వచ్చింది. ఓ రకంగా గుజరాత్ రాష్ట్రంలో ఎలాంటి క్యాడర్ లేకపోయినా కాంగ్రెస్ మెరుగైన సీట్లు సాధించిందని, ఇది హస్తం పార్టీకి నైతిక విజయమని అని మీడియాల్లో కథనాలు ప్రచురితమయ్యాయి.

పైకి చెప్పకపోయినా దేశంలో బీజేపీకి వ్యతిరేక గాలి వీస్తోందని ఆర్ఎస్ఎస్ ఇటీవల చేసిన సర్వే రిపోర్టు నిజమని ఇటీవల కమలం పార్టీకి అనేక ఎన్నికల్లో ఫలితాలు వ్యతిరేకంగా రావడం కనిపిస్తోంది. పైకి వీటిని కొట్టి పారేస్తున్నా కమలం నేతలు లోలోన మాత్రం అంతర్మథనం చెందుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని బీజేపీ ప్రభావిత మీడియా సంస్థలు పసిగట్టినా వాటిని బయటపెట్టే ధైర్యం మాత్రం చేయడంలేదని చెప్పాలి. మీడియా అంటేనే వాస్తవాన్ని తేల్చి ప్రజలను చైతన్యవంతం చేయడమే. కానీ అందుకు భిన్నమైన వాతావరణం మనదేశంలో నెలకొంటోంది. వాస్తవం చెప్పాల్సిన ప్రతిసారి తన విశ్లేషణ చేస్తూ తప్పని పరిస్థితుల్లో మాత్రమే మన కార్పోరేట్ మీడియా కొన్ని నిజాలు చెప్పేందుకు ముందుకొస్తోంది. అందుకే ఇటీవల బీజేపీకి ఉప ఎన్నికల్లో, కార్పోరేషన్ ఎన్నికల్లో ఫలితాలు వ్యతిరేకంగా రావడానికి గల కారణాలను పూర్తి స్థాయిలో విశ్లేషించి చెప్పలేకపోతోంది. కాకపోతే దేశంలోని ప్రజలు వాస్తవాన్ని గ్రహిస్తున్నారు అని చెప్పడానికి ఈ ఎన్నికల ఫలితాలను మనం నిదర్శనంగా చెప్పవచ్చు. ఏ అభివృద్ధి అజెండా పేరుతో 2014లో కేంద్రంలోకి బీజేపీ నేతృత్వంలోని నరేంద్రమోడీ సర్కార్ వచ్చిందో అది వాస్తవానికి ఆచరణ రూపం దాల్చడంలేదని మన దేశ ప్రజలు గ్రహిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మన దేశ ప్రజలు స్వతహాగా ఈ భ్రమల్లోనుంచి బయటపడుతున్నారు అని చెప్పేందుకు ఇటీవల బీజేపీకి వ్యతిరేకంగా వస్తున్న ఫలితాలను ఉదాహరణగా చెప్పవచ్చు. అంతేకాకుండా మతం పేరుతో రాజకీయాలు చేస్తే వాటిని అలవర్చుకొని అలవాటు పడే రకం కాదు మేమూ అని ఈ దేశ ప్రజలు ప్రతి ఎన్నికల్లో చాటిచెబుతూ వస్తున్నారు. ఇందుకు చక్కటి ఉదాహరణ ఇటీవల బీజేపీకి వస్తున్న వ్యతిరేక ఫలితాలు అని చెప్పవచ్చు.

ఆచ్చేదిన్...ప్రతి సామాన్యుడి ఖాతాల్లో నల్లధన కుబేరుల నుంచి నగదు లాగి వేస్తాం, గుజరాత్ అభివృద్ధిని దేశంలో అమలుచేసి తీరుతాం ఇది 2014లో బీజేపీ అభివృద్ధి అజెండా. ఈ ఎన్నికలకు ముందు గుజరాత్‌లో జరిగిన అభివృద్ధిని భూతద్దంలో చూసిన కార్పోరేట్ మీడియా 2014 ఎన్నికల్లో దేశ ప్రజలను ఆకర్షించింది. సహజంగానే ఆ ఎన్నికల్లో నరేంద్రమోడీ నేతృత్వంలోని బీజేపీ అధికారంలోకి వచ్చింది. 2014 ఎన్నికల్లో కార్పోరేట్ మీడియా భూతద్దంలో చూసిన అభివృద్ధిని నిజమని భావించి ఈ దేశ ప్రజలు నరేంద్రమోడీని గెలిపించారే తప్పా 2002 అల్లర్లను అజెండాను దృష్టిలో ఉంచుకొని మాత్రం కాదు. ఈ వాస్తవం మరోసారి బట్టబయలైంది.

కేంద్రంలో నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చాక అనేక మత దాడులు పలుచోట్ల పెట్రేగాయి. గో రక్షణ పేరుతో మైనార్టీలపై దాడులు అధికమయ్యాయి. ఆ తరువాత జరిగిన కొన్ని రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ ఓడినా మరికొన్ని రాష్ట్రాల ఎన్నికల్లో గెలిచింది. దీనిని బట్టి తమ మత అజెండాను ఈ దేశ ప్రజలు అంటే దేశంలో మెజార్టీ ఓటర్లుగా ఉన్న హిందూ సోదరులు అంగీకరిస్తున్నారు అన్న ధీమాతో మరింత దూకుడు పెంచింది బీజేపీ సర్కార్.

కానీ అభివృద్ధి అజెండా తప్పా మత అజెండా ఏ మాత్రం సహించమని ఇటీవల ఉప ఎన్నికలలో, కార్పోరేషన్ ఎన్నికలలో మన దేశ ఓటర్లు బీజేపీకి వ్యతిరేకంగా తీర్పు ఇస్తున్నారు. ఈ వాస్తవాన్ని మన కార్పోరేట్ మీడియా మాత్రం విస్త్రత ప్రచారం చేయడంలేదు. ఏదైన అభివృద్ధి జరగాలంటే ఏ ప్రభుత్వానికైనా కొంత సమయం ఇవ్వాలన్నది మన దేశ ఓటర్ల ఔనత్యం. వారి గొప్పతనం. ఆ గొప్పతనం మన దేశ ఓటర్లు ప్రదర్శించినా ఈ నాలుగేళ్ల కాలంలో బీజేపీ సర్కార్ ఏ మాత్రం అభివృద్ధికి బాటలు వేసిన దాఖలాలు కనిపించలేదు. ఈ కారణంతోనే మన దేశ ఓటర్లు ఇటీవల జరుగుతూ వస్తున్న ప్రతి ఎన్నికలలోనూ బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేస్తున్నారు.

కులం, మతం పేరుతో మెజార్టీ మతస్థులకు, మైనార్టీ మతస్థులకు మధ్య రాజేస్తున్న చిచ్చు రాజకీయాలను ఏ మాత్రం స్వాగతించడం లేదు ఈ దేశ ఓటర్లు. అందుకే నల్లధనం వెలికి తీత కోసం మోడీ సర్కార్‌కు ఈ దేశ ఓటర్లు మూడేళ్లు సమయం ఇచ్చారు. నల్లధనం వెలికితీతలో భాగంగానే పెద్ద నోట్ల రద్దు ఇబ్బంది అయినా ప్రతి సామాన్యుడి వాటిని మౌనంగా భరించాడు. కానీ మత అజెండా ఉన్న వారికి అభివృద్ధి అజెండా ఉండదని భావించిన ప్రజలు ఇప్పుడు వస్తున్న ప్రతి ఉప ఎన్నికల్లో గానీ, కార్పోరేషన్ ఎన్నికల్లోగానీ బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేస్తూ వస్తున్నారు. పైగా జీఎస్‌టీ వంటి అనాలోచిత నిర్ణయాలు తీసుకొన్న బీజేపీకి అసలు పాలించే హక్కేలేదన్న నిర్ధారణకు ఈ దేశ ప్రజలు వస్తున్నట్లు తెలుస్తోంది. మత అజెండానే ఏకైక అజెండగా మార్చిన గుజరాత్ రాష్ట్రంలోనూ బీజేపీకి వ్యతిరేక వాతావరణం ఏర్పడింది. ఆ వాస్తవం ఆ రాష్ట్ర ఎన్నికల్లో బీజేపీకి వచ్చిన ఫలితాలతో తేలిపోయింది. అంటే మత అజెండాతో ఎలకాలం పాలించలేమన్న వాస్తవాన్ని బీజేపీకి తెలియజేసే ప్రయత్నం ఈ దేశ ప్రజలు చేస్తున్నారు.

కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కార్ అధికారంలోకి వచ్చాక ప్రతి చోట నమో నమో అన్న నరేంద్రమోడీ వ్యక్తిపూజ పెరిగింది. ఈ నినాదంతో బీజేపీ, ఆర్ఎస్ఎస్, విహెచ్‌పి సోషల్ మీడియాలో పెట్రేగిపోతున్నాయి. మరోవైపు దేశంలో ఈ మూడేళ్ల కాలంలో ఏ సంస్థ పేరుతో సాగినా మత దాడులు మాత్రం పెట్రేగిపోయాయి. (మిగతా రేపు)

చరిత్రలో ఈరోజు

జనవరి 31

1943: రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీ సైన్యాలు రష్యా లోని స్టాలిన్‌గ్రాడ్ వద్ద రష్యా సైన్యానికి లొంగిపోయాయి.
1963: నెమలిని జాతీయ పక్షిగా భారత్ ప్రకటించింది.
2009: ఆస్ట్రేలియన్ ఓపెన్ బాలుర విభాగంలో భారత్‌కు చెందిన యుకీ భాంబ్రీ టైటిల్ నెగ్గి ఆస్ట్రేలియన్ ఓపెన్ జూనియర్ టైటిల్ పొందిన తొలి భారతీయుడిగా అవతరించాడు.
1666: షాజహాన్, మొఘల్ సామ్రాజ్యపు ఐదవ చక్రవర్తి మరణం.
2003: మేకా రంగయ్య అప్పారావు, నూజివీడు జమిందారీ కుటుంబానికి చెందిన వారు ప్రముఖ విద్యావేత్త, మాజీ మంత్రి మరణం.

నెమలి

నెమలి భారత దేశ జాతీయ పక్షి. నెమలిని చూడంగానే మనకు కొట్టొచ్చినట్లు కనబడేది వాటి అందమయిన ఈకలు. మగ నెమలికి మాత్రమే ఇటువంటి పొడావాటి ఈకలు ఉంటాయి. నెమలి శాకాహారం మరియు మాంసాహారం రెండిటినీ ఆహారంగా స్వీకరిస్తుంది. పూవుల రెక్కలు, మొక్క భాగాలు, విత్తనం మొలకలు, కీటకాలు, అప్పుడప్పుడూ బల్లి వంటి సరీసృపాలను మరియూ కప్పలు వంటి ఉభయచరాలను ఆహారంగా భుజిస్తాయి. ఈ జాతి నెమలి వేట, నివాసయోగ్యమయిన ప్రాంతాలు కరువవడం వల్ల అంతరించే దశకు చేరుకుంటున్నాయి. అంతరిస్తుందని భావిస్తున్న ఆకుపచ్చ రంగు నెమలి ఐదు వేరు వేరు జాతుల సమ్మేళనం. సాధారణంగా నెమలి జగడాల మారి, ఇతర పసుపక్షాదులతో అంత త్వరగా కలవవు.

షాజహాన్



షాజహాన్ జనవరి 5, 1592 జన్మించి, మరణం జనవరి 31, 1666న మరణించారు. మొఘల్ సామ్రాజ్యపు చక్రవర్తి, 1628 నుండి 1658 వరకూ భారతదేశాన్ని పరిపాలించాడు. బాబరు, హుమాయూన్, అక్బరు మరియు జహాంగీరుల తరువాత ఇతను ఐదవ మొఘల్ చక్రవర్తి. ఇతని కాలం 'మొఘల్ సామ్రాజ్యంలో స్వర్ణయుగం' అని భావిస్తారు. తాను అక్బరును ఆదర్శంగా తీసుకున్నాడని ప్రతీతి. ఇతని కాలంలోని నిర్మాణాలు ఇవి: షాజహాను దర్బారు, తాజ్‌మహల్, ఎర్ర కోట (ఢిల్లీ), జామా మస్జిద్ (ఢిల్లీ), మోతీ మస్జిద్ (ఆగ్రా), నెమలి సింహాసనం మొదలగునవి. షాజహాన్ ఆదరించిన గాయకులలో రామదాస్, మహాపత్తర్ అను హిందువులు ముఖ్యులు. ఈతని కుమారుడు దారా ప్రముఖ పండితుడిగా ఖ్యాతి పొందాడు. పర్షియన్, అరబిక్, సంస్కృతం భాషలలో ఇతని పాండిత్యం అద్వితీయమైనది.

ఎం.ఆర్. అప్పారావు



ఎం.ఆర్.అప్పారావుగా ప్రసిద్ధిచెందిన నూజివీడు జమిందారీ కుటుంబానికి చెందిన వీరి పూర్తి పేరు మేకా రంగయ్య అప్పారావు. ఆయన్ణ కృష్ణా జిల్లా నూజివీడు గ్రామంలో మార్చి 21, 1915లో జన్మించారు. జనవరి 31, 2003న పరమపదించారు. ఆయన ప్రముఖ విద్యావేత్త, మాజీ మంత్రి మరియు శాసనసభ్యుడు. ఈయన నూజివీడు శాసనసభ నియోజకవర్గం నుండి వరుసగా 1952, 1957, 1962, 1967 మరియు 1972లలో జరిగిన ఎన్నికలలో కాంగ్రెసు పార్టీ అభ్యర్థిగా గెలుపొందారు. నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రి వర్గాలలో కొంతకాలం సాంస్కృతిక, అబ్కారీ శాఖామాత్యులుగా సేవలందించారు. ఆ తరువాత రాజ్యసభకు ఎన్నికయ్యాడు. తొలిసారిగా 1952లో సి.పి.ఐ అభ్యర్థి దాసరి నాగభూషణరావును ఓడించి, శాసనసభకు ఎన్నికైన అప్పారావు, 1989లో ఒక్కసారి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీచేసి, కాంగ్రెస్ అభ్యర్థి పాలడుగు వెంకట్రావు చేతిలో ఓడిపోయిన తరుణం తప్ప మరెన్నడూ ఎన్నికలలో ఓటమి చవిచూడలేదు. ఈయన తన తండ్రి తెలుగులోకి అనువదించిన గీతా గోవిందాన్ని ఆంగ్లంలోకి మార్చారు. ఉమర్ ఖయ్యాం రుబాయిత్‌లను గేయ రూపంలో రాశారు.



ఆఫీస్ బాయ్‌ని ఒక్కసారిగా లక్షాధికారిగా మార్చిన పేటీఎం

న్యూఢిల్లీ: పేమెంట్ చెల్లింపు సేవల మాధ్యమం పేటీఎం, డీజిటల్ లావాదేవీల్లో శరవేగంగా దూసుకెళుతూ, తనను నమ్మిన ఉద్యోగులను లక్షాధికారులుగా మార్చేస్తోంది. తాజాగా ఆ కంపెనీ రెండో విడత స్టాక్స్ విక్రయాన్ని చేపట్టగా, అందులో పని చేస్తున్న పలువురు ఉద్యోగులు తమకున్న మైనారిటీ వాటాలను (ఈస్వాప్స్) భారీ మొత్తానికి విక్రయించుకున్నారు. ఈ క్రమంలో పేటీఎం ఆఫీస్ బాయ్ రూ. 20 లక్షలకు పైగా సంపాదించుకున్నాడని 'వన్ 91 కమ్యూనికేషన్ లిమిటెడ్' పేర్కొంది. ఆ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ హరీందర్ థాకర్ కు ఏకంగా రూ. 40 కోట్లు దక్కాయని తెలిపింది. కాగా, పేటీఎం సంస్థ విస్తరణ బాట పట్టిన తరవాత, సంస్థలో ఉద్యోగులకు స్థాయిని బట్టి 10 నుంచి 100 వరకూ ఈక్విటీ వాటాలను యాజమాన్యం అందించింది. ఇక గత సంవత్సరం మార్చితో పోలిస్తే, ఈ సంవత్సరం జనవరిలో పేటీఎం విలువ దాదాపు రూ. 20 వేల కోట్లకు పైగా పెరగడంతో వారి వాటాల విలువ కూడా పెరిగింది. ప్రస్తుతం పేటీఎంలో సాఫ్ట్ బ్యాంకు, ఎస్ఏఐఎఫ్ పార్టనర్స్, అలీబాబా గ్రూప్ హోల్డింగ్ లిమిటెడ్, యాంట్ ఫైనాన్సియల్ సర్వీసెస్ గ్రూప్ సంస్థలు ఇన్వెస్టర్లుగా ఉన్న సంగతి తెలిసిందే.

బిజినెస్

30-1-2018 ... మార్కెట్ సమాచారం

సెన్సెక్స్	
ఆరంభం	36,630.72
గరిష్ఠం	36,150.21
కనిష్ఠం	36,621.67
ముగింపు	**36,033.73**
మార్పు (పా)	-249.52
మార్పు (శా)	-0.71

నిఫ్టీ	
ఆరంభం	11,120.85
గరిష్ఠం	11,121.95
కనిష్ఠం	11,049.65
ముగింపు	**11,049.65**
మార్పు (పా)	-80.75
మార్పు (శా)	-0.73

ఎన్ఎస్ఈ ఇండియా మార్కెట్ గ్రాఫ్



సెక్టోరల్ ఇండెక్స్‌లు

ఇండెక్స్	ప్రస్తుతం	మార్పు (పా)	మార్పు (శా)
S&P BSE SENSEX 50	11,528.60	-76.16	-0.66
S&P BSE SENSEX Next 50	36,325.85	-296.21	-0.81
S&P BSE 100	11,462.86	-78.54	-0.68
S&P BSE Bharat 22 Index	3,867.65	+10.26	+0.27

అత్యధిక లాభాల్లో...

కంపెనీ (కోడ్)	ప్రస్తుతం	మార్పు (రూ)	మార్పు (శా)
RCOM	30.10	+2.85	+10.46
KPIT	219.30	+10.05	+4.80
HINDPETRO	392.30	+17.10	+4.56
BALKRISIND	1157.00	+48.05	+4.33
IOC	415.60	+16.85	+4.23

భారీ నష్టంలో...

కంపెనీ (కోడ్)	ప్రస్తుతం	మార్పు (రూ)	మార్పు (శా)
WOCKPHARMA	825.55	-83.45	-9.18
PCJEWELLER	520.85	-42.90	-7.61
JUSTDIAL	520.00	-41.90	-7.46
EMAMILTD	1142.10	-90.55	-7.35
INTELLECT	162.40	-12.65	-7.23

టాప్ టర్నోవర్

కంపెనీ (కోడ్)	ధర (రూ)	టర్నోవర్	వాల్యూమ్
AMBER	1237.25	216.09	1800863
EICHERMOT	26653.10	192.09	71304
YESBANK	353.45	142.29	3995380
IOC	415.60	114.61	2771862
ICICIBANK	352.60	94.03	2665176

రూపాయి మారకపు విలువ

కరెన్సీ	మారకపు విలువ	కరెన్సీ	మారకపు విలువ
డాలర్	63.4983	యూరో	79.0681
యన్	58.3600	పౌండ్	90.9169

బడ్జెట్ నుంచి ఆశిస్తున్నది ఇదే!

● ఆదాయ పన్ను మినహాయింపునకు అవకాశాలు ● రేపు బడ్జెట్ ను ప్రవేశపెడుతున్న కేంద్రం ● వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఉండవచ్చని అంచనాలు ● ఎన్నో ఆశలు పెట్టుకున్న కార్పొరేట్ రంగాలు

న్యూఢిల్లీ: కొన్నేళ్లుగా ఆదాయ పన్ను శ్లాబుల్లో మార్పులు చేయలేదు. గత బడ్జెట్‌లో కూడా పన్ను మినహాయింపు పరిధిని పెంచకుండా కేవలం కొన్ని ఊరటలను మాత్రమే ఇచ్చారు. ఈ నేపథ్యంలో 2018-19 బడ్జెట్‌లో పన్ను మినహాయింపు పరిధిని పెంచవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. కొత్తగా వచ్చే పన్ను మినహాయింపు పరిధి కూడా రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఉండవచ్చని భావిస్తున్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టే చివరి పూర్తిస్థాయి బడ్జెట్ కావడంతో జైట్లీ మధ్యతరగతి వర్గాలకు తీపికబురును చెబుతారనే ఆశాభావం సర్వత్రా వ్యక్తమవుతోంది.

★ వివిధ రకాల మినహాయింపులకు బదులు స్టాండర్డ్ డిడక్షన్‌ను తీసుకొస్తారని భావిస్తున్నారు. గతంలో ఉండే మినహాయింపును మళ్లీ తెరపైకి తీసుకు వచ్చే అవకాశాలున్నాయి. ఛాంబర్‌ఆఫ్ కామర్స్‌కు ఈ మినహాయింపును ఇవ్వాలని కోరుతోంది.

★ ప్రజల్లో కొనుగోలు శక్తిని పెంచేందుకు పన్ను మినహాయింపు శ్లాబును పెంచుతారని భావిస్తున్నారు. కనీస మినహాయింపు పరిధిని రూ. 3లక్షలు చేయవచ్చు.

★ రూ.50,000 వరకు వైద్య ఖర్చులపై మినహాయింపు ఇవ్వవచ్చు.


★ సెక్షన్ 80సి కింద ఇచ్చే పన్ను మినహాయింపులను పెంచవచ్చు. ఐదేళ్ల డిపాజిట్లపై ఇచ్చే మినహాయింపును మరింత సరళతరం చేస్తూ మూడేళ్ల డిపాజిట్లకు కూడా ఇవ్వవచ్చు.

★ దేశీయ కంపెనీలు షేర్ హోల్డర్లకు చెల్లించే డెవిడెండ్ పై విధించే పన్నును తగ్గించవచ్చు.

★ ప్రస్తుతం ఢిల్లీ, చెన్నై, కోల్‌కతా, ముంబయి నగరాల్లో నివసించేవారికి లభించే ఇంటి అద్దె చెల్లింపుపై అత్యధిక రాయితీ లభిస్తోంది. దీంతో ఈ సారి అత్యధిక రాయితీ వర్తించే నగరాల సంఖ్యను మరింత పెంచవచ్చు.

★ నోటీసు సమయం కంటే ముందే ఉద్యోగానికి రాజీనామా చేసే సమయంలో.. ఉద్యోగి యజమానికి చెల్లించే మొత్తానికి పన్ను మినహాయింపును ఇచ్చే అవకాశం ఉంది. ఉద్యోగి వాస్తవంగా అందుకున్న జీతానికి మాత్రమే పన్ను విధించే అవకాశం ఉంది.

కాగా, గురువారం నాడు కేంద్ర ప్రభుత్వం 2018-19 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్ ను ప్రవేశపెడుతోంది. వ్యవసాయ రంగానికి కేంద్రం ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వబోతోందని, వ్యాపార రంగానికి అనుకూలంగా బడ్జెట్ ఉండవచ్చని ఇన్వెస్టర్లు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏయే కార్పొరేట్ రంగాలు బడ్జెట్ నుంచి ఏమేం ఆశిస్తున్నాయో చూద్దాం.



బ్యాంకింగ్:

అప్పులు తీసుకున్నవారి నాన్ పర్ఫామింగ్ అస్సెట్స్ పై పూర్తి స్థాయిలో ట్యాక్స్ ఎత్తివేత.

బ్యాంక్ డిపాజిట్లపై చెల్లించే వడ్డీకి సంబంధించి... ప్రస్తుత కనిష్ట డిపాజిట్ల స్థాయిని రూ. 10వేలకు మించి పెంచడం.

రీటెయిల్ టర్మ్ డిపాజిట్లకు సంబంధించి ట్యాక్స్ మినహాయింపులను 5 ఏళ్ల కాల పరిమితి నుంచి 3 ఏళ్లకు తగ్గించడం.

ఇన్ సాల్వెన్సీ కోడ్ కింద ట్యాక్స్ రిలీఫ్ ఇవ్వడం.

టెక్నాలజీ/ఐటీ:

డిజిటల్ ట్రాన్జాక్షన్స్ కు ఎక్కువ ఇన్సెంటివ్ లు ఇవ్వడం.

డిజిటల్ పేమెంట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కు సహకారం అందించడం.

మొబైల్ ఫోన్స్, ట్యాబ్లెట్ కంప్యూటర్లకు సంబంధించి అనుకూలమైన ఎక్సైజ్ డ్యూటీ.

టారిఫ్ స్ట్రక్చర్ ను మరింత అనుకూలంగా మార్చడం.

ఆటోమొబైల్:

కాలం చెల్లిన కమర్షియల్ వాహనాలపై నిషేధం.

ఎలెక్ట్రిక్ వాహనాలపై జీఎస్టీ తగ్గింపు.

రియలెస్టేట్:

రియలెస్టేట్ ప్రాజెక్టులకు సింగిల్ విండో క్లియరెన్స్.

ఫైనాన్స్, ప్రాజెక్ట్ కాస్ట్ ను తగ్గించుకోవడం, ఇళ్లను తక్కువ ధరకే అందించడం కోసం రియలెస్టేట్ కు ఇన్ఫ్రాస్ట్రక్చర్ స్టేటస్ ఇవ్వడం.

ప్రస్తుతం 12 శాతం ఉన్న జీఎస్టీని తగ్గించడం.

స్టాంప్ డ్యూటీని కూడా తగ్గించడం.

ట్యాక్స్:

కార్పొరేట్ ట్యాక్స్ ను 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గించడం.

మినిమమ్ ఆల్టర్నేటివ్ ట్యాక్స్ ను 18.5 శాతం నుంచి 15 శాతానికి తగ్గించడం.

వ్యక్తిగతమైన పన్ను రాయితీలను పెంచడం.

దీర్ఘకాల పెట్టుబడులపై ట్యాక్స్ విధింపు.

వ్యవసాయం:

వ్యవసాయ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు రుణ లభ్యతకు సంబంధించి ఫండ్ ఏర్పాటు.

పంటల బీమా కోసం ఎక్కువ నిధులను మంజూరు చేయడం.

డ్యాములు, కెనాల్స్, మైక్రో ఇరిగేషన్ సిస్టమ్స్ కోసం ఎక్కువ పెట్టుబడులు.

కోల్డ్ స్టోరేజ్ ల నిర్మాణాలకు సబ్సిడీలు.

ఫర్టిలైజర్స్ పై సబ్సిడీలను తగ్గించడం.

ఆయిల్ అండ్ గ్యాస్:

ఆయిల్ అండ్ గ్యాస్ క్షేత్రాల అన్వేషణ, ఉత్పత్తికి సంబంధించి సెస్ డ్యూటీని 20 శాతం నుంచి 8-10 శాతానికి తగ్గించడం.

సహజవాయువుపై జీఎస్టీ తగ్గింపు.

గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలకు ఎక్సైజ్ డ్యూటీలో మినహాయింపు లేదా తగ్గింపు.

లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ దిగుమతులకు కస్టమ్స్ డ్యూటీ నుంచి మినహాయింపు.

మార్కెట్ ధర కంటే తక్కువకు కిరోసిన్, గ్యాస్ ను అమ్ముతున్న కంపెనీలకు సబ్సిడీలు.

మెటల్స్ అండ్ మైనింగ్:

వంటకు వాడే బొగ్గుపై కస్టమ్స్ డ్యూటీ తగ్గింపు.

ఐరన్ ఓర్ ఎగుమతులపై సుంకం తగ్గింపు.

దేశీయ పరిశ్రమలను కాపాడేందుకు అల్యూమినియమ్ స్క్రాప్ పై బేసిక్ కస్టమ్స్ డ్యూటీని పెంచడం.

మినరల్స్ అన్వేషణ కార్యక్రమానికి చేయూతనివ్వడం.


బంగారం:

స్మగ్లింగ్ ను అరికట్టేందుకు దిగుమతులపై ఉన్న ట్యాక్స్ ను 10 శాతం నుంచి 2-4 శాతానికి తగ్గించడం.

బడ్జెట్ భయంతో భారీ నష్టం

ఆద్యంతం నష్టాల బాటలో కొనసాగిన దేశీయ మార్కెట్లు

● 200 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్
● 81 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ
● చాలా రోజుల తరువాత నష్టాల్లో



ముంబై: కొత్త కొత్త రికార్డులను తిరగరాస్తూ దూసుకుపోయిన స్టాక్ మార్కెట్లు ఇవాళ వెనక్కి తగ్గాయి. బడ్జెట్ ప్రకటనకు రెండు రోజుల ముందు ఇలా జరగడంతో మదుపర్లు తీవ్రఅసంతృప్తికి గురయ్యారు. దేశీయ కంపెనీల్లో లాభాల స్వీకరణకు మదుపర్లు ఆసక్తి చూపించడంతో మార్కెట్లు ప్రారంభం నుంచే నష్టాల బాట పట్టాల్సి వచ్చింది. మంగళవారం ఉదయం 80 పాయింట్లకు పైగా నష్టంతో ట్రేడింగ్ను ఆరంభించిన సెన్సెక్స్ ఆ తర్వాత ఏ దశలోనూ కోలుకోలేదు. ఆద్యంతం ఒత్తిడికి గురైన సూచీ చివరకు 249 పాయింట్లు దిగజారి 36,034 వద్ద ముగిసింది. అటు నిఫ్టీ కూడా 81 పాయింట్ల నష్టంతో 11,050 వద్ద స్థిరపడింది. డాలర్తో రూపాయి మారకం విలువ రూ. 63.67గా కొనసాగుతోంది. ప్రపంచమార్కెట్ల ప్రతికూల సంకేతాలు, ఆర్థిక సర్వే వ్యాఖ్యల నేపథ్యంలో కీలక సూచీలు రికార్డ్ స్థాయిల నుంచి వెనక్కి మళ్లాయి. భారీగా అమ్మకాల ఒత్తిడితో ట్రేడింగ్‌ను ఆరంభించిన మార్కెట్లలో చివరి వరకూ అదే ధోరణి కొనసాగింది. దాదావు అన్ని రంగాలు నష్టాల్లోనే ముగిశాయి. ఐటీ, ప్రయివేట్ బ్యాంక్స్, రియల్టీ ప్రధానంగా నష్టపోయాయి. ముఖ్యంగా ఫిబ్రవరి 1 న రానున్న యూనియన్ బడ్జెట్ నేపథ్యంలో పెట్టుబడిదారులు, ట్రేడర్లు లాభాల స్వీకరణకు దిగినట్టు విశ్లేషకులు తెలిపారు. ఐషర్, కొటక్ బ్యాంక్, ఇన్‌ఫ్రాటెల్, బాష్, బజాజ్ ఫైనాన్స్, డాక్టర్ రెడ్డీస్, ఏషియన్ పెయింట్స్, యూపీఎల్, హిందాల్కో, యాక్సిస్ నష్టాల్లోనూ, హెచ్‌పీసీఎల్, ఐవోసీ, బీపీసీఎల్, హీరో మోటో, కోల్ ఇండియా, భారతీ, సన్ ఫార్మా, ఎస్‌బీఐ లాభాల్లోనూ ముగిశాయి.

కానన్ ఇమేజ్ స్క్వేర్ వెర్షన్ 3.0



న్యూఢిల్లీ: ఇమేజింగ్ టెక్నాలజీలో అగ్రగామి సంస్థ కానన్ ఇండియా తాజాగా కానన్ ఇమేజ్ స్క్వేర్ 3.0 పేరిట జెన్ జెడ్ వెర్షన్ రిటైల్ అవుట్‌లెట్‌లను ప్రారంభించినట్లు వెల్లడించింది. ఇది కానన్ ఇండియాకు సంస్థాగతంగా మైలు రాయివంటిదని సంస్థ పేర్కొంది. వినియోగదారునికి పూర్తిస్థాయి సంతృప్తిని అందించడమే కానన్ ఇమేజ్ స్క్వేర్ 3.0 లక్ష్యమని సంస్థ వెల్లడించింది. ఈ సందర్భంగా కానన్ ఇండియా సీఈఓ, ప్రెసిడెంట్ కజుతాడ కొబాయాషి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మా రిటైల్ అవుట్‌లెట్లను కానన్ ఇమేజ్ స్క్వేర్ పేరిట పేరొందాయి. అత్యున్నత స్థాయి టెక్నాలజీని అందించడమే సంస్థ లక్ష్యం. దీనికితోడు మా స్టోర్లను థర్డ్ వెర్షన్‌కు డెవలప్ చేశాం. ఈ మార్పులన్నీ వినియోగదారునికి అత్యద్భుత అనుభూతిని పంచుతాయని భావిస్తున్నామన్నారు.

హైదరాబాద్‌లో అమెరికన్ ఇండియా ఫౌండేషన్



హైదరాబాద్: భారతదేశంలో సామాజిక, ఆర్థిక మార్పులకు ఉత్ప్రేరకంగా నిలుస్తూ, దారిద్ర్య నిర్మూలనకు కట్టుబడిన అమెరికన్ ఇండియా ఫౌండేషన్ నాయకత్వ బృందం హైదరాబాద్‌లో విద్య, జీవనోపాధి కార్యక్రమాలను సందర్శించింది. రెండు రోజుల పర్యటన సందర్భంగా అధ్యక్షురాలు లతా కృష్ణన్ షా, సీఈఓ నిశాంత్ పాండే, బోర్డ్ సభ్యులు డిజిటల్ ఈక్విలైజర్ ప్రోగ్రామ్ చేపట్టిన పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులను కలుసుకున్నారు. మార్కెట్ అలైన్డ్ స్కిల్స్ ట్రైనింగ్ (ఎంఏఎస్‌టి), ఎబిలిటీ బేస్డ్ లైవ్‌లిహుడ్ ఎంపవర్‌మెంట్ (ఏబీఎల్‌ఈ) ప్రోగ్రామ్స్ లబ్ధిదారులు, సిబ్బంది, తల్లిదండ్రులతో వారు ముచ్చటించారు. ఈ సందర్భంగా సీఈఓ నిశాంత్ పాండే మాట్లాడుతూ, ప్రజలందరికీ అందుబాటులో విద్య, ఆరోగ్యసంరక్షణ, జీవనోపాధి అవకాశాలు కల్పించేందుకు అమెరికన్ ఇండియా ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు.

కార్బన్ ఫోన్లపై ఐడియా క్యాష్‌బ్యాక్ ఆఫర్

హైదరాబాద్: ప్రముఖ టెలికాం సంస్థ ఐడియా సెల్యులార్ కార్బన్ మొబైల్స్ సంస్థతో భాగస్వామ్యం అయి ఆ కంపెనీకి చెందిన పలు స్మార్ట్‌ఫోన్లపై క్యాష్ బ్యాక్ ఆఫర్లను ప్రకటించింది. ఇందులో భాగంగా కార్బన్ ఎ41 పవర్, ఎ9 ఇండియన్ ఫోన్లపై రూ.1500 క్యాష్‌బ్యాక్ లభిస్తుండగా, కార్బన్ యువ 2పై రూ.2వేలు, కార్బన్ కె310ఎన్, కె24 ప్లస్, కె9 జంబో ఫీచర్ ఫోన్లపై రూ.1000 వరకు క్యాష్ బ్యాక్‌ను ఐడియా అందిస్తోంది. ఈ ఆఫర్ ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అందుబాటులోకి రానున్నట్టు ఐడియా వెల్లడించింది. అయితే క్యాష్ బ్యాక్ ఆఫర్ పొందాలంటే ఈ ఫోన్లలో ఐడియా ప్లాన్ రూ.145ను వాడాల్సి ఉంటుంది.

ఉబర్ బజార్‌తో మరింత ఉత్తమ సేవలు

హైదరాబాద్: ప్రపంచంలోని అతి పెద్ద ఆన్ -డిమాండ్ రైడ్-షేరింగ్ కంపెనీ ఉబర్ తాజాగా తన డ్రైవరు భాగస్వాములకు అంకితభావంతో అత్యుత్తమ సేవలను అందించేందుకు ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, అహ్మదాబాద్, చెన్నై, గౌహతి, హైదరాబాద్, జైపూర్, కొచ్చి, కొల్‌కత్తా , పుణెల్లో ఒన్-స్టాప్ షాప్ ఉబర్ బజార్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. డ్రైవరు భాగస్వాముల అవసరాలను మరింత వేగవంతంగా పరిష్కరించేందుకు అందుబాటులోకి తీసుకు వచ్చిన ఉబర్ బజార్, ప్రస్తుతం 11 నగరాల్లో అందుబాటులోకి వచ్చింది. ఈ కార్యక్రమంలో భాగంగా డ్రైవరు భాగస్వాములు కారు నిర్వహణ వర్క్‌షాపులు, ఫ్యూయల్ కార్డులు తదితర సేవలను అందుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని సంస్థ తెలిపింది.

వినూత్న అనుభూతుల కోసం కొత్త మోటో ఎక్స్




హైదరాబాద్: ప్రముఖ స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తుల సంస్థ మోటోరోలా అధునాతన ఫీచర్లతో పాటు 6 జీబీ ర్యామ్, 64 జీబీ ఇంటర్నల్ స్టోరేజీ కలిగిన మోటోఎక్స్ స్మార్ట్‌ఫోనును విడుదల చేసింది. ఈ స్మార్ట్‌ఫోను ఆండ్రాయిడ్ 8.0 ఓరియో ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుందని సంస్థ తెలిపింది. అలాగే దీనిలో ఫాస్టర్ స్పీడ్స్, లాంగర్ బ్యాటరీ లైఫ్, స్క్రీన్ క్యాపబులిటీస్, స్మార్ట్ టెక్స్ట్ సెలక్షన్ మొదలైన సదుపాయాలున్నట్లు పేర్కొంది. అలాగే మోటో ఎక్స్ ఫీచర్స్ కలిగిన స్నాపియర్ 12 ఎంపీ ప్లస్ 8 ఎంపీ వైడ్ యాంగిల్ డ్యూయల్ రేర్ కెమెరా కలిగివుంది. అలాగే 16 ఎంపీ, ఫ్లాష్‌తో కూడిన ఫ్రంట్ కెమెరా సదుపాయం ఉంది.

హీరో నుంచి 'ఎక్స్‌ట్రీమ్ 200ఆర్'




ముంబై: ద్విచక్ర వాహనాల ఉత్పత్తిలో ప్రపంచంలోనే అతి పెద్ద సంస్థగా పేరుగాంచిన హీరో మోటో కార్ప్ లిమిటెడ్ తాజాగా అత్యధిక ఇంజన్ సామర్థ్యంతో కూడిన ఎక్స్‌ట్రీమ్ 200ఆర్‌ను మార్కెట్‌లో ఆవిష్కరించింది. హీరో వాహనాల సామర్థ్యాన్ని మరింత పెంపొందించేలా ఈ నూతన వాహనాన్ని ప్రవేశపెట్టినట్లు సంస్థ వెల్లడించింది. ఈ నూతన వాహన శ్రేణి దేశంలోని హీరో మోటో కార్ప్ డీలర్‌షిప్స్‌లో అందుబాటులో ఉంటుందని సంస్థ తెలిపింది. అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ వాహనాన్ని రూపొందించినట్లు పేర్కొంది. ఈ సందర్భంగా హీరో మోటోకార్ప్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ మార్కస్ బ్రూన్‌స్పెంజర్ మాట్లాడుతూ ఈ నూతన వాహనానికి సంస్థ ఆర్ అండ్ డీ విభాగం సాగించిన పలు పరిశోధనల అనంతరం రూపకల్పన చేశారన్నారు.

పూర్ణియా నుంచి హై క్వాలిటీ ప్రొడక్ట్స్



హైదరాబాద్: ప్రముఖ పెట్ కేర్ సంస్థ నెస్లేపూర్ణియాకు 80 ఏళ్ల చరిత్ర ఉంది. డాగ్, క్యాట్ ఫుడ్ ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్న సంస్థ తాజాగా శునకాల కోసం స్మార్ట్ బ్లెండెడ్‌తో కూడిన పూర్ణియా సూపర్‌కోట్ ఫుడ్‌ను ఆవిష్కరించింది. ఈ సూపర్ కోట్‌ను ఆర్టిఫిషియల్ కలర్స్, ఫ్లేవర్స్ లేకుండా అత్యుత్తమ నాణ్యతతో రూపొందించినట్లు సంస్థ తెలిపింది. దేశంలో 19 మిలియన్ల పెట్స్ ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో పెట్ ఫుడ్ ఇండస్ట్రీకి అమితమైన ఆదరణ ఉంది. ఈ సందర్భంగా పూర్ణియా పెట్ కేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వరింద్రసేవాక్ మాట్లాడుతూ 80 ఏళ్ల చరిత్ర కలిగిన నెస్లే పూర్ణియా హై క్వాలిటీ ఫుడ్‌ను అందించేందుకు నిత్యం కృషి చేస్తుంటుంది. ఈ నేపథ్యంలోనే ఈ నూతన ఉత్పత్తిని ఆవిష్కరించామన్నారు.

అథ్లెట్ శివకేశవన్‌కు 'హీరో' తోడ్పాటు



న్యూఢిల్లీ: ప్రముఖ హీరో ఎలక్ట్రానిక్స్ అండ్ హీరో ఫిన్‌కార్ప్ తాజాగా అథ్లెట్ శివకేశవన్‌కు స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నట్లు తెలిపింది. శివకేశవన్ వింటర్ ఒలింపిక్స్-2018లో పాల్గొంటున్నాడు. కాగా శివకేశవన్ గతంలో జాతీయ అంతర్జాతీయ పతకాలను అందుకున్నారు. 2017లో జర్మనీలో జరిగిన ఆసియన్ లీగ్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నాడు. కాగా శివకేశవన్ సిక్స్‌త్ ఒలింపిక్స్ గేమ్స్‌లో భారత్ నుంచి ప్రాతినిధ్యం వహించారు. అలాగే నాలుగు ఆసియన్ గోల్డ్ మెడల్స్, నాలుగు రజిత పతకాలు, రెండు కాంశ్య పతకాలు సాధించాడు. శివ స్ఫూర్తిదాయక గాథకు మా చేయూత తోడైందని హీరో ఎలక్ట్రానిక్స్ ఫౌండర్, డైరెక్టర్ ఉజ్వల్ ముంజల్ తెలిపారు.

పెట్రోలు ధరలపై భగ్గుమంటున్న ప్రజలు

పెరిగిన పెట్రోల్ ధరలకు వ్యతిరేకంగా ఆందోళన



ముంబై: దేశవ్యాప్తంగా పెట్రోల్ ధరలు భగ్గుమంటున్నాయి. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరిగిపోవడంతో ఆ భారాన్ని పెట్రోలియం కంపెనీలు నేరుగా వినియోగదారులపై మోవుతున్నాయి. దీంతో పెట్రోల్ ధర మోత మోగుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ. 75కు అటు-ఇటుగా ఉంటోంది. దేశవ్యాప్తంగా పెట్రోల్ ధరలు ఇంచుమించు ఇదేరీతిలో ఉంటున్నాయి. పెట్రోల్, డీజిల్ ధరలు అమాంతం పెరిగిపోతున్నా.. ప్రభుత్వాలు ఉపశమన చర్యలు తీసుకోకపోవడంపై ప్రతిక్షాలు మండిపడుతున్నాయి. పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ముంబైలో ఆందోళన నిర్వహించింది. కాంగ్రెస్ మహిళా కార్యకర్తలు చేతిలో పళ్లెలను పట్టుకొని.. వాటిని మోగిస్తూ.. నిరసన తెలిపారు. దేశంలోనే పెట్రోల్‌కు అత్యధిక ధర ఉన్నది ముంబైలోనే. గతంలో ఎప్పుడూ ఇంతటి ధరలు లేవు. ప్రధాని మోదీ పెట్రోల్ ధరలు తగ్గించాలి. పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తేవాలి అని కాంగ్రెస్ నేత సంజయ్ నిరూపమ్ అన్నారు.

ఇక, పెట్రోలియం ఉత్పత్తులు జీఎస్టీ పరిధిలోకి వస్తే.. వీటి ధరలు తగ్గే అవకాశముందన్న వాదన ఉంది. పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తేవాలన్న డిమాండ్ ఎప్పటినుంచో ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడ్డగోలుగా వేస్తున్న పన్నులు, సుంకాల వల్ల పెట్రోల్, డీజిల్ ధరలు అమాంతం పెరిగిపోతున్న నేపథ్యంలో దేశమంతటా ఒకే పన్ను విధానాన్ని అవలంబించేందుకు ఉద్దేశించిన జీఎస్టీ పరిధిలోకి ఇవి వస్తే సామాన్యులకు కొంత ఊరట లభించే అవకాశముందని నిపుణులు చెప్తున్నారు. పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావడంపై తమకు అభ్యంతరం లేదని పెట్రోలియం కంపెనీలు సైతం చెప్తున్నాయి.

ఇలా చేయడం వల్ల పెట్రో పన్నుల ప్రక్రియ సులభతరం అవుతుందని అంటున్నాయి. ఈ విషయమై ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ చైర్మన్ సంజీవ్ సింగ్ స్పందిస్తూ.. పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తెస్తే.. ఈ ప్రక్రియ సులభతరం అవుతోంది. ప్రతి ఒక్కరూ అన్ని ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తేవాలని కోరుతున్నారు. ఏం జరుగుతుందో చూడాలి. ప్రస్తుతం అన్ని ఉత్పత్తులు జీఎస్టీ పరిధిలో లేకపోవడం మాకు కొంత ప్రతికూలతగానే అనిపిస్తోంది అని పేర్కొన్నారు. మొత్తానికి పెట్రోలియం ఉత్పత్తులు జీఎస్టీ పరిధిలోకి తెస్తారా? లేదా? అన్నది ఇప్పటికైతే సస్పెన్స్‌గా కనిపిస్తోంది.

వైద్య విద్యార్థులకు మెడికోస్ యాప్ తోడ్పాటు



న్యూఢిల్లీ: వైద్యవిద్యార్థులు, వైద్యులు, ఆరోగ్య సంరక్షణ వృతి నిపుణులు తమ వృత్తిపరమైన నెట్‌వర్క్‌ను పెంచుకునేందుకు వీలు కల్పించేలా ఈ మెడికోజ్ యాప్‌ను రూపొందించారు. యాపిల్, ఆండ్రాయిడ్ యూజర్లకు ఇది అందుబాటులోకి వచ్చింది. వైద్యవిద్యకు తోడ్పాటు నందించేలా దేశంలో రూపొందిన మొట్టమొదటి యాప్ ఇది. దీనిసాయంతో వైద్యులు, వైద్య విద్యార్థులు ఒకరితో ఒకరు అనుసంధానం కావచ్చు. దీనికితోడు వైద్యరంగానికి సంబంధించిన చర్చలు సాగించవచ్చు. ఈ సందర్భంగా యాప్ రూపకర్త ఎడ్యుప్రెన్యూనర్, ప్రాక్టీసింగ్ రేడియాలజిస్టు డాక్టర్ సుమేర్ సేథి మాట్లాడుతూ వైద్య విద్యార్థులు వైద్య విద్య ఆధారిత కంటెంట్‌ను ఉపయోగించుకునే తీరుతెన్నులను మార్చడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా లైవ్ స్ట్రీమింగ్, రికార్డెడ్ వీడియోల సమ్మిళితంగా కోర్సులు ఉంటాయని యాప్ నిర్వాహకులు తెలిపారు. ఈ మధ్యకాలంలో ఈ విధమైన కోర్సులకు డిమాండ్ పెరిగిందని పేర్కొన్నారు.

ఫ్యామిలీ హాలిడేను ప్రారంభించిన గుడ్ డే

న్యూఢిల్లీ: దేశంలో అగ్రగామి కుక్ బ్రాండ్ బ్రిటానియా గుడ్ డే ఈ నూతన సంవత్సరంలో ది గ్రేట్ ఇంటర్నేషనల్ ఫ్యామిలీ హాలిడేను ప్రారంభించినట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా బ్రిటానియా మార్కెటింగ్ ఉపాధ్యక్షుడు ఆలి హ్యారిస్ శెరె మాట్లాడుతూ గుడ్ డే చిరునవ్వులను అందిస్తుంది. ఈ సంవత్సరం అంతా ఇలాంటి ఆనందం సొంతమయ్యేందుకు బ్రిటానియా గ్రేట్ ఇంటర్నేషనల్ ఫ్యామిలీ హాలిడేను ప్రారంభించింది. ప్రస్తుతకాలంలో ఒత్తిడితో కూడిన జీవన విధానం పెరిగిపోయి, కుటుంబంతో గడిపే అవకాశం తగ్గిపోయింది. అందుకే వీటిని చేరువచేసేందుకు బ్రిటానియా ఈ నూతన కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇది సెలవులను సంతోషంగా గడిపేందుకు అవకాశాన్ని కల్పిస్తుందని అన్నారు.

మేడారం జాతరకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

50 కేంద్రాల నుంచి 4200 బస్సుల నిర్వహణ

- 10 నుంచి 12 లక్షల మంది ప్రయాణించే ఛాన్స్
- అధికారులతో ఏర్పాట్లను సమీక్షించిన ఎండీ

హైదరాబాద్, మేజర్‌న్యూస్ : ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా రికార్డు నమోదు చేసుకున్న మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నిర్వహిస్తోంది. 50 కేంద్రాల నుంచి 4200కుపైగా ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు అధికారులు తెలిపారు. నేటి నుంచి ప్రారంభమయ్యే మేడారం జాతర ఫిబ్రవరి 2 వరకు కొనసాగనుంది. ఈ నాలుగు రోజుల్లో భక్తుల రద్దీ దృష్ట్యా మరిన్ని ప్రత్యేక బస్సులు నడిపించేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని ఆర్టీసీ ఎండీ జీవీ రమణారావు తెలిపారు. రెండేండ్ల కిందట జాతర సందర్భంగా 3700 ప్రత్యేక బస్సులను ఆర్టీసీ నడిపినట్లు పేర్కొన్నారు. సుమారు 8 లక్షల మందికిపైగా భక్తులు ఆర్టీసీ సేవలను ఉపయోగించుకున్నారని చెప్పారు. గత అనుభవాల దృష్ట్యా ఈ సారి జాతరకు మరో 500 బస్సులను పెంచినట్లు వెల్లడించారు. ఈ సారి సుమారు 10 లక్షల నుంచి 12 లక్షల మంది భక్తులు ఆర్టీసీలో ప్రయాణించే అవకాశం ఉంటుందని ఆర్టీసి అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రధానంగా వరంగల్, హన్మకొండ, కాజీపేట, కరీంనగర్, హైదరాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం, నల్లగొండ, మంచిర్యాల, గోదావరిఖని, పెద్దపల్లి తదితర 50 కేంద్రాల నుంచి ప్రత్యేక బస్సులను నడుపాలని నిర్ణయించారు. జాతరకు 12 వేల మంది ఆర్టీసీ సిబ్బందిని మేడారం స్పెషల్ ఆపరేషన్స్ విధుల్లో నియమించినట్లు వివరించారు. జాతరకు వచ్చే భక్తులకు అసౌకర్యం, ఇబ్బందులు కలుగకుండా బస్సులు ఏర్పాట్లుచేయడంతో పాటు, మేడారం వద్ద ఆర్టీసీ తాత్కాలిక బస్ టర్మినల్ ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. మేడారంలో తాత్కాలిక బస్ టెర్మినల్‌లో వసతులను రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పీ. మహేందర్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ రమణారావు, సంస్థ ఉన్నతాధికారులు పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. వరంగల్‌లో అధికారులతో ఎండీ సమీక్ష నేటి నుంచి జాతర ప్రారంభమవుతున్నందున బస్సుల నిర్వాహణ, ప్రయాణికులకు ఏర్పాట్లు, మేడారంలో బస్ టర్మినల్, భక్తుల డిమాండ్ మేరకు ఆయా రూట్లలో బస్సుల నిర్వహణపై ఆర్‌ఎంలు, డిపో మేనేజర్లు,అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు.

నిధుల కేటాయింపులో అధిక ప్రాధాన్యం ఇవ్వండి

- 15వ ఆర్థిక సంఘం కేటాయింపులను పెంచండీ
- మూడంచల విధానం పటిష్టం చేయాలి
- జిల్లా, మండల పరిషత్‌కు నిధులు కేటాయించాలి
- నిధుల వినియోగంలో రాషాట్రలకు అధికారాలు
- 15వ ఆర్థిక సంఘం సదస్సులో జూపల్లి వినతి



న్యూ ఢిల్లీ, సూర్యప్రధానప్రతినిధి: ప్రజలకు మెరుగైన పాలన అందించాలని, ప్రభుత్వ పాలన ప్రజల ముంగిట్లోకి తీసుకెళ్లేందుకు కొత్త మండలాలను, జిల్లాలను ఏర్పాటు చేశామని, త్వరలో గ్రామ పంచాయితీలను సైతం కొత్తగా ఏర్పాటు చేయబోతున్నామని రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణా రాష్ట్రానికి 15 వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపుల్లో అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని జూపల్లి కృష్ణారావు కోరారు. 15 ఆర్థిక సంఘం ఏర్పాటు కోసం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ అధ్యక్షతన మంగళవారం ఢిల్లీలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రులు, ఫైనాన్స్ కమిషన్ అధికారుల సదస్సులో మంత్రి జూపల్లి పాల్గొన్నారు. ఈ సదస్సులో ప్రసంగించిన మంత్రి జూపల్లి కృష్ణారావు స్థానిక సంస్థల బలోపేతం కోసం 15 వ ఆర్థిక సంఘం ద్వారా కేంద్రం తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. అనంతరం తెలంగాణాభవన్లో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేసే దిశగా 15వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపులు జరగాల్సిన అవసరం ఉందని... తెలంగాణకి సంబంధించి ప్రస్తుతం గ్రామ పంచాయతీలకు ఇస్తున్న నిధులు సరిపోవడం లేదన్నారు. 14వ ఆర్థిక సంఘం ద్వారా ఇచ్చిన నిధులను రెండింతలు చేయాలని కోరామన్నారు. తెలంగాణకి సంబంధించి ఇప్పటిదాకా ఇస్తున్న నిధులు గ్రామాల అభివృద్ధికి సరిపోవట్లేదని మంత్రి జూపల్లి తెలిపారు. గ్రామాలను పటిష్ఠం చేసేందుకు నిధుల పెంపుతో పాటు.. నిధుల వినియోగం, ప్రణాళికలలో చాలా మార్పులు తీసుకురావాల్సి ఉందని మంత్రి వివరించారు. గ్రామ స్వరాజ్యానికి విఘాతం కలగకుండ మూడంచెల వ్యవస్థను పటిష్ఠం చేయాల్సిన అవసరముందన్నారు. కేంద్ర నిధులను నేరుగా గ్రామ పంచాయతీలకు ఇవ్వడం వల్ల, మండల, జిల్లా పరిషత్ వ్యవస్థ నిర్వీర్యం అవుతోందన్నారు. గ్రామ పంచాయతీలకు నిధులను తగ్గించకుండా...జిల్లా, మండల పరిషత్ లకు కూడా ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని సూచించామన్నారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ద్వారా మున్సిపాలిటీల్లో అండర్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తున్నట్లుగానే కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ ద్వారా మేజర్ గ్రామ పంచాయతీలు, మండల కేంద్రాల్లోనూ భూగర్భ డ్రైనేజీల ఏర్పాటు చేసేందుకు నిధులు కేటాయించాలని కోరినట్లు మంత్రి జూపల్లి తెలిపారు. వీటితో పాటు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటు కోసం ప్రత్యేకంగా నిధులు విడుదల చేయాలని, ఉపాధి హామీ మెటీరియట్ కాంపొనెంట్ నిధుల విడుదలలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని కోరామన్నారు. తెలంగాణ లోని గ్రామాలను స్వచ్ఛ - హరిత గ్రామాలుగా మార్చేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇందుకోసం ప్రతి గ్రామంలోనూ పారిశుద్ధ్య కార్మికులను ఉపాధి నిధులతో ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించాలని కోరామన్నారు. దేశంలోనే గ్రామీణాభివృద్ధిలో అనేక సంస్కరణలు తీసుకువచ్చిన తొలి రాష్ట్రం తెలంగాణా అని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్ర శేఖర్ రావు ప్రత్యేక చొరవతో మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పేరుతో గ్రామాల రూపురేఖల్ని మార్చేస్తున్నారన్నారు. తెలంగాణలో కొత్తగా 4 వేల కు పైగా గ్రామ పంచాయతీ లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఆ గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పన కోసం అదనంగా నిధులు కేటాయించాలని కోరినట్లు మంత్రి తెలిపారు. పాలనలో పారదర్శకత వచ్చేలా గ్రామ పంచాయతీ లలోని తీర్మానాలు ఆన్ లైన్లో ఉంచడంతో పాటు, గ్రామ సభల వివరాలను కూడా ఆన్‌లైన్‌లో పొందుపరిస్తే బాగుంటుందని సూచించామన్నారు. గ్రామ పంచాయతీ లకు సంబంధించి నిధుల వినియోగంలో కొన్ని అంశాలన సరళికరించి, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంలో కొన్ని అధికారాలు రాష్ట్రాలకు, పంచాయతీలకు ఇస్తే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. స్వచ్ఛ భారత్ పథకంలో భాగంగా రాష్ట్రాలకు రావాల్సిన నిధులు పెంచి, సకాలంలో విడుదల చేస్తే ఆశించిన ఫలితాలను వేగంగా సాధించవచ్చని మంత్రి తెలిపారు.

24 గంటల విద్యుత్, మిషన్ భగీరథ ద్వారా తెలంగాణలోని గ్రామాలపై మంచినీటి సరఫరా, కరెంట్ మోటార్లు కాలిపోతే అయ్యే ఖర్చుల భారాన్ని చాలావరకు తగ్గిస్తున్నామని, ఆర్థిక సంఘం నిధులను గ్రామాల అవసరాలకు అనుగుణంగా వినియోగించుకునే స్వేచ్ఛను రాష్ట్రాలకు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రితో పాటు రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ రాజేశం గౌడ్, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు కూడా పాల్గొన్నారు.

150 ఓట్లు రాలేదు నాపై విమర్శలా?

బైరెడ్డిపై గౌరు చరితా రెడ్డి ఫైర్

కర్నూలు, మేజర్‌న్యూస్: ఉనికి కోసం బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి తనపై ఆరోపణలు చేయడం హ్యాస్యాస్పదమని వైసీపీ పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. పాణ్యం నియోజకవర్గ అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని ప్రకటించారు. బైరెడ్డి చరిత్ర ప్రజలందరికీ తెలుసని, అప్పులు అంటూనే వారిపై కొడుకుతో దాడి చేయించిన ఘనత బైరెడ్డిదన్నారు. నాలుగేళ్లుగా చంద్రబాబుపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేసిన బైరెడ్డి తిరిగి ఆయన పంచనే చేరారని తెలిపారు. ఎన్నికల ముందు హత్యలు, దాడులతో ప్రజలను భయపెట్టడం బైరెడ్డికి వెన్నతో పెట్టిన విద్య ఆరోపించారు. చేతనైతే రానున్న ఎన్నికల్లో తనపై పోటీ చేయాలని ఆమె సవాల్ విసిరారు. 150 ఓట్లు కూడా రాని బైరెడ్డి తనపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.


'చంద్ర' గ్రహణం

- ఇద్దరు చంద్రులపై జనవరి 31 ప్రభావం ఎంత ?
- రాజకీయ సమీకరణాల్లో మార్పులపై ఆసక్తి
- నేడు తెలుగు రాషాట్రల్లో మూతపడనున్న ఆలయాలు

(అమరావతి-సూర్య ప్రత్యేక ప్రతినిధి) :నేడు తెలుగు రాష్ట్రాల్లో ఏం జరగనుంది. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్, చంద్రబాబుపై జనవరి 31 ఎలాంటి ప్రభావం చూపనుంది. ఇంతకీ సూపర్ బ్లూ బ్లడ్ మూన్ ప్రత్యేక ఏంటి? 150 ఏళ్ల తరువాత కనిపించే అరుదైన సూపర్ బ్లూ బ్లడ్ మూన్ కోసం ప్రపంచం కళ్లింతలు చేసుకుని ఎదురుచూస్తోంది. సూపర్ మూన్ గురించి తెలుసు, బ్లూ మూన్ కూడా చూశాం. మరి ఈ సూపర్ బ్లూ బ్లడ్ మూనేంటీ ఎప్పుడూ వినలేదే అనిపిస్తోంది కదా. ఆ రెండు లక్షణాలు ఉన్నదే ఇది. సూపర్ మూన్ సాధారణ మూన్ కన్నా కొంచెం పెద్దగా ఉంటుంది. చంద్రుడు భూకక్ష్యకు దగ్గరగా వచ్చిన సమయంలో మనం దాన్ని చూడవచ్చు. కాస్త నీలం రంగులో ఉండే బ్లూ మూన్ రెండు మూడేళ్లకోసారి దర్శనమిస్తుంది. పరిమాణంలోనూ పెద్దగా ఎరుపు, నీలంరంగు కలగలిసినట్టు ఉండేదే సూపర్ బ్లూ బ్లడ్ మూన్. ఇది అరుదైన ఖగోళ అద్భుతమని చెప్పవచ్చు. 1866 తరువాత అంటే దాదావు 150 ఏళ్ల తరువాత చంద్రుని ఆ అరుదైన రూపం సాక్షాత్కారించబోతోంది. మళ్లీ 150 ఏళ్లకే ఖగోళంలో సూపర్ బ్లూ బ్లడ్ మూన్ వచ్చేది. జనవరి 31 నాడు చంద్రగ్రహణం కూడా ఏర్పడుతోంది. అరుదైన సూపర్ బ్లూ బ్లడ్ మూన్‌ను మనం ఎక్కువసేపు చూడలేమన్నమాట. అంతే కాకుండా జ్యోతిష్యశాస్త్రం ప్రకారం కొన్ని రాశులవారు ఆ రోజు అస్సలు చంద్రదర్శనం చేసుకోవద్దు. మేషం, కర్కాటకం, ధనుస్సు, సింహరాశి వారిపై ప్రభావం ఉండబోతోంది. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులిద్దరికీ కర్కాటక రాశి. రాజకీయంగా ఆ ఇద్దరిపైనా గ్రహణ ప్రభావం తీవ్రంగానే ఉంటుందం టున్నారు జ్యోతిష పండితులు. మిత్రులు శత్రువులుగా మారే ప్రమాదం ఉందనీ చెబుతున్నారు. ఏడాదిన్నరలో ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే రెండు రాష్ట్రాల్లో రాజకీయ సమీకరణాలు చకచకా మారిపోతున్నాయి. మరి ఈ గ్రహణ ప్రభావం వారిమీద ఎలా ఉండబోతుందన్నది ఆసక్తికరంగా మారింది. కొంతకాలంగా ప్రొఫెసర్ కోదండరాం కేసీఆర్‌కు కంట్లో నలుసుగా మారారు. ఆయన నేతృత్వంలో రాజకీయ పార్టీ అవతరించనుందన్న వార్తలూ వినిపిస్తు న్నాయి. జనసేనాని పవన్ కల్యాణ్ సైతం రాజకీయ పార్టీ పెట్టి రెండురాష్ట్రాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ఇక ఎన్డీఏలో ముఖ్య భాగస్వామిగా ఉన్న టీడీపీకి బీజేపీతో స్పర్థలు పెరిగిపోతున్నాయి. వరుస పరిణామాలతో సహనం కోల్పోయిన చంద్రబాబు మొన్న బయటపడిపోయారు. వాళ్లు వద్దంటే నమస్కారం పెట్టి వచ్చేస్తామని స్పష్టం చేసేశారు. ఇటు కేసీఆర్ , అటు చంద్రబాబు ఏకఛత్రాధిపత్యాధిపత్యానికి అడ్డుకట్ట పడే అవకాశం ఉందా? చిరకాల మిత్రులు, శత్రువులుగా మారుతారా? అంటే వచ్చే ఎన్నికల్లో వారి విజయం నల్లేరు మీద నడకేం కాదా. ఆ చంద్రున్ని రాహుకేతువులు మింగేస్తున్నట్టు ఈ ఇద్దరు చంద్రులకు అడ్డుపడేదెవరు ? రసవత్తర రాజకీయం నడుస్తున్న వేళ అరుదైన చంద్రుడు మరిన్ని సందేహాల్ని లేవనెత్తిస్తున్నాడు. రెండు తెలుగురాష్ట్రాల్లోనూ ఇప్పుడిదే చర్చ నడుస్తోంది.

నిడమానూరు వరకు బెంజ్ సర్కిల్ ఫ్లైఓవర్


- పరిశీలించాలని ముఖ్యమంత్రి ఆదేశం
- రహదారులపై సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి : విజయవాడ బెంజ్ సర్కిల్ ఫ్లయ్‌వోవర్‌ను నిడమానూరు వరకు పొడిగించే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ పీవీ ఎక్స్‌ప్రెస్ ఫ్లయ్‌వోవర్ తరహాలో విజయవాడ నగరంలో కీలకమైన ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాల్సి వుందని మంగళవారం రాత్ర సచివాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన చెప్పారు. చెన్నయ్-కోల్‌కత్తా ఐదవ నెంబర్ జాతీయ రహదారి మార్గంలోని 1025 కిలోమీటర్ల మేర జరుగుతున్న రహదారి అభివృద్ధి పనుల పురోగతిపై జాతీయ రహదారుల శాఖ ఉన్నతాధికారులు ఈ సమావేశంలో ముఖ్యమంత్రికి వివరాలు అందించారు. విజయవాడ బెంజ్ సర్కిల్ ఫ్లైఓవర్ నిర్మాణం నవంబర్ నాటికి పూర్తవుతుందన్నారు. విజయవాడ నగర అవసరాల దృష్ట్యా ప్రస్తుత ప్రతిపాదిత మార్గాన్ని మరికొంత దూరం పొడిగించాలని ముఖ్యమంత్రి వారికి చెప్పారు. రాజమహేంద్రవరం -విజయవాడ మధ్య దెబ్బతిన్న రహదారికి మరమ్మతులు వెంటనే చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. రహదారి సక్రమంగా లేకపోవడంతో ఈ మార్గంలో ప్రయాణం చేసే వారంతా అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఏప్రిల్ నాటికి మరమ్మతు పనులు పూర్తిచేస్తామని జాతీయ రహదారుల శాఖ అధికారులు చెప్పగా, పనులలో పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి సీఎంవో అధికారులను అదేశించారు. విజయవాడ- గుండుగొలను, గుండుగొలను- రాజమహేంద్రవరం రెండు దశలలో పూర్తిచేయాలని స్పష్టంచేశారు. నెల్లూరు-తడ మార్గాన్ని 6 వరుసలుగా మార్చాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ మార్గంలో కృష్ణపట్నం ఓడరేవు, శ్రీసిటీ, స్పెషల్ ఎంప్లాయిమెంట్ జోన్ ఇతర పెరిగిన అవసరాల దృష్ట్యా 6 వరుసల విస్తరణ అవసరమన్నారు. విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి మార్గం 38 శాతం పూర్తయ్యిందని, నిర్దేశించిన సమయానికి పూర్తిచేస్తామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. నందిగామ-కంచికచర్ల బైపాస్ రహదారి పనులను ఫిబ్రవరిలో ప్రారంభిస్తామని చెప్పారు. తిరుపతి-చిత్తూరు రహదారి పనులను ఫిబ్రవరిలో ప్రారంభిస్తామన్నారు. అలాగే, ఇచ్ఛాపురం నుంచి నరసన్నపేట నుంచి 6 వరుసలు చేయాలని ముఖ్యమంత్రి సూచించగా, ఆ మార్గంలో రాకపోకలు పెద్దగా లేకపోవడం వల్ల ప్రస్తుతం దాన్ని 4 వరుసలకే పరిమితం చేశామని జాతీయ రహదారుల శాఖ అధికారులు వివరించారు. వైకుంతమాల రహదారిని నాయుడుపేట, చిత్తూరు, మదనపల్లి తదితర ప్రాంతాలకు అనుసంధానం అయ్యేలా చూడాలన్నారు. దీనికి సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలను వచ్చే సమావేశంలోగా రూపొందించి తీసుకురావాలని ఆదేశించారు. కృష్ణపట్నం నుంచి సత్యవేడు మీదుగా తిరుపతికి ఒంవులు లేని రహదారిని నిర్మించే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. విశాఖపట్నం-రాయపూర్ రహదారి నిర్మాణానికి సంబంధించి అక్టోబరు నాటికి డీపీఆర్ సిద్ధం చేస్తామని అధికారులు చెప్పారు. ఈ మార్గంలో సాలూరు నుంచి విజయనగరం వరకు 70 కిలోమీటర్లు మాత్రమే ఏపీ భాగమని, మిగిలినదంతా ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పరిధిలోకి వస్తుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించగా, ఆ రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, సంబంధిత మంత్రితో మాట్లాడి సాధ్యమైనంత వేగంగా ఈ ప్రాజెక్టును పూర్తిచేసేలా చూడాలని ముఖ్యమంత్రి సూచించారు. అమరావతి-అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి సంబంధించి పనులలో వేగం పుంజుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. జూన్ నాటికి భూ సేకరణ ప్రక్రియ పూర్తిచేయాలని అన్నారు. తన కలల ప్రాజెక్టును పూర్తిచేయడంలో ఇప్పటికే జాప్యం జరగడం విచారకరమన్నారు. సవరించిన అలైన్‌మెంట్ ప్రకారం 189 కిలోమీటర్ల మేర అమరావతి బాహ్యవలయ రహదారిని రూ.17,762 కోట్ల అంచనాతో నిర్మాణాన్ని చేపడుతున్నామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనికోసం 3,404 హెక్టార్ల మేర భూమి అవసరం వుంటుందని చెప్పగా, సాధ్యమైన మేరకు భూ సమీకరణ విధానంలోనే భూములను తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ బాహ్యవలయ రహదారి మార్గంలో జి.కొండూరులో 5.5 కి.మీ, పేరేచర్లలో 800 మీటర్ల మేర టన్నల్స్ నిర్మాణం జరగాల్సి ఉంటుందని అధికారులు చెప్పారు. 87 గ్రామాలు ఈ రహదారి పరిధిలోకి వస్తాయని వివరించారు. కత్తిపూడి నుంచి ఒంగోలు వరకు 435 కిలోమీటర్ల మేర ఎన్‌హెచ్ 216, 221 (30) అప్‌గ్రెడేషన్ పనులలో పురోగతిని ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారికి ప్రత్యామ్నాయంగా ఉంటుందని, భవిష్యత్ అవసరాల దృష్ట్యా దీని నిర్మాణాన్ని శరవేగంగా చేపట్టి 2019 మార్చి నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. సేతుభారతంలో భాగంగా ఏపీలో 32 రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ)ల నిర్మాణం చేపట్టామని, అందులో రూ.474.21 కోట్ల అంచనాతో తలపెట్టిన 7 ఆర్వోబీలకు ఇప్పటికే డీపీఆర్‌లను సిద్ధం చేశామని అధికారులు చెప్పారు. రాష్ట్ర రహదారులకు సంబంధించి చిత్తూరు-పుత్తూరు, మైదుకూరు-జమ్మలమడుగు రహదారుల పనులను ఇప్పటికే పూర్తిచేశామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

మొదటి పేజీ తరువాయి

మనమే గెలవాలి




రావాల్సి ఉందన్నారు. క్రమశిక్షణను ఉల్లంఘిస్తే సహించనని, మన రెం డంకెల వృద్ధిరేటును ఎకనామిక్ సర్వే నిర్ధారించిందని, ఏపీలో పెరిగిన జీవన ప్రమాణాలను ఎకనామిక్ సర్వే గుర్తించిందని, పర్యాటక రంగంలో ఏపీ 3వ స్థానంలో ఉండటం మనం సాధించిన ప్రగతి అని చంద్రబాబు పేర్కొన్నారు.

ఇక పార్టీ పటిష్టతపై దృష్టి పెడతా : ఇకపై పార్టీ పటిష్టతపైనే దృష్టి పెడతానని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. మంగళవారం టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన ప్రసంగిస్తూ... 175 నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిపై సమీక్షిస్తానని, నియోజకవర్గాలకు ఏ, బీ, సీ, డీ కేటగిరీలు ఇచ్చా మన్నారు. అలాగే సి, డి కేటగిరి నియోజకవర్గాలపై ఎక్కువ దృష్టి పెడతాన న్నారు. అలాగే మండల స్థాయి నేతలను నియోజకవర్గ సమావేశాలకు ఆహ్వాని స్తామని, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయ కమిటీలు ఈ సమావేశాలకు హాజరు కావాల్సిందేనన్నారు. ఎన్నికల ఏడాదిలో ఉన్నామని, ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని, జన్మభూమి కమిటీలను పునఃనిర్మించాలని, ఫిబ్రవరి 2న జరిగే పార్టీ సమన్వయ కమిటీలో రాజకీయాలపై చర్చిద్దామని చంద్రబాబు అన్నారు.

మొదటి పేజీ తరువాయి

దారులన్నీ మేడారంవైపే



తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్ఠించనున్నారు. పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు, కొండాయి నుంచి గోవిందరాజులు ఇప్పటికే పయనమయ్యారు. వీళ్లు కూడా బుధవారం రాత్రి గద్దెల ప్రాంగణానికి చేరుకోనున్నారు. అప్పటి నుంచి జాతర అధికారికంగా ప్రారంభమవుతుం ది. గురువారం సాయంత్రం చిలుకలగుట్ట నుంచి సమ్మక్క గద్దెలపైకి చేరితే సకల వన దేవతలు కొలువైనట్టే. ఈ నేప థ్యంలో ఇప్పటినుంచే ఇసుకేస్తే రాలనంతగా మేడారం వనమంతా జనంతో నిండిపోతునున్నది. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా మేడారం చేరుకునే రహదారి పొడవునా పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నారు. భక్తులు ప్రైవేటు వాహనాల ద్వారా వచ్చి వెళ్లేందుకు ఆదివారం నుంచి వన్‌వే విధానాన్ని అమలుచేస్తున్నారు. 20 రోజుల ముందు నుంచే భక్తులు పెద్దసంఖ్యలో మేడారం వస్తున్నారు. ఆది వారం అత్యధికంగా 12లక్షల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఏర్పాట్లు, భద్రతపై నిరంతరం సమీక్ష : వారం రోజులుగా మేడారంలోనే మకాం వేసిన ఉన్నతాధికారులు భక్తుల కల్పించే ఏర్పాట్లు, భద్రతపై నిరంతరం సమీక్షిసున్నారు. 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు జాతర నిర్వహణలో కీలకపాత్ర పోషించే పోలీసుశాఖ, 15 వేల మంది సిబ్బందితో బందోబస్తుకు ప్రణాళిక రచించింది. 12 వేల మంది సిబ్బందితో 4200 బస్సులు నడిపేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. జాతర విధులు నిర్వర్తించే సిబ్బంది మొత్తం సోమవారమే మేడారం చేరుకున్నారు. జంపన్నవాగు, అమ్మవార్ల గద్దెల ప్రాంగణం, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పోలీసులు విధుల్లో చేరారు. ఐజీ నాగిరెడ్డి, కరీంనగర్ డీఐజీ రవివర్మ, జిల్లా ఎస్పీ ఆర్ భాస్కరన్ మేడారంలో పర్యటించారు. సీసీ, క్రౌడ్‌కౌంటింగ్, మానిట రింగ్ కెమెరాలను పరిశీలించారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు ఈ సారి ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ముఖ్యమంత్రికె.చంద్రశేఖరరావు, కేంద్ర మంత్రి ఓరం రానున్నారు.


జంపన్నవాగులో భక్తులతో కిటకిట : జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచ రించేందుకు వచ్చే భక్తులతో కిటకిటలాడుతున్నది. ఇక్కడ మహిళలు దుస్తులు మార్చుకోవడానికి 132 తాత్కాలిక గదులను సిద్ధం చేశారు. మేడారం పరిస రాల్లో 11,250 మరుగుదొడ్లను నిర్మించారు. భక్తులు విడిదిచేసే ప్రదేశాల్లో నల్లాల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. పారిశుద్ధ్య కోసం 3,400 మంది నిరంతరం శ్రమిస్తున్నారు. గద్దెల ప్రాంగణం సమీపంలో ప్రారంభించిన 50 పడకల ప్రభుత్వ దవాఖానలో వైద్యులు నిరంతరం సేవలు అందిస్తున్నారు.

బీసీలకే అధిక సీట్లు



నవరత్నాలు అమలు చేస్తామని చెప్పాం. ఇవే కాకుండా చేనేతలకు ప్రత్యేక కార్పొషన్‌ను ఏర్పాటు చేస్తానని గతంలో చెప్పా. ఈ వేదికగా మళ్లీ పునరుద్ఘాటిస్తున్నా. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే కార్పొరేషన్‌ను నెలకొల్పుతాం. ఇవే కాకుండా చేనేతలకు ఇంకా ఏమైనా చేయాలంటే చెప్పండి. ప్రజాసంకల్పయాత్ర ముగిసిన తర్వాత బీసీ గర్జన మహాసభ జరుపుతాం. బీసీ డిక్లరేషన్ చేసి ప్రతి కులానికి, ప్రతి పేదవాడికి న్యాయం చేస్తాం, ప్రతి ఒక్కరిని పేదరికం నుంచి బయటపడేయగల శక్తి ఒక్క చదువుకు మాత్రమే ఉంది. అందుకే నవరత్నాల్లో కెల్లా గొప్ప పథకం ఇదేనని నేను భావిస్తున్నా. మన పిల్లలకు మంచి చదువులు చెప్పించి, ఉద్యోగాలు చేయిస్తే మన బ్రతుకులు బాగుపడతాయి. ఆ రోజుల్లో నాన్నగారు ఒక అడుగు ముందుకేసి మన పిల్లల్ని ఇంజనీరింగ్, డాక్టర్, తదితర చదువులకు ప్రోత్సహించారు. నాన్నగారి తనయుడిగా నేను రెండు అడుగులు ముందుకేస్తున్నా ఇంజనీరింగ్, డాక్టర్, కలెక్టర్ చదువేదైనా అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరించేలా చేస్తానని హామీ ఇస్తున్నా. హాస్టళ్లలో ఉంటూ చదువుకునేందుకు పిల్లలకు ఏడాదికి రూ. 20 వేలు కూడా అందిస్తాం. మన పిల్లలు పెద్ద చదువులు చదవాలంటే కింది స్థాయిలో మంచి పునాది ఉండాలి. అందుకు అనుగుణంగా తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపేందుకు సంవత్సరానికి రూ. 15 వేలను ప్రభుత్వం ఇస్తుంది. ప్రతి ఏటా ఈ డబ్బు తల్లి ఖతాలో జమ అవుతుంది. దీంతో వారు నిశ్చింతగా పిల్లలను చదువించు కోవడానికి వీలు కలుగుతుంది. నవరత్నాల్లో రెండో కార్యక్రమం పెన్షన్‌తో రాష్ట్రంలోని సగటు నిరుపేదకు అండగా నిలబడి, నేనున్నానంటూ భరోసా ఇవ్వడం. అవ్వతాతలకు ఇచ్చే పెన్షన్‌ను రూ. 2 వేలకు పెంచుతాం. 45 ఏళ్ల నుంచి ప్రతి పేదవాడికి పెన్షన్ అందేలా చేస్తాం. 108 నంబర్‌కు ఫోన్ కొడితే 20 నిమిషాల్లో ఆసుపత్రికి చేర్చేది. అదే నంబర్‌కు ఇవాళ ఫోన్ కొడితే వస్తుందా, లేదా, అన్న భయం ప్రజల్లో ఏర్పడింది. 108కి ఫోన్ చేస్తే డ్రైవర్లకు జీతాలు ఇవ్వడం లేదని, డీజిల్ లేదనే సమాధానాలు వస్తున్నాయి. ఆరోగ్య శ్రీ పరిస్థితి దీనస్థితికి చేరింది. పెద్ద రోగాలు వస్తే 60 ఏళ్లుగా రాజధానిగా ఉన్న హైదరా బాద్‌కు వెళ్లాం. కానీ, హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై ల్లోని మంచి ఆసుపత్రులలో వైద్యం చేయించుకుంటే ఆరోగ్య శ్రీ వర్తించదని ప్రభుత్వం ఆర్డర్ తెచ్చింది. ఇక్కడేమో మంచి ఆసుపత్రిలు లేవు. ఉన్న చోటుకు వెళ్లని వ్వరు. మరి జబ్బు చేసిన పేదవాడి ఎలా బతకాలి. మన అధికారంలోకి వచ్చాక ఖర్చు రూ. వెయ్యి దాటే ప్రతి వైద్యానికి ఆరోగ్య శ్రీ పథకాన్ని వర్తింపజేస్తాం. వైద్యానికి ఎన్ని లక్షల ఖర్చైనా ఫర్వాలేదు. చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్ ఎక్కడైనా ఆరోగ్య శ్రీ పథకాన్ని వర్తింపజేస్తాం. ఆపరేషన్ ఉచితంగా చేయించడమే కాకుండా రెస్ట్ పీరియడ్‌లో డబ్బులు ఇచ్చి తోడుగా నిలుస్తాం. రోగులకు 10 వేల పెన్షన్‌ను అందజేస్తాం." అని జగన్ హామీ ఇచ్చారు.

'నవయుగ'కే పోలవరం



గంటలపాటు కేంద్ర, రాష్ట్ర జలవనరుల శాఖ, జలసంఘం అధికా రులతో భేటీ అనంతరం మంత్రి గుత్తేదార్లతో కాసేపు సమావేశమయ్యారు. నవయుగ, ట్రాన్స్ ట్రాయ్ గుత్తే దారు సంస్థల్లో వేటికి ఈ పనులు అప్పగించే అంశంపై చర్చించారు. పోలవరం ప్రధాన గుత్తేదారుగా ఉన్న ట్రాన్స్‌ట్రాయ్ సంస్థ ఇప్పటివరకు అనుకు న్నవిధంగా నిర్దిష్ట సమయంలో పనులు పూర్తిచేయని నేపథ్యంలో ఈ పనులను నవయుగకు అప్పగించాలని నిర్ణయించారు. అలాగే ఎట్టి పరిస్థితుల్లోనూ 2019 నాటికి పాత ధరలతోనే పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసేందుకు నవయుగతో అంగీకారం కుదిరింది. నవయుగ కంపెనీకి స్పిల్‌వే, ఛానల్ పనుల్ని పూర్తిచేసేందుకు నిర్ణీత గడువును ఇవ్వడంతో పాటు అధికారిక కార్యక్రమాలు పూర్తి చేసుకొనేందుకు అవగాహన ఒప్పందం కుదరనుంది. దీనిప్రకారం స్పిల్‌వే, స్పిల్‌ఛానల్ పనుల్ని నవయుగ సంస్థ వారం రోజుల తర్వాత చేపట్టే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.



రైఫిల్ షూటింగ్‌లో 4 బంగారు పతకాలు సాధించిన ఉమామహేష్

అభినందించిన మంత్రి దేవినేని

విజయవాడ, సూర్య బ్యూరో : రాష్ట్ర విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తయారు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ఇస్తున్న ప్రోత్సాహంతో విద్యార్థులు తమ సత్తాను చాటుతూ పతకాలు సాధిస్తున్నారని జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తెలిపారు. మంగళవారం జల వనరుల శాఖా కార్యాలయంలో ఇటీవల హుబ్లీలో జరిగిన 'ఆల్ ఇండియా ఓపెన్ ఛాలెంజ్ రైఫిల్ షూటింగ్' పోటీలలో నాలుగు బంగారు పతకాలు, ఒక వెండి పతకం గెలుపొందిన మద్దినేని ఉమా మహేష్ (14)ను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించడం కోసం ఓ ప్రత్యేక విధానంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు చేపట్టడం వల్ల రాష్ట్రానికి చెందిన బాల, బాలికలు అనేక పతకాలు గెలుస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహం ఇవ్వటం వల్లనే పుల్లెల గోపిచంద్, పివి సింధు, కిదాంబి శ్రీకాంత్ లాంటి క్రీడాకారులు రాణిస్తూ దేశానికీ, రాష్ట్రానికి కీర్తి ప్రతిష్టలు తీసుకువస్తున్నారన్నారు. అదే కోవకి చెందిన మద్దినేని ఉమామహేష్ పూర్తిగా గ్రామీణ నేపథ్యం కలిగి, 9వ తరగతి చదువుతూ అతి చిన్న వయస్సులో అనేక పతకాలు సాధిస్తూ అబ్బుర పరుస్తున్నారన్నారు. ముస్ముందు ఇంకా రాష్ట్ర ప్రతిష్టను నిలిపేవిధంగా అనేక పతకాలు తీసుకొచ్చి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని మంత్రి దేవినేని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తరవున కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

కాళేశ్వరం ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలి

- ఏజెన్సీలతో ప్రాజెక్టు నిర్మాణంపై సమీక్ష
- భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు

కరీంనగర్ –సూర్యప్రధానప్రతినిధి : సకాలంలో కాళేశ్వరం ప్రాజెక్టు పనులు పూర్తి చేయడానికి పనులలో వేగం పెంచాలని భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. కాళేశ్వరంలో భాగంగా నిర్మిస్తున్న సుందిల్ల బ్యారేజి, అన్నారం పంప్ హౌజ్ పనులను ఆయన డిప్యూటి సీఎం కడియం శ్రీహరితో కలిసి సందర్శించారు. ప్రాజెక్టుల సందర్శన అనంతరం నీటి పారుదల శాఖ రెవెన్యూ యంత్రాంగం, ఏజెన్సిలతో ప్రాజెక్టు నిర్మాణంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతు బ్యారేజి పనులు త్వరగా పూర్తి చేయాలని, నిర్మాణంలో తలెత్తె సమస్యలు పై ఏజెన్సిలు, అధికారులను అడిగితెలుసుకున్నారు. డంపింగ్ సమస్యకు అవసరమైన భూమి



ని సీఈ గుర్తించాలని ఇలాంటి సమస్యలు ఎదురైనప్పుడు వాట్సప్ గ్రూప్‌లో తనకు నేరుగా తెలియ చేయాలని తెలిపారు. బ్యారేజికి సంబం ధించిన గేట్ల నిర్మాణ పనులు, కాంక్రిట్ పనుల పురోగతిని ఏజెన్సిలు మంత్రికి వివరించారు. ఫిబ్రవరి 10 వరకు గేట్లు నిర్మాణం పూర్తి చేసి అమర్చడం ప్రారంభిస్తామని ప్రతి గేటు అమర్చడానికి వారం రోజుల వరకు సమయం పడుతుందని తెలుపగా 3,4 రోజులకు ఒక గేటు అమర్చేలా పని చేయాలని మంత్రి సూచించారు. మే వరకు బ్యారేజి కాంక్రీట్ పనులు, జూన్ నాటికి మిగిలిన పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. పనులు త్వరగా జరిగేలా చూడాలని అవసరమైన సామాగ్రిని స్టాక్ పెట్టుకోవాలని, బ్యారేజి నిర్మాణం త్వరాగా నాణ్యమైన ప్రమాణాలతో పనులు పూర్తి కావాలని మంత్రి అధికారులను, ఏజెన్సీ ఇంజనీర్లను ఆదేశించారు. అనంతరం పంప్‌హౌజ్‌లపై సమీక్ష నిర్వహిస్తు మూడు పంప్ హౌజ్ నిర్మాణాలపై మంత్రి కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. 6,80,000 కాంక్రీట్ క్యూబిక్ మీటర్ల పని మేడిగడ్డ వద్ద పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 47,000 మాత్రమే పని జరిగిందని త్వరగా కాంక్రిట్ పనులు పూర్తి చేయాలని, నీటి వద్దకు అధికారులు స్వయంగా వెళ్లి స్ట్రీమ్‌లను పరిశీలించారు. కంట్రోల్ రూంల నిర్మాణం పనులు సమాంతరంగా జరుగాలని తెలిపారు. అవసరమైన విద్యుత్ అందించేందుకు సబ్‌స్టేషన్ పనులు ఫిబ్రవరి 15 వరకు పూర్తి చేయాలని అవసరమైతే ప్రత్యేక బృందాలను నియమించి పనులు జరుపాలని మంత్రి సూచించారు. . డిజైనింగ్ పనులు సాంకేతిక, ఆర్థిక వనరులను దృష్టిలో పెట్టుకొని తయారు చేయాలని, పెద్దపెద్ద డిజైన్లు అవసరమైతే మాత్రమే చేయాలని మంత్రి సూచించారు.

అనంతరం స్ట్రక్చర్ గ్రావిటి కెనాల్స్‌పై సమీక్ష నిర్వహిస్తు 31 స్ట్రాక్చర్‌లో 5 పనులు ప్రారంభం కాగా 25 స్ట్రాక్చర్ల పనుల సర్వే పూర్తి జరిగిందని, 18



స్ట్రక్చర్ల డిజైన్ అందించామని, మిగిలినవి మరో వారం రోజులలో అందిస్తామని మంత్రికి అధికారులు వివరించారు. గ్రావిటి కేనాల్స్ నిర్మాణానికి, ప్రాజెక్టు నిర్మాణానికి మరో 110 ఎకరాల భూ సేకరణ చేయాల్సి ఉందని మంత్రి దృష్టికి తీసుకురాగా, భూ సేకరణ పనులపై అశ్రద్ధ లేకుండా త్వరగా సేకరించాలని, రెవెన్యూ, భూ నిర్వాసితునితో కో ఆర్డినేట్ చేసుకొని పూర్తి చేయాలని తెలిపారు. లైనింగ్ పనులు ప్రారంభించాలని జూన్ నాటికి 80 శాతం లైనింగ్ పనులు పూర్తి చేయాలని, ప్రతి రోజు 5 నుంచి 6వేల క్యూబిక్ మీటర్ల మేర లైనింగ్ పని జరుగాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సివిల్‌సప్లై కార్పోరేషన్ ఛైర్మేన్ పెద్దిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, ఎంపి సీతారాంనాయక్, జిల్లా కలెక్టర్ శ్రీదేవసేన, ఎమ్మెల్యే లు ఎర్రబెల్లి దయాకర్ రావు, తాటికొండ రాజయ్య, ఆరూరి రమేష్, ముత్తిరెడ్డి, నీటిపాఉదలశాఖ ఎస్.ఈ సుధాకర్‌రెడ్డి, ఈఈ రమణారెడ్డి, ఎస్ఈ శ్రీనివాస్, నవయుగ, మేగా కంపెనీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరలు పాల్గోన్నారు.

సమాజ సేవలో స్వచ్ఛంధ సంస్థలు ముందుండాలి



జిల్లా కలెక్టర్ కె. సురేంద్రమోహన్

సూర్యాపేట, మేజర్‌న్యూస్: ప్రజలకు నిశ్వార్ధంగా సేవ చేయడంలో స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ కె. సురేంద్రమోహన్ స్వచ్ఛంద సంస్థలకు పిలువు నిచ్చారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం నందు లయన్స్ క్లబ్ సూర్యాపేట మరియు కాంటినెంటల్ హాస్పిటల్ వారిచే సంయుక్తంగా 09-02-2018న భవాని నర్సింగ్ హోం నందు నిర్వహించ తలపెట్టిన ఉచితగుండె జబ్బుల నిర్ధారణ మరియు శస్త్రచికిత్స కార్యక్రమ పోస్టర్స్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ కె. సురేంద్రమోహన్ మాట్లాడుతూ చిన్నపిల్లల నుండి వృద్ధుల వరకు పరీక్షలు మరియు అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు నిర్వహించబడుతాయని తెలిపారు. జిల్లా ప్రజలు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు. అదే విదంగా పేద ప్రజలకు పెద్దఎత్తున ఉచితంగా వైద్య చికిత్సలు అందించిన లయన్స్ క్లబ్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్పందన క్లబ్ అధ్యక్షులు నాతి సవీందర్‌కుమార్, కార్యదర్శి గుండా హరినారాయణ, కోశాధికారి ఎం. చలపతి రావు, ఉప్పల రాజేంద్ర ప్రసాద్, ముక్కా పురుషోత్తం, బైరు రమేష్‌లు పాల్గొన్నారు.

స్వేచ్ఛ స్వాతంత్రం ప్రసాదించిన మహానుభావుడు జాతిపిత



సూర్యాపేటప్రతినిధి, మేజర్‌న్యూస్: అహింసా, సత్యాగ్రహలే ఆయుధంగా స్వేచ్ఛ స్వాతంత్రం ప్రసాదించిన మహానుభావుడు జాతిపిత మహాత్మగాంధీ అని జిల్లా కలెక్టర్ కె. సురేంద్రమోహన్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతిపిత మహాత్మ గాంధీ 70వ వర్ధంతి సందర్భంగా మహాత్మాగాంధీ చిత్రా పటానికి పూల మాల వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అహింసామార్గంలో దేశానికి స్వాతంత్రం తీసుక వచ్చిన మహానుబావుడు మహాత్మాగాంధీ అని అన్నారు. గాంధీ చూపిన మార్గంలో ప్రతిఒక్కరు నడవాలని, ఆయన చూపించిన సిద్దాంతలను పాటించాలని యువతకు పిలుపునిచ్చారు. గాంధీ కలలు కన్నా స్వరాజ్యం కొరకు ప్రతి ఒక్కరు పాటు పాడాలని పేర్కొన్నారు. ఈసమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి పి. యాదిరెడ్డి, ఏఓ ప్రధ్యుమ్న, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలు ఎమ్మెల్యేలకు అగ్నిపరీక్ష

(సూర్యప్రతినిధి–ఖమ్మం) : పంచాయతీ ఎన్నికలకు నగరా మోగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్దమైంది. ప్రతిపక్షాలు ఇంకా సర్దుకోకముందే ఎన్నికలపెడితే తమకు అనుకులంగా ఉంటుందనే అభిప్రాయంతో ఎత్తులు వేస్తుంది. ఇదే ఆదనుగా భావించిన టిఆర్ఎస్ ఇందుకోసం పరుగులు తీస్తుంది. ఎమ్మెల్యేలకు ఈ ఎన్నికలు అగ్ని పరీక్షగా మారనున్నాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు ఇవి రీహర్సల్‌గా పరిగణిస్తున్నారు. వీటి ఫలితాలపై ఆధారపడే రానున్న ఎన్నికల్లో టిక్కెట్లు దక్కుతాయనే సంకేతాలు ఉండటంతో ఇప్పటినుంచే ఎన్నికల వాతావరణం వేడిక్కింది. గ్రామీణ వాతావరణ ఒక్కసారిగా మారిపోయింది. పల్లెలు పంచా యతీ ఎన్నికలకు సిద్దమౌతున్నాయి. ప్రజా ప్రతినిధులు నియోజకవర్గాల్లో విస్తృత పర్యటనలు జరుపుతున్నారు. వాగ్దానాలు గుప్పిస్తున్నారు. ప్రధానంగా పెన్షన్లు, డబుల్ బెడ్‌రూమ్స్‌పై ప్రజలనుంచి డిమాండ్ ఉండటంతో ఎమ్మెల్యేలు ఇచ్చిన కోటా సరిపోక ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. పంచాయతీ ఎన్నికలు పరోక్ష పద్దతిలోనా, పత్యక్షపద్దతిలోనా అనే విషయంపై క్యాబినెట్ సబ్‌కమిటీ వేసి పరోక్ష ఎన్నికలే మేలనే నిర్ణయానికి వచ్చారు. దీనిపై పెద్దఎత్తున విమర్శలు రావటంతో కొంత వెనక్కు తగ్గినట్లు కనిపిస్తున్నా లాభనష్టాలను బేరీజు వేసుకునే పనిలో టిఆర్‌యస్ పెద్దలు నిమగ్నమైయ్యారు. ఉమ్మడి జిల్లాలో 740కి పైగా పంచాయతీలు ఉండగా 500 జనాభాకు ఒక పంచాయతీ పెట్టే ఉద్దేశ్యంతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం పెరిగే పంచాయతీల వివరాలను జిల్లా అధికారులు సిద్ధం చేసేపనిలో ఉన్నారు. వాటిలో మెజార్టీ పంచాయతీలను తమ ఖాతాలో వేసుకునేందుకు జిల్లాలో ఇప్పటినుంచే టిఆర్‌యస్ పక్క వ్యూహాలతో ముందుకు పోతుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా బాధ్యతను జిల్లా మంత్రి తుమ్మలకు అప్పగించటంతో ఆయన దానిపై దృష్టి సారించారు. రాజకీయ ఎత్తుగడలల్లో దిట్టగా పేరున్న తుమ్మల జిల్లా ప్రజాప్రతినిధులను దారికి తెచ్చుకునే పనిలో నిమగ్నమైయ్యారు. టిఆర్ఎస్ నేతలు పంచాయతీ ఎన్నికల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి నియోజకవర్గాల వారీగా సమీక్షలు పెడుతున్నారు. నామినేటేడ్ పదవులు రాకపోవటంతో చాలా మందిలో అసంతృప్తి ఉంది. ఎమ్మెల్యేలను అనేక సమస్యలు వేదిస్తున్నాయి.అధికార పార్టీలో ఉన్న తమ మాటకు విలువ లేకుండా పోతుందనే అభిప్రాయంతో కొందరు ఉన్నారు. కొన్ని విషయాలు పైకిచెప్పుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంత్రి, ఎంపిలకు పోసగటంలేదనే అభిప్రాయాలు ఉన్నాయి. ఈ విషయాన్ని వారు వద్ద



ప్రస్తావిస్తే అలాంటిది ఏమిలేదని అంటున్నారు. అయితే గత కొన్ని రోజులుగా మంత్రి, ఎంపి, ఖమ్మం ఎమ్మెల్యేలు కలిసి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూడు విపక్షాల చేతులో ఉన్నాయి. వాటిలో మధిర, సత్తుపల్లి ఖమ్మంలో ఉండగా భద్రాచలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉంది. ఏడు నియోజకవర్గాల్లో అధిక పంచాయతీలు గెలిపించేందుకు జిల్లా మంత్రికి భాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తుంది. ఎమ్మెల్యేలను, ఎంపిలను సమన్వయం చేయటం ద్వారా మోజార్టీ పంచాయతీల్లో గులాబీ జెండా ఎగురవేయాలనే ఆలోచనలో ఉన్నారు. ఎన్నికలు పరోక్ష పద్దతిలో జరిపేందుకు క్యాబినెట్ సబ్ కమిటీ ప్రతిపాదనలు పంపినా ప్రజల్లో వ్యతిరేకత, విపక్షాల విమర్శల నేపథ్యంలో కొంత వెనక్కు దగ్గాలనే యోచనలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నట్లు తెలుస్తుంది. ఇటీవల జరిగిన జిల్లాల కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రేస్వయంగా పరోక్షమా? ప్రత్యక్షమా? ఇంకా నిర్ణయం జరగలేదని చెప్పటంతో ప్రత్యక్ష ఎన్నికలకే మొగ్గుచూపే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. దీంతో ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు కొంత ఎక్కువ శ్రమ పడాల్సి ఉంది. అయితే ఇటీవల జరిగిన ఎంపిటిసిలు, పంచాయతీ సర్పంచ్‌లకు జరిగిన ఉప ఎన్నికల్లో టిఆర్‌యస్ మంచి ఫలితాలు సాధించింది. విపక్షాలు మాత్రం డబ్బులు వెదజల్లి గెలిచారని ఆరోపిస్తున్నారు.

- ఫలితాలపై ఆధారపడే టిక్కెట్లు దక్కే అవకాశం
- నియోజకవర్గాలో హల్‌చల్
- పేరిగే పంచాయతీలపై ఆరా
- మండలాల వారీగా సమీకరణలు
- మోజారిటీ పంచాయతీలు తమవేనని టిఆర్ఎస్ ధీమా

ప్రధానంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం మండలంలో జరిగిన సర్పంచ్ ఉప ఎన్నికల్లో టిఆర్‌యస్ విజయభేరి మోగించింది. ముఖ్యంగా 1970 నుంచి సిపియంకు కంచుకోటగా ఉన్న సుజాతనగర్ మేజర్‌పంచాయతీ ఉప ఎన్నికల్లో సానుభూతి, సిపియంకు సిపిఐ, కాంగ్రెస్, టిడిపిలు మద్దతు ఇచ్చినప్పటికి ఒంటరిగా పోటిచేసిన టిఆర్ఎస్ గెలవటంతో అక్కడ ఎమ్మెల్యేగా ఉన్న జలగం ప్రతిష్ట పెరిగింది. ఆయన పై కొత్తగూడెం నియోజంకవర్గం ప్రజల్లో అసంతృప్తి ఉందని ఈ సారి ఇబ్బందిగానే ఉంటుందని ప్రచారం జరుగుతున్న సమయంలో పంచాయతీల్లో గెలుపు దాన్ని పటాపంచలు చేసింది. ఖమ్మం నియోజకవర్గంలో ప్రస్తుతం 17 పంచాయతీలు ఉండగా మరో 20 పంచాయతీలు పెరిగే ఆవకాశం ఉంది. దీనిపై ఇప్పటికే ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ ప్రత్యేక దృష్టిపెట్టారు. పాలేరు నియోజకవర్గంలోని ఇప్పుడున్న పంచాయతీలతో పాటు పెరగనున్న పంచాయతీలపై ఆవగాహన ఉన్న మంత్రి రిజర్వేషన్లను బట్టి అక్కడ తన వ్యూహాన్ని అమలు చేసే పనిలో ఉన్నారు. వైరాలో మదన్‌లాల్ పంచాయతీలపై పట్టుసాధించేందుకు ఊరురా తిరుగుతున్నారు. అయితే స్థానికంగా కొన్ని ఇబ్బందులు ఉన్నట్లు తెలుస్తుంది. మధిరలో టిఆర్‌యస్ ఇన్‌చార్జీ బమ్మెర రామ్మూర్తి , లింగాల కమల్‌రాజుల మధ్య సమన్వయలోపం ఉంది. సత్తుపల్లిలో ఇన్‌చార్జీగా పిడమర్తి రవి ఉన్నప్పటికి అక్కడ మంత్రిదే తుది నిర్ణయంగా ఉంటుంది. ఇక ఆశ్వారావుపేటలో తాటి వెంకటేశ్వర్లు ఎన్ని పంచాయతీలు గెలిపిస్తారనే దానిపై ఆయనకు భవిష్యత్ ఆదారపడి ఉంది. ఇలెందులో కోరం కనకయ్య ఒంటరిపోరు చేస్తున్నారు. పినపాక నియోజకవర్గంలో పాయం వెంకటేశ్వర్లు అధికపంచాయతీల గెలుచుకోవటం ద్వారా తన సత్తాచాటాలని చూస్తున్నారు. అయితే అక్కడ పరిస్థితులు అందుకు తగ్గట్లుగా లేవనే అభిప్రాయాలున్నాయి. ఇక భద్రాచలం నియోజవకవర్గంలో పాగాకోసం టిఆర్‌యస్ ప్రయత్నం ఎంతవరకు ఫలిస్తుందో చూడాలి.

నేడు చంద్రగ్రహణం కారణంగా

శ్రీవారి ఆలయం మూసివేత



తిరుమల, సూర్య ప్రత్యేకప్రతినిధి : చంద్రగ్రహణం కారణంగా బుధవారం ఉదయం 11.00 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు శ్రీవారి ఆలయ తలువులు మూసి వుంచుతారు. బుధవారం సాయంత్రం 5.18 గంటలకు చంద్రగ్రహణం ప్రారంభమై రాత్రి 8.41 గంటలకు పూర్తవుతుంది. చంద్ర గ్రహ ణం కారణంగా రూ. 300 ప్రత్యేక ప్రవేశదర్శనం టికెట్లు, దివ్యదర్శనం టోకెన్లు, వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులు తదితర ప్రత్యేక ప్రవేశ దర్శనాలను టిటిడి రద్దు చేసింది. విఐపి బ్రేక్ దర్శనాన్ని ప్రోటోకాల్ ప్రముఖులకు మాత్రమే పరిమితం చేయడం జరిగింది. మాతశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనాన్ని కూడా మూసివేస్తారు. అన్నప్రసాదాల వితరణ లేని కారణంగా వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లలోకి భక్తు లకు అనుమతి ఉండదు. ఆర్జితసేవలైన సహస్ర కలశాభిషేకం, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్రదీపాలంకార సేవలను కూడా టిటిడి రద్దు చేసింది. శ్రీవారి ఆలయం ఉదయం, రాత్రి కలిపి దాదావు 5 గంటల పాటు మాత్రమే తెరిచి ఉంటుందని, భక్తులు ఈ విషయాలను పరిగణలోకి తీసుకుని తమ తిరుమల యాత్రను సాగించాలని టిటిడి కోరుతోంది.

నేటి నుంచి అల్లిపల్లి

మరియతల్లి పుణ్యక్షేత్ర మహొత్సవాలు



చింతలపూడి మేజర్‌న్యూస్ :అల్లిపల్లి మరియతల్లి పుణ్యక్షేత్ర మహోత్సవములు జనవరి31, ఫిబ్రవరి 1, 2 తేదీలలో జరుగుతాయని అల్లిపల్లి మరియతల్లి పుణ్యక్షేత్ర డైరెక్టర్ రెవ.ఫాదర్ మరియజోజి రాయి (ఎం.ఎఫ్. గురువులు) తెలిపారు. ఆయన విలేకరు లతో మాట్లాడుతూ ఏలూరు మేత్రా సన చింతలపూడి మండలం అల్లిపల్లి గ్రామంలో 1970 సంవత్సరంలో అలిపల్లి కొండపై వెలసిన మరియ తల్లిని కొనియాడుటకు అంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు ఈ ఉత్సవాలకు హజరవుతారని తెలిపారు. జనవరి 31 ఎం.ఎఫ్ సుపీరియర్ జనరల్, ఇటలీ రెవ.ఫా. జెస్ డయాక్, ఏలూరు బిషప్ మహా. ఘన. శ్రీశ్రీశ్రీ పొలిమేర జయరావు హజరై మరియతల్లి భక్తులను దీవిస్తారని తెలిపారు. ఫిబ్రవరి 1న పెద్దకోరుకొండ విచారణ, ఎం.ఎఫ్ వైస్‌ప్రొవిన్సియల్ రెవ.ఫాదర్ రాజేంద్ర ప్రసాద్, ఎం.ఎఫ్. ఇంగ్లాండ్ రెవ.ఫా.కూరపాటి మారియో దివ్య బలిపూడలో పాల్గొంటారని తెలిపారు. ఫిబ్రవరం 2న ఎం.ఎఫ్. ఇటలీ రెవ.ఫా. నరెడ్ల రవి దివ్యబలి పూజలో పాల్గొంటారని, పలువురు గురువులచే సమిష్టి దివ్యబలిపూజ కార్యక్ర మం నిర్వహించబడుతుందని మరియజోజి రాయి తెలిపారు.

ఎవరీ సమ్మక్క, సారలమ్మలు?

(సూర్య ప్రత్యేక ప్రతినిధి–మేడారం) : 12వ శతాబ్దంలో నేటి జగిత్యాల జిల్లాలోని పొలవాస ను పాలించే గిరిజన దొర మేడరాజు ఏకక కుమార్తె సమ్మక్కను ఆయన మేనల్లుడైన మేడారం పాలకుడు పగిడిద్దరాజు కిచ్చి వివాహం చేశారు. వీరికి సారలమ్మ, నాగులమ్మ, జంపన్న అనే ముగ్గురు సంతానం . రాజ్యవిస్తర్ణ కాంక్షతో కాకతీయ ప్రభువు మొదటి ప్రతాపరుద్రుడు పొలవాసపై దండెత్తాడు. ఆయన దాడికి తట్టుకోలేక మేడరాజు మేడారం పారిపోయి అజ్ఞాతవాసం గడుపుతుంటాడు. మేడారాన్ని పాలించే కోయరాజు పగిడిద్దరాజు కాకతీయుల సామంతునిగా ఉంటూ కరువు కాటక పరిస్థితుల కారణముగా కప్పము కట్టలేక పోతాడు. కప్పం కట్టకపోవడంతోపాటు మేడరాజుకు ఆశ్రయం కల్పించటం కోయ గిరిజనులలో సార్వభౌమునికి వ్యతిరేకంగా విప్లవభావాలు నూరిపోసి రాజ్యాధికారాన్ని ధిక్కరిస్తున్నాడనే కారణముతో పగిడిద్ద రాజుపై ఆగ్రహం చెందిన ప్రతాపరుద్రుడు అతడిని అణిచి వేయడానికి తన ప్రధానమంత్రి యుగంధరుడితో సహా మేఘశుద్ధ పౌర్ణమిరోజున మేడారంపై దండెత్తాడు.

సాంప్రదాయ ఆయుధాలు ధరించి పగిడిద్దరాజు, సమ్మక్క, సారక్క, నాగమ్మ,



జంపన్న, గోవిందరాజులు వేర్వేరు ప్రాంతాల నుంచి గెరిల్లా యుద్ధాన్ని ప్రారంభించి వీరోచితంగా పోరాటంచేస్తారు. కాని సుశిక్షితులైన అపార అనుభవం కల్గిన కాకతీయసేనల దాటికి తట్టుకోలేక మేడరాజు, పగిడిద్దరాజు, సారలమ్మ, నాగులమ్మ, గోవిందరాజులు యుద్ధంలో మరణిస్తారు. పరాజయ వార్త విన్న జంపన్న అవమానాన్ని తట్టుకోలేక సంపెంగ వాగులో దూకి ఆత్మహత్య కు పాల్పడుతాడు. అప్పటినుంచి సంపెంగవాగు జంపన్న వాగుగా ప్రసిద్ధి చెందింది. ఇక సమ్మక్క యుద్ధ భూమిలో కాకలు తీరిన కాకతీయుల సైన్యాన్ని ముప్పుతిప్పలు పెడుతుంది. వీరోచింతంగా పోరాటం సాగించింది. గిరిజన మహిళ యుద్ధ నైపుణ్యానికి ప్రతాప రుద్రుడు ఆశ్చర్యచకితుడైయ్యాడు. చివరికి శత్రువుల చేతిలో దెబ్బతిన్న సమ్మక్క రక్తపు ధారలతోనే యుద్ధ భూమి నుంచి నిష్క్రమించి చిలుకగుట్టవైపు వెళుతూ మార్గ మధ్యలోనే అదృశ్యమౌతుంది. సమ్మక్కను వెతుక్కుంటూ వెళ్లిన అనుచరులకు ఆమె జాడ కనిపించ లేదు. కానీ ఆ పొంతంలో ఒక పుట్టదగ్గర పసుపు ,కుంకుమలు గల భరిణి లభించింది. దాన్ని సమ్మక్కగా భావించి అప్పటి నుంచి ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి మాఘశుద్ధ పౌర్ణమి రోజున సమ్మక్క జాతరను అత్యంత భక్తిశ్రద్దలతో జరుపుకోవటం అనవాయితిగా మారింది.

రామకృష్ణ తీర్థ ముక్కోటికి ఏర్పాట్లు పూర్తి



తిరుమల, సూర్య ప్రత్యేకప్రతినిధి : తిరుమలలో బుధవారం జరుగనున్న శ్రీ రామకష్ణ తీర్థ ముక్కో టికి టిటిడి ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రతిఏటా మకర మాసంలో పుష్యమి నక్షత్రంతో కూడిన పౌర్ణమినాడు శ్రీరామకష్ణ తీర్థ ముక్కోటి నిర్వహిం చడం ఆనవాయితీ. శ్రీవారి ఆలయానికి 6 మైళ్ల దూరంలో ఉన్న ఈ తీర్థంలో ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. శ్రీవారి ఆలయం నుంచి వైదికులు మంత్రోచ్చారణ చేసుకుంటూ ఊరేగింపుగా బయలుదేరి ఉదయం 10గంట లకు శ్రీ రామకష్ణ తీర్థానికి చేరుకుంటారు. శ్రీరామకష్ణ మహర్షి తపోబలంతో సష్టించినట్టుగా పేరొందిన ఈ పుణ్యతీర్థంలో ఆర్చక స్వాములు, ఆలయ అధికా రులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం తీర్థం ఒడ్డున కొలువై ఉన్న శ్రీరామచంద్రమూర్తి, శ్రీకృష్ణ భగవానుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్య సమర్పణ గావిస్తారు. ఈ తీర్థానికి వెళ్లే భక్తులకు పాప వినాశనం డ్యామ్ వద్ద పొంగలి, ఉప్మా, సాంబారన్నం, పెరుగన్నం, పులిహోర పొట్లాలు, తాగునీరు పంపిణీకి ఏర్పాట్లు చేపట్టారు.

నేడు పౌర్ణమి గరుడసేవ రద్దు

తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రతినెలా పౌర్ణమి సందర్భంగా నిర్వహించే గరుడసేవ బుధవారం నాడు రద్దయింది. చంద్రగ్రహణం కారణంగా పౌర్ణమి గరుడసేవను రద్దు చేసినట్టు టిటిడి ఒక ప్రకటనలో తెలిపింది.

విద్యార్థులకు విద్యతోపాటు క్రమశిక్షణను నేర్పించాలి

చిట్యాల, మేజర్‌న్యూస్: విధ్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణను నేర్పించాలని శాసనసభాపతి సిరికొండ మధుసూధనచారి సూచిం చారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 5వ వార్షికోత్సవం జరిగింది. ప్రిన్సిపాల్ శేఖర్ అధ్యక్షతన జరిగిన సమావే శంలో స్పీకర్ ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడుతు ఉపాధ్యాయులు విధ్యార్థులకు చదువుతో పాటు విలువలను భోదించాలన్నారు. విద్యార్థులు కసితోపాటు కృషి చేసి ఫలితం సాధించాలన్నారు. విద్యార్థుల భవిషత్తు వారి చేతుల్లోనే ఉందన్నారు. ప్రభుత్వం విధ్యార్థుల సంక్షేమం కోసం ప్రతి విధ్యార్థి కోసం లక్షా ఇరువై వేల రూపాలయలు ఖర్చు చేస్తుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు, పౌష్టికాహారం అందంచడం జరుగుతుందన్నారు. ప్రపంచాన్ని శాశించేది కేవలం చదువు ఒక్కటేనని అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఏమైన ఇబ్బందులు ఉన్నట్లైయితే అధ్యాపక బృందానికి వివరించాలన్నారు. స్టీఫన్‌హాకింగ్ ప్రపంచ మేదావులల్లో ఒకరని ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. విద్యార్థుల సౌకర్యార్థం బస్ షెల్టర్‌ను త్వరలో నిర్మిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకున్నట్లైయితే వారికి రూ.లక్ష రుపాయలు డిపాజిట్ చేస్తామని అన్నారు. సమావేశంలో పరకాల మార్కెట్ కమిటీ ఛైర్మన్ కుంభం రవీందర్‌రెడ్డి, సర్పంచి పుల్లూరి రమాదేవి, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంఈవో కొడెపాక రఘు పతి,ఎస్‌వీ విద్యాసంస్థల ఛైర్మెన్ సిరికొండ శ్రీనివాస్‌చారి, పాఠశాల ఛైర్మన్ తౌటం శ్రీనివాస్, డిఆర్‌వో అనంద్, నాయకులు ఆరెపెల్లి మల్లయ్య, జెన్నె యుగేందర్, మడికొండ రవీందర్‌రావు, కోడెల రాయమల్లు, జాలిగపు కిష్టయ్య, లాండె శంకర్‌రావు, అంకం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మేడారానికి బస్సులు ప్రారంభం : స్పీకర్

మండల కేంద్ర నుంచి మేడారం జాతర వరకు భక్తులను తరలించడానికి ఏర్పాటు చేసిన ఆర్‌టీసీ బస్సు పాయింటును మంగళవారం స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. భక్తుల సౌకర్యార్థం కోసం బస్సు పాయింటు ఏర్పాటు చేసినట్లు స్పీకర్ తెలిపారు. పెద్దలకు 170 పిల్లలకు 90 రూపాల చార్జిలను నిర్ణయించినట్లు స్పీకర్ తెలిపారు. ప్రజలు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకుని జాతరలో తల్లులను దర్శించుకుని సురక్షితంగా ఇంటికి చేరాలన్నారు.

ఈ కార్యక్రమం లోపరకాల మార్కెట్ కమిటీ ఛైర్మన్ కుంభం రవీందర్ రెడ్డి,



సర్పంచి పుల్లూరి రమాదేవి, ఆర్‌టీసీ క్యాంపు ఇన్‌ఛార్జి మాసు కొంరయ్య, క్యాంపు బాధ్యులు బాధ్యులు ఎలగొండ చందర్, క్యాతం రాజేందర్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

సూర్య
హైదరాబాద్
బుధవారం
31 జనవరి 2018

ఎస్ఆర్ఆర్ కళాశాల పరిరక్షణకు నడుంకట్టిన అఖిలపక్ష నేతలు

విజయవాడ, సూర్య బ్యూరో : ఎస్.ఆర్.ఆర్ అండ్ సి.వి.ఆర్. ప్రభుత్వ కళాశాలను కబ్జాకోరల నుండి పరిరక్షించుకునేందుకు విద్యార్థి లోకం నడుం బిగించింది. కళాశాల రక్షణకు పూర్వ విద్యార్థులైన వివిధ రాజకీయపక్షాల నేత లు రాజకీయాలకతీతంగా ఏకమయ్యారు. సరస్వతీ నిలయమైన కళాశాలను ఆక్రమణల చెర నుండి కాపాడుకుందామనే నినాదంతో మంగళవారం పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు భారీగా తరలివచ్చారు. ఎస్.ఆర్.ఆర్.కళాశాల నుండి భారీ ర్యాలీ చేపట్టి బిఆర్‌టిఎస్ రోడ్డు మీదుగా కాలేజీ వెనుక భాగంలో ఆక్రమణకు గురైన స్థలం వద్దకు చేరుకున్నారు. కాలేజీ స్థలాన్ని కబ్జా చేసిన వారు వివిధ పేర్లతో ఈ స్థలం మాది అంటూ పెట్టిన బోర్డులను అఖిలపక్ష నేతలు, విద్యార్థులు పెకలించివేశారు. పిల్లర్ల దశలో ఉన్న అక్రమ నిర్మాణాన్ని జె.సి.బి.తో కూల్చివేశారు. ఈ సందర్భంగా సి.పి.ఐ.నగర కార్యదర్శి, కాలేజి కోర్‌కమిటీ సభ్యులు దోనేపూడి శంకర్ మీడియాతో మాట్లాడుతూ ఎందరో మహానుభావులను, మేధావులను అందించిన ఈ కళాశాల వెనుక భాగంలో ఉన్న స్థలంపై కన్నేసిన కొందరు రాజకీయ ముసుగులో అధికారాన్ని అడ్డం పెట్టుకుని అడ్డగోలుగా దాదాపు 2 ఎకరాల భూమిని ఆక్రమించుకున్నారని, కబ్జా స్థలంలో మూడు ఇళ్ళు కూడా నిర్మించారని చెప్పారు. వివాదాస్పదమైన స్థలంలో నిర్మాణాలను నగర పాలక సంస్థ అధికారులు ఎలా అనుమతులు మంజూరు చేశారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నేతలు డి.కాశీనాథ్, గన్నే వంప్రసాద్, కాట్రగడ్డ బాబు, చెరుకూరి కృష్ణకుమార్, మహ బూబ్ ఆజం, లంక జానయ్య, రాచాకుల శ్రీనివాస్, ఎఐవైఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు ఎండి. మొయినుద్దీన్, బొక్కా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



అమరావతి నిర్మాణంలో భాగస్వామ్యం

- ఇటలీ సంస్థ అనస్ ఇంటర్నేషనల్ ఆసక్తి
- ముఖ్యమంత్రి చంద్రబాబుతో ప్రతినిధి బృందం భేటీ
- పెట్టుబడులను వివరించిన సీఆర్డీయే కమిషనర్ శ్రీధర్

వెలగపూడి, సూర్య ప్రధాన ప్రతినిధి : రాజధాని అమరావతి నిర్మాణంలో పాలుపంచుకునేందుకు ఇటలీకి చెందిన ఇంజినీరింగ్, నిర్మాణ సంస్థ అనస్ ఇంటర్నేషనల్ ముందుకొచ్చింది. భారత్‌తో ఇటలీ కాన్సుల్ జనరల్ స్టెఫానియా కోస్టాంజా సారథ్యంలో ప్రతినిధి బృందం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిసింది. రష్యా, ఖతార్, లిబియాల్లో ఇప్పటికే తమ సంస్థ అనేక ప్రాజెక్టులు చేస్తోందని, భారత్‌లోనూ కార్యకలాపాలు విస్తరించాలని భావిస్తున్నామని అనస్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు తెలిపారు. దోహాలో తాము నిర్మించిన ఐకానిక్ బ్రిడ్జి గురించి వివరించారు. అమరావతిలో రహదారి నిర్మాణ ప్రాజెక్టుల్లో భాగస్వాములవుతామని తెలిపారు. కృష్ణానదిపై నిర్మించే ఐకానిక్ వారధి నిర్మాణంపై ఆసక్తి కనబరిచారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపాదిత నిర్మాణ సామగ్రి నగరంలో భాగస్వాములు కావాలని ఆ సంస్థను సీఎం కోరారు. రాజధానిలో ఏయే అంశాల్లో సహకరించేందుకు అవకాశాలున్నాయో సీఆర్ డీఏ అధికారులతో చర్చించి, నిర్దిష్ట ప్రతిపాదనలతో రావాలని సూచించారు.

రాజధానిలో విస్తృత అవకాశాలు

అమరావతిలో ప్రధాన మౌలిక వసతుల అభివృద్ధిలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో రూ. 29,798 కోట్ల పెట్టుబడులకు అవకాశముందని సీఆర్ డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. ఇటలీ ప్రతినిధుల బృందం సోమవారం విజయవాడలోని ఒక హోటల్‌లో సీఆర్‌డీఏ అధికారులతో సమావేశమైంది. రాజధానిలో ఎల్పీఎస్ లేఅవుట్‌ల అభివృద్ధి, బాహ్య, అంతరవలయ రహదారుల పనుల్లో పీపీపీ విధానంలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలున్నాయని సీఆర్‌డీఏ కమిషనర్ పేర్కొన్నారు. రాజధానిలో ప్రస్తుతం ఎల్పీఎస్ లేఅవుట్‌లు, టైర్-1, టైర్-2 మౌలిక వసతుల పనులకు పెట్టుబడులు అవసరమవుతాయని తెలిపారు. ఎల్పీఎస్ లేఅవుట్‌లకు సంబంధించి 1.5 బిలియన్ డాలర్ల విలువైన పనులకు హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో ఐదు విడతలుగా టెండర్లు పిలిచామని, ఆసక్తిఉంటే వీటిలో పాల్గొనవచ్చునని సూచించారు. రాజధాని నగరం చుట్టూ రూ.7,624 కోట్లతో 97 కి.మీ.ల మేర అంతర వలయ రహదారి నిర్మాణానికి డీపీఆర్ పూర్తయిందని, ఆరు నెలల్లో పనులు మొదలవుతాయని, దీనిలోనూ పెట్టుబడులకు అవకాశాలుంటాయని తెలిపారు. 180కి.మీ. పొడవైన బాహ్య వలయ రహదారి నిర్మిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. తమ సంస్థ వందేళ్లుగా రహదారుల డిజైన్, నిర్మాణం, నిర్వహణ, మరమ్మతులు వంటి అంశాల్లో పనిచేస్తోందని అనస్ ఇంటర్నేషల్ సంస్థ సీఈఓ బెర్నార్డో మాగ్రి పేర్కొన్నారు. సమవేశంలో అనస్ టెక్ సీఈఓ నికోలా చియారా, ఛైర్మన్ రేమండ్ మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.



గిడ్డంగులు అందుబాటులో ఉంచుకోండి: సీఎం

పెరుగుతున్న పంట దిగుబడుల దృష్ట్యా గిడ్డంగులను అందుబాటులో ఉంచుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వేరుశనగ, మినుము, పప్పుధాన్యాల రైతులకు మద్దతు ధరలు దక్కేలా చూడాలని స్పష్టం చేశారు. వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. నీరు-ప్రగతి, వ్యవసాయాభివృద్ధి అంశాలపై తన నివాసం నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎం వివిధ అంశాలపై దిశానిర్దేశం చేశారు. దావోస్ సదస్సులో వ్యవసాయం, ఆహారభద్రతపై ఫలవంతమైన చర్చ జరిగిందని, ఏపి ప్రకృతి వ్యవసాయంలో నమూనాగా నిలిచి ప్రపంచ దృష్టిని ఆకర్షించిందని వెల్లడించారు. సకాలంలో నీరందించి సేద్యం పనులు తొలకరిలో ప్రారంభించేలా చూడటం వల్లే పంట దిగుబడులు పెంచగలిగినట్లు పేర్కొన్నారు. వర్షాభావాన్ని అధిగమించి రాయలసీమ రైతాంగానికి సాగునీరు అందించడం సంతృప్తి నిచ్చిందన్నారు. ఆక్వాలో కాలుష్యాన్ని పూర్తిగా నిర్మూలించాలన్నారు. కలుషితాల వల్ల ఆక్వా ప్రాధాన్యం తగ్గితే వృద్ధిరేటుపై గణనీయ ప్రభావం పడుతుందని హెచ్చరించారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. ఎన్టీఆర్ గృహనిర్మాణ లక్ష్యాలు 64 శాతానికే చేరడంపై అసంతృప్తి వెలిబుచ్చారు. ఫిబ్రవరిలో సామూహిక గృహ ప్రవేశాలు పండగలా నిర్వహించాలని స్పష్టం చేశారు. పంటకుంటల తవ్వకంలో మొదటిస్థానంలో ఉన్నామని సీఎం వివరించారు. జియోట్యాగింగ్ చేశాకే ఉపాధి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. మొక్కల పెరుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు చెప్పారు.

నిర్మాణంలో భాగస్వామ్యానికి ఆసక్తి...

రాజధాని అమరావతిలో నిర్మించనున్న రహదారుల ప్రాజెక్టుల్లో భాగస్వాములవుతామని ఇటలీకి చెందిన అనాస్ ఇంట ర్నేషనల్ నిర్మాణ సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకి తెలిపారు. ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణంపై కూడా వారు ఆసక్తి కనబరిచారు. వెలగపూడిలోని సచివా లయంలో సోమవారంనాడు సీఎంను కలిసిన వారు ఈ సందర్భంగా దోహాలో ఇప్పటికే తాము నిర్మించిన ఐకానిక్ బ్రిడ్జి గురించి వివరించారు. రష్యా, ఖతార్, లిబియాల్లోనూ తాము అనేక ప్రాజెక్టులను చేపట్టినట్లు తెలిపారు. అమరావతి నిర్మాణంలో ఏఏ అంశాల్లో పాలుపంచుకునేందుకు అవకాశాలున్నాయో గుర్తించేందుకు ఏపీసీ ఆర్డీయే ఉన్నతాధికారులతో చర్చలు జరపాల్సిందిగా సీఎం వారికి సూచించారు. రాజధానిలో ప్రతిపాదించిన కన్‌స్ట్రక్షన్ మెటీరియల్ సిటీ నిర్మాణంలో పాలుపంచుకోవాల్సిందిగా కూడా చంద్రబాబు వారితో చెప్పారు.

రూ. 29,798 కోట్ల పెట్టుబడులకు అవకాశం

నవ్యాంధ్ర రాజధాని నిర్మాణ కార్యకలాపాల్లో ప్రధానంగా ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధికి పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో సుమారు 4.7 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.29,798 కోట్లు) పెట్టుబడులకు అవకాశం ఉందని సీఆర్డీయే కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ అనాస్ ఇంటర్నేషనల్ కంపెనీ ప్రతినిధులకు తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై అధ్యయనం కోసం అమరావతిని సందర్శించి, సీఎంతో భేటీ అయిన వారు అనంతరం సీఆర్డీయే ఉన్నతాధికారులతో విజయవాడలో సమావేశమైంది. ఈ సందర్భంగా శ్రీధర్ రాజధానిలోని ఎల్పీఎస్ లేఅవుట్ల అభివృద్ధి, ఇన్నర్, అవుటర్ రింగ్‌రోడ్ల నిర్మాణంలో పీపీపీలో పెట్టు బడులకుగల అవకాశాలను వివరించారు. ఎల్పీఎస్ లేఅవుట్ల అభివృద్ధికి సంబంధించిన 1.5 బిలియన్ డాలర్ల విలువైన పనులకు హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యాం) విధానంలో 5 టెండర్లను పిలిచామన్న ఆయన ఈ విధానం గురించి తెలియజేశారు. వీటితోపాటు రాజధాని చుట్టూ రూ.7,624 కోట్లతో నిర్మించే 97 కిలోమీటర్ల పొడవైన ఇన్నర్ రింగ్‌రోడ్డు, 180 కి.మీ. పొడవైన అవుటర్ రింగ్‌రోడ్డు పనుల్లోనూ పెట్టుబడులకు అవకాశాలున్నాయని పేర్కొన్నారు. అనాస్ ఇంటర్నేషనల్ సీఈవో బెర్నాడో మాగ్రి మాట్లాడుతూ రహదారుల డిజైన్, నిర్మాణం, నిర్వహణ, మరమ్మతుల వంటి అంశాల్లో తమ సంస్థకు దాదాపు వందేళ్ల చరిత్రఉందని, పలుదేశాల్లో తమ కార్యకలాపాలు సాగుతున్నాయని చెప్పారు. భారతదేశంలో ఇటలీ కాన్సుల్ జనరల్ స్టెఫానియా కోస్టాంజా నేతృత్వంలో విచ్చేసిన ఇటలీ బృందంలో అనాస్ టెక్ సీఈవో నికోలా చియారా, ఛైర్మన్ రేమండ్ మైకేల్, బోర్డు డైరెక్టర్ జార్జి మైకేల్, కమర్షియల్ డైరెక్టర్ గియుసెప్పె సీలియా మాగ్నో, ఇంటర్నేషనల్ బిజినెస్ డెవలపర్ జానీ ఫెర్నాండెజ్, భారత భాగస్వామి ఆర్వీఆర్ చౌదరి ఉన్నారు.

గాంధీజీ ఆశయ లక్ష్యసాధనే నిజమైన నివాళి



విజయవాడ, సూర్య బ్యూరో : గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం స్థాపనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం జల వనరుల శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పిం చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహాత్మాగాంధీ వంటి మహనీయుని త్యాగాలను గుర్తు చేసుకుంటూ వారి బాటలో నడవాల్సిన అవశ్యకత ఉందన్నారు. ముఖ్యంగా యువత అటువంటి వారి విజయగాథలను తెలుసు కొని స్ఫూర్తి పొందాలన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న త్యాగధనుల ఫలాలను వృథా కానీయరాదని, వారు దేశానికి చేసిన సేవలను గుర్తుపెట్టుకోవా ల్సిన అవసరం ఉందని తెలిపారు. మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని రెండు నిమిషాలు మౌనం పాటించి, ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు.


ఎప్పటికీ కాంగ్రెస్ వాదినే : రోశయ్య



గుంటూరు, సూర్య బ్యూరో : తనకు వయసు పైబడటంతో ఇకపై రాజకీయాల్లో క్రియాశీలంగా పనిచేయడం సాధ్యం కాదని తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య వ్యాఖ్యానించారు. తాను ఎప్పటికీ కాంగ్రెస్ వాదినేనని, పార్టీ పదవులిచ్చినా వాటిని నిర్వహించే శారీరక సామర్థ్యం తనకిప్పుడు లేదని అభిప్రాయ పడ్డారు. గుంటూరులో మాజీ ఎమ్మెల్యే జయరామ్ బాబు ఇంటికి వచ్చిన రోశయ్యను మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణ, జేడీ శీలం, రాయపాటి శ్రీనివాస్ తదితర నేతలు పార్టీకలతీతంగా కలిశారు. వారితో పాటు అల్పాహారం చేసిన రోశయ్య జిల్లా నేతలతో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ దేశంలో గవర్నర్ల వ్యవస్థ ఉండాల్సిందేనని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాలు విపత్కర పరిస్థితుల్లో ఉన్నప్పుడు గవర్నర్ల పాత్ర చాలా కీలకమైనదని రోశయ్య చెప్పారు.

సీఎం చంద్రబాబుకు జీవితాంతం రుణపడి ఉంటాం

మంత్రి కాలవ శ్రీనివాసులు



వెలగపూడి, సూర్య బ్యూరో : అనంతపురం జిల్లా గుమ్మఘట్ట మండలంలో గల భైరవానితిప్ప ప్రాజెక్టుకు కృష్ణా జలాలు తీసుకురాడానికి అవసరమైన రూ. 969 కోట్లు విడుదల చేసినందుకు సీఎం చంద్రబాబు నాయుడుకు తనతోపాటు కళ్యాణదుర్గం శాసనసభ నియోజకవర్గ ప్రజలు జీవితాంతం రుణపడి ఉంటారని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గ్రామీణ గృహ నిర్మాణ శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలిపారు. వెలగపూడి సచివాలయంలోని ముఖ్య మంత్రి కార్యాలయంలో సీఎం చంద్రబాబును మంత్రి మర్యాదపూర్వకంగా మంగళ వారం కలిశారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను ఎత్తిపోతల ద్వారా భైరవానితిప్ప ప్రాజెక్టుకు తరలింపునకు రూ.969 కోట్లు మంజూరు చేయడం ఆనందకర విషయమన్నారు. భైరవానితిప్ప ప్రాజెక్టు ద్వారా 22,323 ఎకరాలకు సాగునీటితో పాటు నియోజక వర్గ ప్రజలకు తాగునీటి సౌకర్యం కూడా కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట తెలుగు యువత రాష్ట్ర నాయకులు ఉన్నం మారుతి చౌదరి ఉన్నారు.

టౌన్ ప్లానర్స్ డైరీ ఆవిష్కరించిన మంత్రి నారాయణ



వెలగపూడి, సూర్య బ్యూరో : ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్, ఇండియా వారు ప్రచురించిన 2018 డైరీని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ మంగళ వారం వెలగపూడి సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాఖ ప్రధాన కార్యదర్శి కరికాల వేలవన్, టౌన్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్, ఇన్స్టిట్యూట్ టౌన్ ప్లానర్స్ ఏపి చాప్టర్ అధ్యక్షులు రాముడు, సెక్రటరీ హిమబిందు, పాలకమండలి సభ్యులు శ్రీనివాసులు, బాలాజీ, ప్రసాదు, మూర్తి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ ప్రచురించిన డైరీ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ సంబంధించిన వివిధ ప్రభుత్వ ఉత్తర్వులు చట్టాలతో కూడిన సమాచారంతో ఇటు ప్రజలకు అటు ప్రొఫెషనల్స్ కు చక్కగా ఉపయోగపడుతుందని మంత్రి నారాయణ అభిలషించారు. 2017వ సంవత్సరంలో రాష్ట్రంలోని వివిధ పట్టణాభివృద్ధి సంస్థల రూపకల్పనలో టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ విభాగం అందించిన సేవల గూర్చి మంత్రి అభినందించారు.

ఫిలిం డైరక్టరీ ఆవిష్కరించిన సీఎం



విజయవాడ, సూర్య బ్యూరో : నవ్యాంధ్రప్రదేశ్ ఫిలిం డైరెక్టరీ2018 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు తన ఛాంబర్ హాలులో ఆవిష్కరించారు. 6 మిలీనియమ్ ఎం టర్‌ప్రైజెస్ సంస్థ ఈ ఫిలిం డైరెక్టరీని ప్రచురించింది. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలకు చెందిన సినిమా సమాచారం తోపాటు సినిమాకు అనుబంధంగా వున్న అని విభాగాలకు చెందిన ఫోన్ నెంబర్లతో ఈ వుస్తకం ప్రచురించారు. ఈ ఆవిష్కరణ సందర్భంగా ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఇదో మంచి ప్రయ త్నంగా అభినందించారు. రాష్ట్రంలో చిత్ర పరిశ్రమ నిలదొక్కుకొనేందుకు, ఒకరి సమాచారం మరొకరు తెలుసుకొనేందుకు ఇది ఉపయోగపడు తుందన్నారు. రాష్ట్రంలో చిత్ర పరిశ్రమ నిలదొక్కుకొనేందుకు ఇలాంటి ప్రయత్నాలు దోహదపడతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన వంతు సహాయ సహకారాలను చిత్ర పరిశ్రమకు అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర ప్రదేశ్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఎస్.వి.రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి వి.కె.రమేష్, 6 మిలీనియమ్ ఎంటర్‌ప్రైజెస్ ప్రతినిధులు, ఈ డైరక్టరీ సంకలన కర్తలు, సీనియర్ జర్నలిస్టులు ముదిగొండ సాంబశివరావు, కోలా వాసు పాల్గొన్నారు.

పవన్ అడగమంటేనే అడుగుతాం

ఏపీ కాంగ్రెస్ అధికార ప్రతినిధి జీవీరెడ్డి



హైదరాబాద్, సూర్య బ్యూరో : జనసేన పార్టీకి రాజ్యాంగం ప్రకారం గుర్తింపు రాకపోయినప్పటికీ పబ్లిక్ పరంగా గుర్తింపు పొందిందని, ప్రజాక్షేత్రంలోకి వచ్చిన పార్టీని ప్రశ్నించకుండా ఎలాఉంటామని ఏపీ కాంగ్రెస్ అధికార ప్రతినిధి జీవీరెడ్డి చెప్పారు. ప్రశ్నిస్తానంటూ 2014లోనే పవన్ ప్రజల్లోకి వచ్చారని, మళ్లీ కొత్తగా ప్రజల్లోకి వెళ్తానని పవన్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జనసేన పార్టీ తీరుతెన్నులపై విమర్శలు గుప్పించారు. జనసేనపార్టీ ప్రజల్లోకి వచ్చి దాదాపు నాలుగేళ్లు అవుతోందని, ఇంకా పార్టీ నిర్మాణం పూర్తికాలేదనే సాకుతో వారిని ప్రశ్నించవద్దనడం విడ్డూరంగా ఉందన్నారు. పవన్ అడగమంటేనే కొన్ని ప్రశ్నలు అడుగుతామన్న ఆయన పార్టీలకు మద్దతుపై క్లారిటీ ఎందుకివ్వలేక పోతున్నారని ప్రశ్నించారు. ప్రజలకోసం వచ్చానన్న పవన్ ప్రభుత్వానికి మద్దతుగా ప్రతిపక్షాలపై విమర్శలు చేయడమేంటని నిలదీశారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వంపై విమర్శలు చేయబోనని పవన్ చేసిన ప్రకటనపై స్పందించిన జీవీ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలే ఎన్నుకుంటారని, ప్రభుత్వంపై కాకపోతే ఎవరిపై విమర్శలుచేస్తారని ప్రశ్నించారు. పవన్‌పూర్తిగా కన్ఫ్యూజన్‌లో ఉన్నారని విమర్శించారు.

జన్మభూమి రుణం తీర్చుకుందాం

చీమకుర్తిను అభివృద్ధి చేస్తూ.. జన్మభూమి రుణం తీర్చుకుంటున్నా
తల్లితండ్రులు, జన్మభూమి, చదువు చెప్పిన పాఠశాలను మరవరాదు
1982-83 10వ తరగతి పూర్వవిద్యార్థుల కళాప్రాంగణ నిర్మితం
ప్రారంభించిన రాష్ట్ర మంత్రి శిద్ధా రాఘవరావు

చీమకుర్తి, మేజర్‌న్యూస్ : జన్మనిచ్చిన తల్లితండ్రులను, జన్మభూమిని, చదువు చెప్పిన పాఠశాలను మరచిపోకూడదని రాష్ట్ర మంత్రి శిద్ధా రాఘవ రావు పేర్కొన్నారు. మంగళవారం చీమకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1982 -83 10వ తరగతి పూర్వపు విద్యార్థులు సుమారుగా 6 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన కళాప్రాంగణాన్ని రాష్ట్రమంత్రి శిద్ధా రాఘవరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు పూర్వపు విద్యార్థి శిద్ధా కాశీవిశ్వేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి శిద్ధా మాట్లాడుతూ 1982-83 సంవత్సరపు 10వ తరగతి చదివిన పూర్వపు విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలకు కళాప్రాంగణాన్ని ఏర్పాటు చేయటం సంతోషదాయకమని, ఇతరులకు స్ఫూర్తి నిస్తుందన్నారు.



నేను కూడా ఒకప్పుడు మీలాగే ఎదురుగా కూర్చుని ఇదే పాఠశాలలో చదివానని, నేను కూడా పూర్వపు విద్యార్థినని ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేసుకున్నారు. చదివిన స్కూలుకు మంత్రిగా రావటం ఆనందంగా ఉందన్నారు. మీరు కూడా బాగా చదువుకుని, మీకు నచ్చిన రంగాలల్లో ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. ఇదే ఆశయాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మభూమి – మా ఊరు కార్యక్రమాలు ప్రారంబించారని, ప్రతిఒక్కరూ వారివారి గ్రామాలల్లో అభివృద్ధి చేసుకుంటే రాష్ట్రం సశ్యశామలం అవుతుందన్నారు. చీమకుర్తిలో జన్మించటంవల్ల జన్మభూమి రుణం తీర్చుకుంటున్నానన్నారు.. జిల్లా విద్యా శాఖాధికారి డి.ఎస్. సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు పూర్వపు విద్యార్థులు మౌలిక వసతులను కల్పించటాన్ని కొనియాడారు. లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకులు బి.జవహర్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం, గాంధీజి స్ఫూర్తితో విద్యార్థులు వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డిఎస్పీ శ్రీనివాసులు, మాజీ ఎయంసి మారం వెంకా రెడ్డి, కాట్రగడ్డ రమణయ్య, మన్నం ప్రసాదు, వేమా శ్రీనివాసరావు,నూనె సుబ్రహ్మణ్యం, పూర్వపు విద్యార్థులు అవిశినేని వెంగన్న,ఆముదాలపల్లి రామబ్రహ్మం, డాక్టరు కోటేశ్వరరావు, ఎలక్ట్రికల్ డి.ఇ.చల్లా రమేష్, గీతా, అరుంధతి, రాధా, వల్లెపు సుశీల తదితరులు పాల్గొన్నారు.

పవన్‌వి రిక్వస్టింగ్ రాజకీయాలు




హైదరాబాద్, సూర్య బ్యూరో : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సేఫ్ గేమ్ ఆడుతున్నారని సినీ విమర్శకుడు కత్తి మహేశ్ అన్నారు. 2019 ఎన్నికల్లో అధికారంలోకి రాబోయే పార్టీలకు మిత్రపక్షంగా అయ్యేందుకు పవన్ ప్రయత్నిస్తు న్నారని విమర్శించారు. టీడీపీకి పవన్ క్యాంప్ ఆఫీస్ లాంటివారని వ్యాఖ్యానించారు. పవన్‌ది రిక్వస్టింగ్ రాజకీయం అని ఎద్దేవా చేశారు. క్లిష్టమైన సమస్యలపై రిక్వస్ట్ పెడితే ప్రభుత్వం నుంచి ఎలాంటి రెస్పాన్స్ రాదనే విషయాన్ని గ్రహించి పవన్ తెలివి గా తీర్చగలిగే సమస్యల పైనే చంద్రబాబుకు రిక్వస్ట్ పెడతారన్నారు. పోల వరం పై శ్వేతపత్రం విడుదల చేయాలని పవన్ కోరతే ప్రభుత్వంనుంచి ఎలాంటి రెస్పాన్స్ రాలేదని, పైగా నీకెందుకు అని చంద్రబాబు, పవన్‌కు పరోక్షంగా చురకలంటించిన విషయాన్ని కత్తి ఉదహరించారు.


ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ప్రభుత్వ ఆలోచనలు ప్రజలకు వివరించాలి
- 'దళిత తేజం-తెలుగుదేశం' దళితవాడలకు చేరువ కావాలి
- జిల్లా పార్టీ కార్యాలయాలు త్వరతగతిన ఏర్పాటు చేయాలి
- గ్రామ స్థాయినుంచి ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందివ్వాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు జిల్లా ప్రజా ప్రతినిధులు, ఇన్‌చార్జ్‌లకు ఆదేశం

సూర్యప్రతినిధి, ఒంగోలు : పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా ప్రజా ప్రతినిధులను ఆదేశించారు. మంగళవారం అమరావతి నుంచి జిల్లాల ఇన్‌చార్జ్‌లతో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. కాన్ఫిరెన్స్‌లో పాల్గొన్న రాష్ట్ర మంత్రి శిద్ధా రాఘవరావు, జిల్లా అధ్యక్షులు దామచర్ల, ఇన్‌ఛార్జ్‌లను పలు సూచనలు సూచించారు. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. అలా తీసుకెళ్లినప్పుడు ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందన్నారు. నియోజకవర్గాల్లో సమస్యలు నివేదికను తయారు చేసి అధిష్టానం దృష్టికి తీసుకరావాలన్నారు. 'దళిత తేజం– తెలుగు దేశం' కార్యక్రమం జిల్లాలో ఎలా జరుగుతుందని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా మండల స్థాయిలో కమిటీలు, నియోజవర్గ స్థాయిలో కమిటీలు పెండింగ్ ఉంటే పూర్తి చేయాలన్నారు. గ్రామ స్థాయి వరకు ప్రభుత్వ పథకాలు తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అదేవిధంగా పార్టీ కార్యాలయాలు నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. స్థలం కేటాయిస్తే వెంటనే పార్టీ కార్యాలయం నిర్మించేందుకు వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి శిద్ధా, దామచర్లతో పాటు ఎమ్మెల్సీ పోతుల సునీత, మాజీ శాసన సభ్యులు దివి శివరాం, లీడ్ క్యాప్ ఛైర్మన్ గుడూరి ఎరిక్షన్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి యర్రాకుల శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మూరి రవిచంద్ర, సీనియర్ నాయకులు టివి శ్రీరాంమూర్తి పాల్గొన్నారు.




పిఆర్‌సి ఎరియర్స్, నూతన కమిటీపై సీఎంని కలసిన ఎన్జీవోలు




విజయవాడ, సూర్య బ్యూరో : ఇటీవల ముఖ్యమంత్రి దావోస్ పర్యటన విజయవంతమైన సందర్భంగా ఎ.పి.ఎన్.జి.వో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి.అశోక్‌బాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. చంద్రశేఖంరెడ్డి, కోశాధి కారి వీరంద్రబాబు, జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ తదితర ఎన్.జి.వో నాయకులు మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి అభినందనలు తెలియజేశారు. అనంతరం అశోక్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు గత మూడు సంవత్సరాలుగా బకాయి ఉన్న పి.ఆర్.సి ఎరియర్స్‌ను తక్షణమే విడుదల చేయాలని కోరారు. వేతన సవరణ కమిటీ గడువు ముగిసినందున 2018 జూలై నుండి నూతన వేతనాలను చెల్లించవలసి ఉన్నందున తక్షణమే పి.ఆర్.సి కమిటీని నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులకు బకాయి ఉన్న డి.ఎ బకాయిలలో ఇటీవల ఒక బకాయిని మంజూరు చేయడం పట్ల ఉద్యోగుల పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దుచేయాలని దేశవ్యాప్తంగా ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారన్నారు. ఉద్యోగుల సమస్య కారణంగా సి.పి.ఎస్ విధానాన్ని పూర్తిగా రద్దుచేయాలని తాము కూడా కోరుతున్నా మని, సి.పి.యస్ రద్దుకు కూడా చర్యలు తీసుకోవాలని సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కొంత అలస్యమైనప్పటికి ఉద్యోగు లకు సంబంధించిన సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు అశోక్‌బాబు తెలిపారు.

మహాత్మాగాంధీ జీవితం ఆదర్శప్రాయం



విజయవాడ, సూర్య బ్యూరో : మహాత్మాగాంధీ జీవితం ఆదర్శప్రాయమని, గాంధీజీ ఆశయాల సాధనకై ప్రతి వారూ కృషి చేయాలని మద్య నిషేధ సమితి రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఉప్పులూరి మల్లి ఖార్జున శర్మ అన్నారు. మంగళవారం నగరంలో నిర్మాణంలో వున్న గాంధీజీ ఆలయం వద్ద జరిగిన గాంధీ వర్ధంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లిఖార్జునశర్మ మాట్లాడుతు భారతదేశ స్వాతంత్ర్యపోరాటంలో మహాత్మాగాంధీ జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. అహింస ద్వారా, శాంతియుత ఆందోళనల ద్వారా బ్రిటీష్‌వారిని గాంధీజీ ఎదిరించారని, మన దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చారని అన్నారు. ఎస్ఎస్ కాలేజీలో మహాత్మాగాంధీ ఆలయాన్ని రాంపిళ్ల జయప్రకాష్ ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. కాలేజీ ప్రాంగణంలో మహాత్ముని ఆలయం నిర్మించడం జరుగుతోందని, త్వర లోనే ఈ ఆలయం సీఎం చేతుల మీదుగా ప్రారంభం కానుందని చెప్పారు. మహాత్ముని బోధనలు ఎంతో అనుసరణీయమన్నారు. తొలుత గాంధీ వర్ధంతి సందర్భంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో స్వాతంత్ర్య సమరయోధుడు యెర్నేని నాగేశ్వరరావు, సయ్యద్ అప్పలస్వామి కళాశాల డైరక్టర్ పి. డేవిడ్‌రాజు, ఎస్ఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ నంబూరి త్యాగరాజు, ప్రముఖ వ్యాపారవేత్త తమ్మిన మారుతీ, రాంపిళ్ల గౌరీశంకర్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

హజ్ మొదటి విడత చెల్లింపునకు 12 వరకు గడువు పెంపు



విజయవాడ, సూర్య బ్యూరో : హజ్ యాత్రికులు మొదటి విడత 81 వేల రూపాయలు చెల్లింపుకు, ఫిబ్రవరి 12వ తేదీ వరకు గడువు పెంచుతూ సెంట్ర ల్ హజ్ కమిటీ నిర్ణయం తీసుకుందని ఎపి స్టేట్ హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహమ్మద్ లియాఖత్ అలీ పత్రికా ప్రకటన విడుదల చేశారు. జనవరి 31వ తేదీన మొదటి విడత చెల్లించడానికి గడువు ముగుస్తున్న నేపథ్యంలో సెంట్రల్ హజ్ కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రతి హజ్ యాత్రికుడు 81 వేల రూపాయలు బ్యాంక్‌లో జమా చేసినట్లు ఒరిజినల్ బ్యాంక్ పే ఇన్ స్లిప్, మెడికల్ స్క్రీనింగ్ అండ్ల ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఒరిజినల్ పాస్ పోర్ట్, వైట్ బ్యాగ్ గ్రౌండ్ల కలర్ ఫొటోలను విజయ వాడలోని ఎపి స్టేట్ హజ్ కమిటీ కార్యాలయంలో వెంటనే అంద జేయాలని ఎపి స్టేట్ హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహ మ్మద్ లియాఖత్ అలీ తెలిపారు.











విశ్వాంతరాలకేగిన వ్యోమగామి

కల్పనా చావ్లా



కల్పనా చావ్లా ఒక ఇండియన్ -అమెరికన్ వ్యోమగామి మరియు వ్యోమనౌక యంత్ర నిపుణురాలు. అంతరిక్షంలో అడుగుపెట్టిన తొలి భారత సంతతి మహిళగా ఖ్యాతిని దక్కించుకుంది. కొలంబియా వ్యోమనౌక విపత్తు లో చనిపోయిన ఏడుగురి బృందం లో ఈమె కూడా ఒకరు.

కల్పనా చావ్లా, భారత దేశంలో హర్యానాలోని కర్నాల్ అనే ఊరులో ఒక పంజాబీ కుటుంబంలో మార్చ్ 17, 1962న వుట్టారు. కల్పన అంటే సంస్కృతం లో అర్థం ఊహష్. సాంప్రదాయ కుటుంబ కట్టుబాట్లలో నుండి, లింగ వివక్షను దూరం చేస్తూ, పురిటిలోనే ఆడపిల్లల కుత్తుకలను నులిమేస్తున్న రోజుల్లో, పక్షిలా అంతరిక్షంలో వీరవిహారం చేయాలన్న తృష్ణ, ఆశ చిన్నతనంలోనేఅంకురించి, రంగరించుకున్నది 'కల్పనాచావ్లా'. ఆకాశం, నక్షత్రాలు, వినీలాకాశంలో ఎగిరే పిట్టలు, గ్రహాలూ, అంతరిక్షంలో జరిగే అద్భుతాలకు కల్పనా ఆకర్షింపబడేది.

నలుగురు సంతానంలో చిన్న. తండ్రి బనారసీలాల్ చావ్లా టైర్ల వ్యాపారంలో ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొని, పట్టుదలతో రాణించారు. రాష్ట్రపతి అభినందనలందుకున్నారు.

తండ్రి మాటలు, చేతలు కల్పన మనసులో బలంగా నాటుకుపోయాయి. లక్ష్యం ఏదైనా, దాన్ని అందుకోవాలంటే ఆటంకాలు తప్పవని తన జీవనయానంలో తెలుసుకున్నారు కల్పన. వాటిని అధిగమించేందుకు బాల్యం నుంచీ చేసిన ప్రయత్నాలు అన్నీ ఇన్నీ కావు. కల్పనా చావ్లా కర్నాల్ లో ఉన్న టాగోర్ పబ్లిక్ స్కూల్లో చదువుకున్నారు.

పాఠశాల వాతావరణంలో ఆరు బయట వేపచెట్టు క్రింద కూర్చొని ఆకాశంవైపు చూస్తూ ఉండేది కల్పన. ఆమె నివసిస్తున్న ప్రాంతంలో తరచూ విమానాలు ఎగురుతూ ఉండేవి. విమానం భూమికి దగ్గరగా వెళ్ళేటప్పుడు, కల్పనలో చెప్పాలేని ఆనందం.

ఆమె సంతోషంతో, నేలపై కాలివెళ్ళను తాకిస్తూ, పక్షిలా పరిగెత్తేది. భవిష్యత్తులో గ్రహాలమధ్య, అంతరిక్షంలో పరిశోధనలు చేయాల్సి వస్తుందన్న, సంకేతాలు బాల్యంలోనే కల్పనలో వెలుగు చూశాయి.

1982 లో ఈమె చండీగఢ్ లోఉన్న పంజాబ్ ఇంజనీరింగ్ కాలేజీ నుంచి ఏరోనాటికాల్ ఇంజనీరింగ్ సైన్సు పట్టాను సంపాదించారు. ఆపై ఈమె అమెరికా వెళ్లి అక్కడ ఏరోస్పేస్ ఇంజనీరింగ్ లో మాస్టర్ అఫ్ సైన్సు డిగ్రీని, అర్లింగ్టన్ లో ఉన్న టెక్సాస్ విశ్వవిద్యాలయం నుంచి 1984 లో పొం దారు. 1986 లో, చావ్లా రెండవ మాస్టర్ అఫ్ సైన్సు డిగ్రీని మరియు ఏరోస్పేస్ ఇంజనీరింగ్ లో పిహెచ్ .డి ని బౌల్డర్ లో ఉన్న కోలోరాడో విశ్వవిద్యాలయం నుంచి పొందారు.

అదే సంవత్సరం లో, ఏమ్స్ పరిశోదనా కేంద్రం లో ఓవర్ సెట్ మేతడ్స్, ఇంక్‌కి వైస్ ప్రెసిడెంట్ గావ్యవహరించారామె. ఇక్కడ ఈమె వి /స్టోల్ మీద సిఎఫ్ డి పరిశోధన చేసారు. చావ్లా విమానాల కు,గ్లైడర్లు లకు మరియు ఒకటి లేదా ఎక్కువ యంత్రాలు ఉండే విమానాలకు, వ్యాపార విమానాలకు శిక్షణ ఇచ్చే యోగ్యతాపత్రం కలిగి ఉన్నారు. ఆమె దగ్గర యఫ్సిసి జారీ చేసే టెక్నికల్ క్లాసు అమెచూర్ రేడియో అనుమతి కాల్ సైన్స్ ఉంది. ఈమెకి ఆకాశంలో విహరించాలనే అభిరుచి, విమాన చోదకంలో మార్గదర్శక పైలట్ మరియు వ్యాపారవేత్త ఐన జే.ఆర్.డి.టాటా నుంచి వచ్చింది.

వివాహం

ఆమె 1983 లో పరిశోధనాకాలంలోనే తన అభిరుచులను గౌరవించే ఫ్రెంచ్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్, వైమానిక వ్యవహారాల రచయిత జీన్ పియెర్రా హ్యారిసన్‌ను ప్రేమ వివాహం చేసుకున్నారు. , 1990 లో యునైటెడ్ స్టేట్స్ దేశ పౌరురాలి గా అయ్యారు.

వ్యోమనౌకను పోలిన దానిలో చావ్లా

1995 లో వ్యోమగామి కార్ప్స్ లో చేరారు మరియు 1998 లో మొదటి సారిగా అంతరిక్షయానం కోసం ఎన్నికైయ్యారు. ఆమె మొదటి స్పేస్ ప్రయాణం 1997 నవంబర్ 19 న స్పేస్ షటిల్ కొలంబియా -87 లో ఆరు వ్యోమగాముల సభ్యులతో మొదలైంది చావ్లా, మూడు పదుల వయసులో అంతరిక్షంలోకి వెళ్లారు భారతదేశం లో వుట్టి అంతరిక్షం లోకి ఏగిన తొలి మహిళ మరియు భారత దేశ సంతతిలో అంతరిక్షయానం చేసిన రెండో వ్యక్తి ఈమె, 1984 లో సోవియట్ స్పేస్ క్రాఫ్ట్ లో అంతరిక్షయానం చేసిన వ్యోమోగామి రాకేశ్ శర్మాను అనుసరించారు.

ఆమె మొదటి విధిలో, చావ్లా భూగ్రహం చుట్టూ, మిషన్ స్పెషలిస్టుగా కొలంబియా ఎస్‌టిఎస్-87 మీద అంతరిక్షయానం చేసి సూర్యుని వెలుపలి వాతావరణాన్ని అధ్యయనం చేసి వచ్చారు. అంతరిక్షంలో పాదం మోపిన కల్పన 376 గంటల పాటు అక్కడే గడిపి, భూమి చుట్టూ 252 సార్లు పరిభ్రమించి మొత్తం 10.4 మిలియన్ మైళ్ళ దూరాన్ని ప్రయాణించారు. దీంతో యావత్ ప్రపంచం ఆమెను ఓ అద్భుత నక్షత్రంగా కీర్తిస్తూ తల ఎత్తి సెల్యూట్ చే సిందంటే అతిశయోక్తి కాదేమో!

1987 సమయంలో, ఈమె తన భాద్యతను సద్వినియోగం చేస్తూ స్పార్టన్ ఉపగ్రహం వదలగా, అది పనిచేయకపోవటం వల్ల, విన్స్టన్ స్కాట్ తప్పని స్థితిలో అంతరిక్షంలో ఉపగ్రహాన్ని పట్టుకోవటానికి నడిచారు. కల్పన ప్రతిభను గుర్తించిన నాసా 1997లో అంతరిక్షయానానికి పంపింది. రెండవసారి ఎస్‌టిఎస్-87 ప్రయోగ బాధ్యతలను కల్పనకే అప్పజెప్పింది. అయితే స్పార్టన్ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి వదలగా, అది పనిచేయకపోవడంతో కల్పనపై అభియోగాలు వెల్లువలా వచ్చిపడ్డాయి. అయినా కృంగిపోలేదు. ఐదు నెలల విచారణ జరిపిన నాసా సాఫ్ట్‌వేర్, విమానసభ్యులదే తప్పిదమని తెలుసుకుంది. చావ్లా తప్పేమీ లేదని తేల్చి చెప్పింది.

ముగింపు పనులు పూర్తి అయిన తర్వాత, వ్యోమగాముల ఆఫీసులో చావ్లాను సాంకేతిక స్థానంలో నియమించారు. ఇక్కడ ఈమె పనిని గుర్తించి, సహుద్యోగులు ప్రత్యేకమైన బహుమతిని ఇచ్చారు.

2000లో ఈమెను రెండవసారి అంతరిక్ష యానం చేయటానికి మిగిలిన సభ్యులతోపాటు ఎన్నుకున్నారు. ఈ క్షిపణి, నిర్ణీత కాలం నిశ్చయించటంలో విభేదాలు మరియు సాంకేతిక సమస్యలు, ఎలాంటివంటే 2002 లో గుర్తించిన నౌకా ఇంజనులో బీటలు వంటివాటివల్ల పలుమార్లు ఆలస్యం జరిగింది. 2003 జనవరి 16, చివరగా చావ్లా తిరిగి కొలంబియా , విధివంచితమైన క్షిపణి లో చేరారు. చావ్లా భాద్యతలలో మైక్రో గ్రావిటీ ప్రయోగాలు ఉన్నాయి, వీటి కోసం భూమీ ఇంకా అంతరిక్ష విజ్ఞానం, నూతన సాంకేతిక అభివృద్ధి మరియు వ్యోమగాముల ఆరోగ్యం ఇంకా వారి జాగ్రత మీద సభ్యులు 80 ప్రయోగాలు చేసారు.

1991లో భర్త తో కలసి చావ్లా, తన కుటుంభ సభ్యులతో సెలవలు గడపటానికి చివరిసారిగా భారతాదేశం వచ్చారు. వివిధ కారణాలవల్ల, చావ్లా వ్యోమగామి ఐన తర్వాత భారతదేశం రమ్మని ఆహ్వానించినప్పటికి ఆమె దానిని అనుసరించ లేకపోయారు. అంతరిక్షంలో ఏ చిన్న పొరపాటు జరిగినా బూడిద కూడా మిగలదని తెలిసినా ఈ ధీశాలి మరణాన్ని సైతం చిరునవ్వుతో స్వీకరించారు మళ్లీ ఆకాశంలోకి పయనమైపోయారు. అయినా యావత్ ప్రపంచానికి తేజోవంతమైన నక్షత్రంలా ఎపప్పటికీ భాసిల్లుతూనే ఉంటారు. ■

రేపు కల్పనా చావ్లా వర్ధంతి సందర్భంగా



అంతరిక్ష యానానికి బయలుదేరుతూ తన సహచరులతో కల్పనా చావ్లా



అందమైన చర్మం పొందడం కోసం అందరూ ఎదురుచూస్తూ ఉంటారు. అందానికి ముల్తానీ మట్టి ఎలా ఉపయోగపడుతుందో తెలుసుకుందాం. ముల్తానీ మట్టిలో అద్భుతమైన లక్షణములు ఉన్నవి. దీనిలో ఖనిజాలు ఎక్కువగా ఉండటం వలన చర్మాన్ని మెరిసేలా చేస్తుంది. ఇది చర్మంలోని గరుకుతనాన్ని పోగొట్టి చర్మాన్ని మృదువుగా చేస్తుంది. ముల్తానీ మట్టి చర్మంపై ఉండే మృత కణాలను తొలగించి కొత్త చర్మ కణాలను ఉత్తేజ పరుస్తుంది.

ముల్తానీతో ముఖ సౌందర్యం

పురాతన కాలం నుంచి ముల్తానీ మట్టి సహజంగా మొటిమలను తగ్గించుటకు ఉపయోగిస్తున్నారు. ముల్తానీ మట్టి చర్మ రకములన్నింటికి ఉపయోగపడుతుంది. దీనిని ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు.

కాంతివంతమైన చర్మం కోసం

2-3 స్పూన్స్ ముల్తానీ మట్టి, ఒక టేబుల్ స్పూన్ పెరుగు, దోసకాయ గుజ్జు మరియు 2-3 టేబుల్ స్పూన్స్ శనగపిండిని తీసుకుని అన్నింటిని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్ వేసుకుని, 20 నిమిషముల తరువాత చల్లని లేదా గోరువెచ్చని నీటితో కడగాలి.

2 టేబుల్ స్పూన్స్ ముల్తానీ మట్టి, ట టేబుల్ స్పూన్స్ గంధవు పొడి మరియు చిటికెడు పసువు తీసుకుని అన్నింటిని బాగా కలిపి, మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్ వేసుకోవాలి. ఆరిన తరువాత నీటితో శుభ్ర పరచాలి. ఇది ఆయిలీ మరియు పొడి చర్మాలకు మంచి ఫలితాన్ని ఇస్తుంది. మీ చర్మాన్ని కాంతివంతం చేస్తుంది.

ముల్తానీ మట్టి, తేనే, పసువుతో చేసిన ప్యాక్ మీ చర్మాన్ని మెరిసేలా చేస్తుంది. మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్ వేసుకుని, 20 నిమిషముల తరువాత చల్లని నీటితో కడగాలి.

పొడి మరియు ఆయిలీ చర్మం కోసం

2-3 స్పూన్స్ ముల్తానీ మట్టి, ఒక టేబుల్ స్పూన్ పెరుగు, 1/2 స్పూన్ నిమ్మరసం మరియు చిటికెడు పసువు తీసుకుని అన్నింటిని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి మరియు మెడకి ప్యాక్ వేసుకుని, 20 నిమిషముల తరువాత చల్లని లేక గోరువెచ్చని నీటితో కడగాలి.



2-3 టేబుల్ స్పూన్స్ ముల్తానీ మట్టి మరియు 2 టేబుల్ స్పూన్స్ బంగాళదుంప గుజ్జు తీసుకుని బాగా కలపాలి. మిశ్రమాన్ని ముఖానికి మరియు మెడకి అప్లై చేసి, 20 నిమిషముల తరువాత చల్లని నీటితో కడగాలి.

ఆయిలీ చర్మం కోసం

2-3 టేబుల్ స్పూన్స్ ముల్తానీ మట్టి, ఒక టేబుల్ స్పూన్ టమాటో గుజ్జు, 1/2 టేబుల్ స్పూన్ నిమ్మరసం మరియు ఒక టేబుల్ స్పూన్ తేనే తీసుకుని పేస్టులా చేయండి. ఈ మిశ్రమాన్ని ముఖానికి మరియు మెడకి పట్టించి, 20 నిమిషముల తరువాత గోరు వెచ్చని నీటితో శుభ్రం చేయండి.

సన్ టాన్ని తొలగించుటకు

2-3 టేబుల్ స్పూన్స్ ముల్తానీ మట్టి, 1 ట టేబుల్ స్పూన్ కొబ్బరి నీరు మరియు ఇ టేబుల్ స్పూన్ పంచదార తీసుకుని అన్నింటిని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి మరియు మెడకి ప్యాక్ వేసుకుని, 15 నిమిషముల తరువాత గోరు వెచ్చని నీటితో కడగాలి.

పొడి చర్మం కోసం

2 టేబుల్ స్పూన్స్ ముల్తానీ మట్టి, ఒక టేబుల్ స్పూన్స్ పాల పొడి, ఒక టేబుల్ స్పూన్ ఓట్స్, ఒక టేబుల్ స్పూన్ గుడ్డులోని తెల్ల పొర, ఒక టేబుల్ స్పూన్స్ పెరుగు మరియు ఒక టేబుల్ స్పూన్ తేనే తీసుకుని అన్నింటిని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి మరియు మెడకి ప్యాక్ వేసుకుని, 20 నిమిషముల తరువాత గోరు వెచ్చని నీటితో కడగాలి.



ముల్తానీ మట్టి మరియు బాదం యొక్క పేస్ ప్యాక్ చర్మాన్ని నునువుగా చేస్తుంది. పాలల్లో ముల్తానీ మట్టి మరియు బాదం కలిపి ప్యాక్ తయారు చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్ వేసుకుని, 20 నిమిషముల తరువాత నీటితో కడగాలి.

కొవ్వు చర్మాన్ని తగ్గించుటకు

2-3 టేబుల్ స్పూన్ ముల్తానీ మట్టి మరియు ఒక టేబుల్ స్పూన్ గుడ్డులోని తెల్ల పొర కలిపి పేస్టులా చేయండి. ఈ మిశ్రమాన్ని ముఖానికి మరియు మెడకి ప్యాక్ వేసుకుని, 20 నిమిషముల తరువాత గోరు వెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ■

సూర్య సినిమా

తారలతో తళుకులీనిన తాహెర్ @ 40

తెలుగు చిత్ర పరిశ్రమకు ఇండోర్, అవుట్ డోర్ సేవలందిస్తున్న తాహెర్ సంస్థ నలభై ఏళ్ళు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగడా సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులతో పాటు రాజకీయ ప్రముఖులు కూడా విచ్చేసి.. తెలుగు సినిమా పరిశ్రమకు తాహెర్ అందిస్తున్న సేవలను కొనియాడి, తాహెర్ నిర్వాహకులను అభినందించారు. ఈ వేడుకలో తెలంగాణ పంచాయితీ రాజ్-ఐటి శాఖామాత్యులు కల్వకుంట్ల తారక రామారావు, పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఒవైసీ, ఎం.ఎల్.ఏ అక్బరుద్దీన్ ఒవైసీ, తెరాస శాసన సభ్యులు-నిర్మాత మాగంటి గోపీనాథ్, ప్రముఖ కథానాయకులు నాగార్జున, మోహన్ బాబు, నిర్మాతలు అల్లు అరవింద్, అశ్వనీదత్, కె.ఎస్.రామారావు, జెమినీ కిరణ్, అక్కినేని వెంకట్, ఛోటా కె.నాయుడు, మాజీ మంత్రి షబ్బీర్ అలీ పాల్గొన్నారు!



నవనవలాడుతున్న లావణ్యం



జస్ట్ అప్పుడే కోసిన ఆర్గానిక్ టొమేటోలాగా నవనవలాడే లావణ్యా త్రిపాఠిని చూసి మనసు పారేసుకోని కుర్రాళ్లు ఎవరైనా వుంటారా? అందుకే ఈ అమ్మడికి అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా తన తాజాచిత్రం 'ఇంటిలిజెంట్'లో ఈ అమ్మడు తన అందాలను మరింత ఉదారంగా ఆరబోసిందని సమాచారం!

రేసుగుర్రంలా రప్ఫాడిస్తూ ఎంటర్‌టైన్ చేస్తా

కథలు మరీ కొత్తగా ఉంటే కోరుకుడు పడవు!



తను చేసే ప్రతి క్యారక్టర్‌లో ఎనర్జీ నింపే హీరో రవితేజ. అతను నింపే ఎనర్జీ మంచి ఎంటర్‌టైన్ మెంట్ పంచుతుంది. అందుకే రవితేజ సినిమాలంటే పైసా వసూల్ అని ఫిక్స్ అయిపోయి థియేటర్స్ ముందు ఆడియన్స్ బారులు తీరతారు. కొంచెం గ్యాప్ తీసుకొని 'రాజా ది గ్రేట్' చిత్రంతో ఫుల్ ఫామ్‌లోకి వచ్చిన రవి తాజా చిత్రం 'టచ్ చేసి చూడు' ఫిబ్రవరి 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. విక్రమ్ సిరికొండను దర్శకుడిగా పరిచయం చేస్తూ వల్లభనేని వంశీతో కలిసి నల్లమలుపు శ్రీనివాస్ (బుజ్జి) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రవితేజ సరసన రాశి ఖన్నా, సీరత్ కపూర్ నటిస్తున్నారు. ఈ నేపథ్యంలో రవితేజ మీడియాతో ప్రత్యేకంగా ముచ్చటించారు.

విక్కీ (విక్రమ్ సిరికొండ)కి దర్శకుడిగా ఫస్ట్ సినిమా అయినప్పటికీ 'టచ్ చేసి చూడు' చిత్రాన్ని ది బెస్ట్ అనే విధంగా హ్యాండిల్ చేశాడు. తను బుజ్జితో ఎప్పటినుంచో ట్రావెల్ చేస్తున్నాడు. అందుకే ఇద్దరికీ బాగా జెల్ అయ్యింది. సినిమా చాలా బాగా వచ్చింది. హీరోయిన్స్ క్యారెక్టర్స్ కూడా బాగా డిజైన్ చేశాడు. రాశి, సీరత్ చాలా బాగా చేశారు. బాలీవుడ్‌లో ఫేమస్ మ్యూజిక్ డైరెక్టర్ ప్రీతమ్ బృందం (జామ్ 8) బ్రహ్మాండమైన ట్యూన్స్ ఇచ్చారు. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కూడా వాళ్ళే చేయాల్సి ఉన్నప్పటికీ.. వాళ్ళ బిజీ షెడ్యూల్ వల్ల డిలే అవుతుండడం వల్ల మణిశర్మతో చేయించాం. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ చేయడంలో మణిశర్మ ఎంత నిష్ణాతుడో అందరికీ తెలిసిందే. తనదైన అద్భుతమైన ఆర్.ఆర్ తో సినిమాని నెక్స్ట్ లెవెల్‌కి తీసుకువెళ్లారు. బుజ్జితో నేను నిజానికి ఎప్పుడో సినిమా చేయాలి. తను నాకు అంత మంచి ఫ్రెండ్. కానీ రకరకాల కారణాల వల్ల ఇప్పటికి కుదిరింది. ఇందులో నేను చేసిన పోలీస్ ఆఫీసర్ క్యారక్టర్ కొంచెం డిఫరెంట్‌గా ఉంటుంది. బుజ్జి బ్యానర్ వచ్చిన 'రేసుగుర్రం'లా 'టచ్ చేసి చూడు'లో నా క్యారక్టర్ రంకెలు వేస్తూ.. ఎంటర్‌టైన్ చేస్తుంది.

అయితే 'టచ్ చేసి చూడు' కథ మరీ కొత్తగా ఏమీ ఉండదు. ఫక్తు కమర్షియల్ ఫార్ములాను ఫాలో అవుతూనే ఆద్యంతం ఎంటర్‌టైన్ చేస్తుంది. ఆడియన్స్ కూడా సినిమాలు మరీ కొత్తగా ఉండాలని కోరుకోవడం లేదు. అలా అయితే 'నా ఆటోగ్రాఫ్, ఈ అబ్బాయి చాలా మంచోడు, శంభో శివ శంభో' వంటి సినిమాలు బాగా ఆడాలి. అయితే ఇప్పుడిప్పుడు ఆడియన్స్ టేస్ట్‌లో చేంజ్ వస్తోంది. పైన చెప్పిన సినిమాలు ఇప్పుడొస్తే ఆడతాయేమోననిపిస్తుంది. అందుకే ఇకపై కొత్త కథలకు స్వాగతం చెప్పాలని డిసైడ్ అయ్యాను. కళ్యాణ్ కృష్ణ సినిమా తర్వాత శ్రీను వైట్ల సినిమా ఉంటుంది. అలాగే మల్టీ స్టారర్స్ కూడా చేయబోతున్నాను. నాకు అందరు హీరోలతో మంచి రిలేషన్ ఉంది. కాబట్టి ఏ హీరోతో అయినా చేయడానికి నేను సిద్ధమే!!

ఒక రోజు వెనక్కి!



అఖిల్ అక్కినేని నటించిన 'హలో' చిత్రంతో పోటీ పడి ఒక రోజు ముందుగా గతేడాది డిసెంబర్ 21న 'ఎం.సి.ఏ' చిత్రాన్ని విడుదల చేసి ఘన విజయం సొంతం చేసుకున్న దిల్ రాజు.. 'తొలి ప్రేమ' చిత్రాన్ని ఒక రోజు ఆలస్యంగా ఫిబ్రవరి 10న విడుదల చేస్తున్నారు. వరుణ్ తేజ్ నటించిన 'తొలిప్రేమ' చిత్రాన్ని దిల్ రాజు అవుట్ రైట్‌గా కొనుగోలు చేసిన దిల్ రాజు.. ఈ చిత్రాన్ని సాయి ధరమ్ తేజ్ నటించిన 'ఇంటిలిజెంట్'తోపాటు ఫిబ్రవరి 9న ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేశారు. అయితే చివరి నిమిషంలో ఒక రోజు ఆలశ్యంగా ఫిబ్రవరి 10న రిలీజ్ అవుతోంది!

చూస్తూ.. చూస్తూ..

వీరభద్ర క్రియేషన్స్ పతాకంపై నూతన నటీనటులు శ్రీకాంత్, హేమలత (బుజ్జి) హీరో హీరోయిన్స్‌గా, సుహాసిని, సుమన్, భాను చందర్ ముఖ్య పాత్రలలో వి.ఎస్. ఫణీంద్ర దర్శకత్వంలో హేమలతా రెడ్డి నిర్మిస్తున్న చిత్రం నిన్నే చూస్తూ. ఇప్పుడు రెండో షెడ్యూల్ జరుపుకుంటోంది.

ఈ సందర్భంగా నిర్మాత హేమలతా రెడ్డి మాట్లాడుతూ "మా చిత్రంలో సుహాసిని నటించటం మా అదృష్టం. మరొక ముఖ్య పాత్రలో సుమన్ నటిస్తున్నారు. మొదటి షెడ్యూల్ అవుట్ ఫుట్ చూశాక చాలా సంతోషంగా ఉంది. హైదరాబాద్, పరిసం ప్రాంతాల్లో షూటింగ్ చేస్తున్నాము. షూటింగ్ పూర్తి చేసుకొని త్వరలోనే విడుదల చేస్తాము" అని అన్నారు



ఇంకోస్సారి సారీ?



దేశవ్యాప్తంగా సినీ ప్రేమికులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న రజనీకాంత్ '2. 0' మళ్ళీ వాయిదా పడే అవకాశం ఉందని తెలుస్తోంది. శంకర్ తెరకెక్కిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. ఇప్పటికే రెండు మూడు పర్యాయాలు వాయిదా పడ్డ ఈ సినిమాను ఫైనల్‌గా ఏప్రిల్ 14న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు.

కానీ ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే సినిమా ఏప్రిల్ నెలలో రిలీజయ్యేలా లేదు. తమిళ సినీ వర్గాలు కూడా ఇదే మాటను చెబుతున్నాయి. గ్రాఫికల్ వర్క్ ఎక్కువగా ఉండటం మూలాన సినిమా కనీసం 2 నుండి 3 నెలల పాటు వాయిదాపడే అవకాశముందట. అయితే ఈ విషయమై చిత్ర నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ నుండి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇకపోతే ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. మరోవైపు పా.రంజిత్ దర్శకత్వంలో రజనీ అల్లుడు ధనుష్ నిర్మిస్తున్న 'కాలా' సినిమా కూడ చివరి దశ పనులకు చేరుకుంది.

ఛలోతో తెలుగులో హలో చెబుతున్నందుకు హ్యాపీగా వుంది

-కన్నడ కన్యక రష్మిక



తెలుగు తెరకు మరో కన్నడ భామ పరిచయమవుతోంది. ఆ భామ పేరు రష్మిక. 'ఛలో' చిత్రం ద్వారా తెలుగు తెరంగేట్రం చేస్తున్న ఈ చిన్నది అందంలో, అభినయంలోనూ మాత్రమే కాదు. చదువులోనూ టాపర్. ఇంగ్లిష్ లిటరేచర్ చదివిన ఈ బ్యూటీ సైకాలజీ చేయడంతోపాటు. జర్నలిజం కూడా చేసింది.

'ఛలో' చిత్రం విడుదల సందర్భంగా మీడియాతో ప్రత్యేకంగా ముచ్చటించింది. కన్నడకే చెందిన అనుష్క శెట్టి తన రోల్ మోడల్ అంటున్న రష్మిక చెప్పిన సంగతులు మీకోసం..

బెంగుళూరులో జరిగిన 'ఫ్రెష్ ఫేస్' అనే కాంటెస్ట్‌లో విన్నర్‌గా నిలిచిన నాకు మోడలింగ్‌లో అవకాశాలు వచ్చాయి. ఆ తర్వాత 'కిరాక్ పార్టీ'లో ఛాన్స్ వచ్చింది. ఆ సినిమా సూపర్ హిట్టవ్వడంతో వరుసగా అవకాశాలు వచ్చాయి. మంచి సినిమాతో తెలుగులో ఎంటర్ అవ్వాలనుకుంటున్న టైమ్‌లో వెంకీ కుడుముల చెప్పిన 'ఛలో' స్క్రిప్ట్ నచ్చింది. స్క్రిప్ట్ నచ్చి ఓకె చేసి, సినిమా షూటింగ్ స్టార్ట్ అయ్యాక ఒక మంచి టీమ్‌తో వర్క్ చేస్తున్నానని అర్థమయ్యింది. షూటింగ్ అంతా ఒక పిక్నిక్‌లా జరిగిపోయింది. ఒక సంప్రదాయబద్ధమైన, కట్టుబాట్ల మధ్య పెరిగిన ఒక అమ్మాయి కో ఎడ్యుకేషన్ కాలేజీలో చేరితే ఎలా ఉంటుంది అన్నది నా క్యారక్టరైజేషన్. క్యారక్టర్ కొత్తగా ఉండదు. కానీ చక్కగా ఉంటుంది. అందరూ కనెక్ట్ అవుతారు. గర్ల్ నెక్స్ట్ డోర్ లాంటి నా క్యారక్టర్‌ని అందరూ ఇష్టపడతారు. 'ఛలో' లాంటి సినిమాతో తెలుగులో పరిచయమవుతుండడం చాలా సంతోషంగా ఉంది. నాగ శౌర్య చాలా టాలెంటెడ్. అతని ఫ్యామిలీలో నన్ను కూడా కలిపేసుకున్నారు. వెంకీ కుడుముల చాలా పెద్ద డైరెక్టర్ అవుతాడు. నాకు కూడా ఒక మంచి బిగినింగ్ అవుతుంది. 'ఛలో' విడుదల కోసం నేను కూడా చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను!

చక్కని కథ, కథనాలతో చెక్కిన చిత్రం చల్తే.. చల్తే



పిట్టగోడ' ఫేమ్ విశ్వదేవ్ రాచకొండ, ప్రియాంక జైన్ జంటగా అమేజింగ్ ఆర్ట్స్ పతాకంపై శ్రీనివాసరావు పొట్లూరి, ప్రదీప్ కుమార్ కోనేరు సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం "చల్తే చల్తే". ప్రదీప్ కెకె దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ క్యూట్ లవ్ స్టోరీ టీజర్ విడుదలైంది. ఈ చిత్రాన్ని త్వరలో విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా దర్శకుడు-సంగీత దర్శకుడు ప్రదీప్ కెకె మాట్లాడుతూ.. "ఒక క్యూట్ లవ్ స్టోరీగా తెరకెక్కిన చిత్రం "చల్తే చల్తే". విశ్వదేవ్ రాచకొండకు హీరోగా మంచి గుర్తింపునిచ్చే చిత్రమిది. విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌కి మంచి ప్రశంసలు లభించాయి. టీజర్‌కి కూడా మంచి రెస్పాన్స్ వస్తుందనే నమ్మకముంది. అతి త్వరలోనే ప్రీరిలీజ్ ఈవెంట్ కూడా నిర్వహించనున్నాం. ఈ చిత్రానికి 'చల్తే.. చల్తే' వంటి టైటిల్ సూచించిన ఉత్తేజ్‌కి థాంక్స్ చెబుతున్నాం' అన్నారు. ఈ కార్యక్రమంలో సినిమా యూనిట్ సభ్యులంతా పాల్గొని.. ఇంత మంచి చిత్రంతో భాగస్వామ్యం అవకాశం లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

గరళం నింపుకున్న గ్రామం



లింకన్ మెథడ్ ప్రొడక్షన్ పతాకంపై షఫీ, శ్రావణి, యాదవ్, ప్రధాన పాత్రలో జాంబి జానర్‌లో శ్రీనివాస్ సందిరి దర్శకత్వంలో భోగారి లక్ష్మీనారాయణ, పాతూరి బుచ్చిరెడ్డి, భోగారి రాజు, పాతూరి మాధవరెడ్డి సంయుక్తంగా నిర్మిస్తోన్న చిత్రం 'విషపురం'లో ఒకరోజు. ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ప్రసాద్ ల్యాబ్స్‌లో తమ్మారెడ్డి భరద్వాజ చేతులమీదుగా జరిగింది. ఈ సందర్భంగా తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ 'ట్రైలర్ చూస్తుంటే ఇంట్రస్టింగ్‌గా, చాలా భయపెట్టే విధంగా ఉంది. ఓ కొత్త ప్రయత్నం చేస్తోన్న ఈ టీమ్ అందరికీ నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నా' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'లోకల్ ఆర్టిస్టలను తీసుకుని ఈ సినిమా చేశాం. షఫీ పాత్ర సినిమాకు కీలకంగా ఉంటుంది. కెమెరా వర్క్, నేపథ్య సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి' అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'మాకు సినిమా రంగం చాలా కొత్త. మా దర్శకుడు చెప్పిన కథ నచ్చడంతో నూతన నటీనటులను ప్రోత్సహిస్తూ 'విషపురం' చిత్రాన్ని నిర్మించాం. దర్శకుడు ఈ సినిమా కోసం అన్నీ తానై శ్రమించాడు' అన్నారు.

షఫీ, శ్రావణి, యాదవ్, రాజు గౌటి, మల్లేష్ యాదవ్, దేవా, రాము తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతంః శ్రీ వెంకట్, కెమెరాః కిషన్ తిప్పరవేణి, ఆర్ట్ః శ్రీధర్ సందిరిబీ నేపథ్య సంగీతంః రోహిత్ జిల్లాబీ డైలాగ్స్ః మహేష్ యల్‌బీ కో-ప్రొడ్యూసర్స్ః రమేష్ బండి, బి.వెంకటేశంబీ.

మంకీ బీజ్ కిడ్స్ క్యాలెండర్ రిలీజ్



మంకీ బీజ్ మణి, వండర్ కిడ్స్ 2వ ఎడిషన్ క్యాలెండర్ మా అధ్యక్షుడు శివాజీ రాజా, టాలీవుడ్ దర్శకుడు వి.ఎన్. ఆదిత్య, నటి సిమ్రాన్ చౌదరిల చేతుల మీదుగా విడుదల చేయించారు. శివాజీ రాజా మాట్లాడుతూ 'ఈ క్యాలెండర్ మేకింగ్ వీడియోలో కిడ్స్ పోటీపడి నటించారు వీరికి సినిమా అవకాశాలు కల్పించాలనుకునే వారు నన్ను సంప్రదించండి' అన్నారు.

జైపూర్ స్వచ్ఛ్ సర్వేక్షణ్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఆటో డ్రైవర్!



జైపూర్: దేశంలో ఉన్న వివిధ రాష్ట్రాలు స్వచ్ఛ్ సర్వేక్షణ్ బ్రాండ్ అంబాసిడర్‌గా తమ పరిధిలో ఉన్న సెలెబ్రిటీలను ఎంపిక చేస్తుంటారు. వారు ఒకసారి రోడ్లు ఊడ్చి ఫొటోలకు పోజులిచ్చి తర్వాత తమ కర్తవ్యాన్ని మరిచిపోతుంటారు. కానీ జైపూర్ మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ అశోక్ లాహోటి మాత్రం మరోలా ఆలోచించారు. జైపూర్ స్వచ్ఛ్ సర్వేక్షణ్ కార్యక్రమానికి ఓ ఆటో డ్రైవర్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించారు. గత ఏడేళ్లుగా స్కూల్ పిల్లలను ఆటోలో తీసుకెళ్తున్న ఆటో డ్రైవర్ దీపక్ పరిశుభ్రత గురించి తన వంతు ప్రచారం చేస్తున్నాడు. ఆటోలో వెళ్తున్నప్పుడు పిల్లలు.. తాము తిన్న చాక్లెట్ కవర్లను ఇతర వస్తువులను రోడ్డుపై పడేయడం తనకు నచ్చలేదు. దీని వల్ల నగరం అపరిశుభ్రంగా మారుతుందనే భావన ఏర్పడింది. దీంతో తన ఆటోలోనే ఒక చెత్త డబ్బాను ఏర్పాటు చేసి.. చెత్తను అందులో వేయమని పిల్లలకు సూచించడం వంటి గొప్ప పనులు ఆయన చేశారు. అంతేకాకుండా తన ఆటోలో ఎక్కే సైనికులు, గర్భిణులు, పారిశుద్ధ్య కార్మికులకు 10 శాతం డిస్కౌంట్ ఇస్తుంటాడు. ఇటీవలే మేయర్ అశోక్ లాహోటి నివాసముండే ప్రాంతానికి ఆటోలో ఒక వ్యక్తిని తీసుకెళ్లిన దీపక్, అక్కడ మేయర్ని కలిసి తాను చేస్తున్న పని గురించి చెప్పడంతో ఆయన బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రకటించారని దీపక్ తెలిపాడు. అందుకు తనకు గర్వంగా ఉందని, పరిశుభ్రత గురించి తన ప్రచారాన్ని మరింత విస్తరిస్తానని పేర్కొన్నాడు.

యుద్ధ విమానాల మధ్య తప్పిన పెను ప్రమాదం

- నల్ల సముద్రంపై అంతర్జాతీయ ఎయిర్ స్పేస్‌లో ఘటన
- ఐదు అడుగుల దూరంలో ప్రయాణించిన విమానాలు
- జాతీయ రహదారిపై ల్యాండ్ అయిన విమానం
- ఇంజిన్ ఫెయిల్ అవడంతో చాకచక్యంగా ల్యాండ్ చేసిన పైలట్
- అమెరికాలోని కాలిఫోర్నియాలో ఘటన
- కలవరం రేపుతున్న కిమ్ దేశపు అణ్వాయుధ సామర్థ్యం
- కొరియా ముప్పుపై సీఐఏ ప్రత్యామ్నాయాల అన్వేషణ



న్యూయార్క్: గాల్లో ఎగురుతున్న అమెరికా, రష్యా యుద్ధ విమానాల మధ్య పెను ప్రమాదం తప్పింది. ఈ రెండు విమానాలు ఒకే మార్గంలో ప్రయాణించడం... అది కూడా దాదాపు 2 గంటల 40 నిమిషాల పాటు కొనసాగడం పెను ప్రకంపనలు పుట్టిస్తోంది. ఈ ఘటనపై అమెరికా సీరియస్ అయింది. ఇది చాలా ప్రమాదకరమైన చర్య అని... తమ విమానాన్ని రష్యా యుద్ధ విమానం దాదాపు ఢీకొట్టినంత పని చేసిందని పెంటగాన్ అధికారులు మండిపడ్డారు. ఘటన వివరాల్లోకి వెళ్తే, యూఎస్ కు చెందిన ఈపీ-3 అనే గూఢచర్య విమానం ఒకటి ఇంటర్నేషనల్ ఎయిర్ స్పేస్ నిఘా విధుల్లో భాగంగా ఎగురుతుండగా... సరిగ్గా అదే సమయంలో, అదే మార్గంలోకి రష్యాకు చెందిన సుఖోయ్-27 యుద్ధ విమానం కూడా వచ్చింది. అమెరికా విమానానికి కేవలం ఐదు అడుగుల దూరంలో ఇది కూడా ప్రయాణించింది. ఈ క్రమంలో రెండు విమానాలు దాదాపు రాసుకుపోయేంత పనైంది. నల్ల సముద్రంపై ఎగురుతుండగా ఈ ఘటన సంభవించింది. గత కొన్ని రోజులుగా నల్ల సముద్రంపై ఇలాంటి ఘటనలే జరుగుతుండటం గమనార్హం. ఈ నేపథ్యంలో పెంటగాన్ అధికారులు మాట్లాడుతూ, ఇది క్షేమదాయకమైన పని కాదు అంటూ వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ ఒప్పందాలకు అనుకూలంగా మాత్రమే రష్యా నడుచుకోవాలని... ఒప్పందాలను ఉల్లంఘించడం మంచిది కాదని చెప్పారు. అంతర్జాతీయ ఎయిర్ స్పేస్‌లో తన పరిధి మేరకు మాత్రమే రష్యా వ్యవహరించాలని సూచించారు. అమెరికాలోని కాలిఫోర్నియాలో ఓ విమానం వాహనాల మధ్యకు వచ్చి హైవేపై ల్యాండ్ అయింది. దీంతో స్థానికులంతా ఆశ్చర్యపోయారు. ఇంజిన్ ఫెయిల్ అవడంతో ఇద్దరు ప్రయాణికులతో వెళుతున్న ఓ చిన్న విమానాన్ని పైలట్ చాకచక్యంగా రహదారిపై ల్యాండ్ చేశాడని అక్కడి అధికారులు ఈ ఘటనపై వివరణ ఇచ్చారు. ఆ విమానం శాండియాగో నుంచి వ్యాన్నూన్‌కు వెళుతోందని, ఇంజన్ ఫెయిల్ కావడంతో కోస్టా మెసాలోని 55 ఫ్రీవే హైవేపై ల్యాండ్ చేశాడని తెలిపారు. అత్యవసర పరిస్థితి ఏర్పడడంతో తాను హైవేపై విమానాన్ని దించుతున్నట్లు పైలట్ ఎయిర్‌ట్రాఫిక్ కంట్రోల్కు ముందే సమాచారం అందించాడని అధికారులు చెప్పారు. సదరు జాతీయరహదారిపై ట్రాఫిక్ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదని తెలిపారు. ఉత్తర కొరియా అణ్వాయుధ క్షిపణి సామర్థ్యం అమెరికాను ఆందోళన పరుస్తోంది. కొన్ని నెల్లలోనే అమెరికాపై దాడి చేయగల అణ్వాయుధ క్షిపణి సామర్థ్యం ఉత్తర కొరియా సొంతంకాబోతుండటంతో తీవ్ర కలవరం రేపుతోందని ఆ దేశ కేంద్ర నిఘా ఏజెన్సీ (సీఐఏ) డైరెక్టర్ మైక్ పాంపియో తెలిపారు. సీఏఐ డైరెక్టర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ఆయన తాజాగా బీబీసీతో మాట్లాడారు. ఉ. కొరియా నుంచి, ముఖ్యంగా కిమ్ జాంగ్ ఉన్ నుంచి పొంచి ఉన్న ముప్పు గురించి తాము నిరంతరం చర్చిస్తూనే ఉన్నామని ఆయన తెలిపారు. కొన్ని నెలల్లోనే అమెరికాను ఢీకొట్టే అణ్వాయుధ క్షిపణి సామర్థ్యం కొరియా సొంతం కాబోతున్న అంశంపై ప్రధానంగా తమ మంతనాలు సాగుతున్నాయని, ఈ విషయంలో అమెరికా అధ్యక్షుడికి కొన్ని ప్రత్యామ్నాయాలు సూచించే కర్తవ్యం తమపై ఉందని, దౌత్యేతర మార్గాల్లో ఈ ప్రత్యామాయాలు ఉంటాయని ఆయన తెలిపారు. ఉత్తర కొరియాపై బలప్రయోగం వల్ల ఈ ప్రాంతంలో పెద్దస్థాయిలో ప్రాణనష్టం జరిగే అవకాశముందన్న విషయాన్ని తాము గుర్తించామని చెప్పారు. ఈ ప్రాంతంలో అమెరికాకు మిత్రపక్షాలైన దక్షిణ కొరియా, జపాన్ ఉండటంతో బలప్రయోగంతో ఇక్కడ తలెత్తబోయే పరిణామాలను తమ దృష్టిలో ఉన్నాయని, కిమ్‌ను తొలగించడం లేదా అమెరికాపై దాడి చేయగల అణ్వాయుధ సామర్థ్యాన్ని పరిమితం చేయడం వంటివాటిపై దృష్టి పెట్టినట్టు తెలిపారు. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష పదవి చేపట్టగానే.. ఉ.కొరియా అధినేత కిమ్‌తో మాటల యుద్ధానికి దిగిన సంగతి తెలిసిందే. తన అణ్వాయుధ ఆశయాలను కిమ్ పరిమితం చేసుకోకపోతే పెను పరిణామాలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పేద ముఖ్యమంత్రి నిరుపేద అయ్యారు

త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్



న్యూఢిల్లీ: త్రిపుర రాష్ట్ర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ (69) దేశంలో అత్యంత నిరుపేద ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. సోమవారం శాసనసభ ఎన్నికలకు నామినేషన్ దాఖలు చేసిన ఆయన రూ. 1,520/-లను తన ప్రస్తుత ఆస్తిగా చూపారు. ఈ నెల 20వ తేదీ నాటికి ఆయన బ్యాంకు ఖాతాలో రూ. 2,410లు ఉన్నాయి. 2013లో ఎన్నికల సమయంలో ఆయన బ్యాంకు ఖాతాలో రూ. 9,720/-లు మాత్రమే ఉన్నాయి. 1998 నుంచి త్రిపుర ముఖ్యమంత్రిగా సర్కార్ వరుసగా ఎన్నికవుతూ వస్తున్నారు. ఈ ఎన్నికల్లో ధన్‌పూర్ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగుతున్నారాయన. ముఖ్యమంత్రిగా పనిచేస్తున్నందుకు సర్కార్‌కు వచ్చే వేతనం రూ. 26,315/-. ఈ మొత్తాన్ని అంతటిని పార్టీ నిధికి డొనేట్ చేస్తారు. ఇలా చేసినందుకు ఆయనకు నెలకు రూ. 9,700/-లను పార్టీ అలవెన్సుగా ఇస్తుంది. అఫడవిట్‌లో తన పేరిటలో 0.0018 ఎకరాల వ్యవసాయేతర భూమి అగర్తలాలో ఉన్నట్లు సర్కార్ వెల్లడించారు. సర్కార్ మొబైల్ ఫోన్‌ను వినియోగించరు. ఆయనకు ఈ-మెయిల్ అకౌంట్ కూడా లేదు. సర్కార్ భార్య తరచూ అగర్తలాలోని రిక్షాల్లో ప్రయాణిస్తూ కనిపిస్తారు.

ఇంగ్లిష్ పాటతో మోడీకి పంచ్ విసిరిన రాహుల్

ఆర్థిక సర్వేను ఉద్దేశించి రాహుల్ ట్వీట్



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో 2017-18 ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టిన తర్వాత దాన్ని ఉద్దేశిస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చేసిన ట్వీట్ అందరినీ ఆకర్షిస్తోంది. ఓ ఇంగ్లిష్ పాటతో మోడీ ప్రభుత్వ పాలనను ఆయన వర్ణించిన విధానం బాగుందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. అచ్చే దిన్ (మంచి రోజులు) వచ్చేశాయి.. కానీ కొన్ని చిన్నచిన్న లోపాలు మాత్రం ఉన్నాయంటూ.. పారిశ్రామిక వృద్ధి, వ్యవసాయ వృద్ధి, జీడీపీ వృద్ధి అన్నీ తిరోగమనంలో ఉన్నాయని రాహుల్ ట్వీట్లో పేర్కొన్నారు. అంతేకాకుండా ఈ సమస్యల గురించి పట్టించుకోకుండా ఆనందం కొనసాగాలి అనే ఉద్దేశంతో 'డోన్ట్ వర్రీ.. బీ హ్యాపీ' అనే ఇంగ్లిష్ పాటను పోస్ట్ చేశారు. ప్రముఖ అమెరికన్ పాప్ సింగర్ బాబీ మెక్ఫెరిన్ పాడిన ఈ పాటను ట్వీట్ చేసి.. తనదైన శైలిలో రాహుల్ పంచ్ వేశారు. గతంలో 'మన్ కీ బాత్' సలహాల గురించి కూడా రాహుల్ ఫన్నీ ట్వీట్ చేసిన సంగతి తెలిసిందే.

దీపికా పదుకునే 'క్వీన్ ఆఫ్ బాలీవుడ్'

- రూ. 100 కోట్ల క్లబ్లో అత్యధిక సినిమాలు ఈమెవే!
- ఇక అలాంటి సినిమా జీవితంలో చేయను
- సంచలన నిర్ణయం తీసుకున్న దీపికా పదుకొనే
- తండ్రి విజయాలు చూసి కంటతడి పెట్టుకున్న దీపికా పదుకునే!
- ప్రకాశ్ పదుకునేకు జీవిత సాఫల్య పురస్కారం

ముంబై:దీపికా పదుకునే నటించిన 'పద్మావత్' చిత్రం మొదటి నాలుగు రోజుల్లోనే రూ. 100 కోట్ల క్లబ్లో చేరిన సంగతి తెలిసిందే. దీంతో దీపికా పేరు మీద ఓ సరికొత్త రికార్డు నమోదైంది. కలెక్షన్ల విషయంలో క్వీన్ ఆఫ్ బాలీవుడ్‌గా దీపికా పదుకునే నిలిచింది. 'పద్మావత్'తో కలిపి రూ. 100 కోట్ల క్లబ్లో దీపికా పదుకునే నటించిన ఏడు సినిమాలు ఉన్నాయి. బాలీవుడ్లో మరే హీరోయిన్కి ఈ రికార్డు లేదు. దీపికా పదుకునే నటించిన 'చెన్నై ఎక్స్‌ప్రెస్', 'హ్యాపీ న్యూ ఇయర్', 'యే జవానీ హై దివానీ', 'బాజీరావ్ మస్తానీ', 'రామ్ లీలా', 'రేస్ 2' చిత్రాలు రూ. 100 కోట్ల క్లబ్లో ఉన్నాయి. ఈ వివరాలన్నింటినీ బాలీవుడ్ ట్రేడ్ అనలిస్ట్ తరణ్ ఆదర్శ్ ఓ ట్వీట్ ద్వారా వెల్లడించారు. ఎవరూ తిరగరాయలేని రికార్డు దీపికా పదుకునే సృష్టించిందని ఆయన కొనియాడారు. కన్నడలో 'ఐశ్వర్య (2006)' సినిమాతో తెరంగేట్రం చేసిన దీపికా, 2007లో షారుక్ సరసన 'ఓం శాంతి ఓం' సినిమాతో బాలీవుడ్లో అడుగుపెట్టింది. గతేడాది 'ట్రిపుల్ ఎక్స్' సినిమాతో దీపికా హాలీవుడ్ రంగప్రవేశం కూడా చేసింది. ఇక హీరోల్లో అత్యధిక వంద కోట్ల క్లబ్ చిత్రాలు ఉన్న నటుడిగా సల్మాన్ ఖాన్ నిలిచిన సంగతి తెలిసిందే. తాను ఇటీవల నటించిన 'పద్మావత్' చిత్రం ఆదినుంచి వివాదాల్లోనే నడుస్తూ రావడం, వివిధ వర్గాల నుంచి తనకు ఎదురైన బెదిరింపులు తదితరాలతో ఆందోళన చెందిన బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొనే, ఇకపై 'పద్మావత్' వంటి చిత్రాలను జీవితంలో చేయబోనని తెగేసి చెప్పింది. ఇటీవల ఆమె ఓ ఈవెంట్ కు హాజరుకాగా, సన్నిహితుల వద్ద పరిస్థితి వివరించి వాపోయిన ఆమె, ఇక ఎప్పటికీ ఈ తరహా చిత్రాలను చేయలేనని వెల్లడించిందట. తన తల్లి, తండ్రి ఈ చిత్రాన్ని చూసి తనను అభినందించారని చెప్పిన దీపిక, చిత్రంలో ఖిల్జీ, రావల్ మధ్య జరిగే పోరాట దృశ్యం తనకు ఎంతో ఇష్టమైన సీన్ అని వెల్లడించింది. కాగా, గత వారంలో వెండితెరపై విడుదలైన 'పద్మావత్' నిదానంగా కలెక్షన్లను పెంచుకుంటూ వెళుతోంది. బ్యాడ్మింటన్ ఆటలో విజయాలు సాధించి దేశఖ్యాతిని పెంచినందుకుగాను ప్రకాశ్ పదుకునేకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రకటించింది. రాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి పదుకునే కుటుంబం హాజరైంది. అక్కడ తండ్రి అవార్డు అందుకునేటవుడు కుమార్తె దీపికా పదుకునే కళ్లలో నీళ్లు తిరిగాయి. ఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమానికి దీపికా తల్లి ఉజ్జల, సోదరి అనిశా, బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు హాజరయ్యారు. ఈ వేడుకలో దీపికా వస్త్రధారణ అందరి ప్రశంసలు అందుకుంటోంది. దీపికా కట్టుకోవడం వల్ల సబ్యసాచి డిజైన్ చేసిన ఈ చీరకు కొత్త అందం వచ్చిందని అందరూ అంటున్నారు.



ఆహ్వానపత్రికలో అక్షర దోషాలు

వైట్ హౌస్‌పై జోకులు!

గతంలో తప్పుడు స్పెల్లింగ్ తో ట్వీట్ చేసి నవ్వుల పాలైన ట్రంప్



న్యూయార్క్: అమెరికా అధ్యక్షభవనం వైట్ హౌస్ నవ్వులపాలైంది. దీంతో సోషల్ మీడియాలో నెటిజన్లు ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, అధ్యక్ష భవనం వైట్ హౌస్ దొందూ దొందేనంటూ ఎద్దేవా చేస్తున్నారు. దాని వివరాల్లోకి వెళ్తే 115వ కాంగ్రెస్ సమావేశాల్లో భాగంగా స్టేట్ యూనియన్ సభ్యులను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగించాల్సి ఉంది. ఈ కార్యక్రమానికి వైట్ హౌస్ పలువురికి ఆహ్వానం పంపింది. ఈ ఆహ్వానపత్రికలో యూనియన్ బదులు యూనివోమ్ అని పడింది. అంతే.. వైట్ హౌస్ ను నెటిజన్లు ఆడుకోవడం మొదలుపెట్టారు. అధ్యక్షుడు చేసే ట్వీట్లలోనే స్పెల్లింగ్ మిస్టేక్స్ ఉన్నప్పుడు... అధికారుల ఆహ్వానపత్రంలో లేకుంటే ఎలా? అంటూ గేలి చేస్తున్నారు. కాగా, దీనిపై స్పందించిన వైట్ హౌస్ వివరణ ఇస్తూ, ముద్రణ తమ చేతుల్లో లేదని, జరిగిన తప్పును సరిదిద్ది కొత్త ఇన్విటేషన్స్ పంపామని చెబుతున్నారు.

జమ్ముకశ్మీర్ సీఎంపై సుబ్రహ్మణ్యస్వామి ఫైర్

- ప్రభుత్వాన్ని రద్దు చేయాలంటూ డిమాండ్
- సైన్యంపై కేసు నమోదు చేసిన జమ్ముకశ్మీర్ పోలీసులు
- మెహబూబా ప్రభుత్వాన్ని రద్దు చేయాలన్న స్వామి
- సైన్యంపైనే కేసు పెడతారా అంటూ ఆగ్రహం



న్యూఢిల్లీ: జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీపై బీజేపీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి మండిపడ్డారు. భారత సైన్యంపైనే కేసు నమోదు చేస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సైన్యం పైనే కేసు పెట్టేలా ఆమె తీసుకున్న నిర్ణయం అర్థంపర్థం లేనిదని విమర్శించారు. ఈ అంశంలో కేంద్ర ప్రభుత్వం వెంటనే కలగజేసుకోవాలని... విచక్షణాధికారాలను ఉపయోగించి, వెంటనే ఆమె ప్రభుత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు మెహబూబా నిర్ణయాన్ని నిరసిస్తూ రాష్ట్ర కేబినెట్ నుంచి బయటకు రావడానికి బీజేపీ నేతలు సిద్ధం కావడం కలకలం రేపుతోంది. దక్షిణ కశ్మీర్ లోని షోపియాన్ జిల్లాలోని గోవాంపురా ప్రాంతంలో శనివారం నాడు సైనిక వాహన శ్రేణిపై దాదాపు 250 మంది నిరసనకారులు రాళ్లు రువ్వారు. అంతేకాదు, ఓ అధికారి నుంచి ఆయుధం లాక్కునేందుకు యత్నించారు. దీంతో, వారిపై సైనికులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఇద్దరు నిరసనకారులు చనిపోగా, మరో ఎనిమిది మంది గాయపడ్డారు. ఈ నేపథ్యంలో, కశ్మీర్ లోయలో పరిస్థితి వేడెక్కింది. వేర్పాటువాదులు ఒకరోజు బంద్‌కు పిలుపునిచ్చారు. మరోవైపు, కాల్పులు జరిపిన సైన్యంపై జమ్ముకశ్మీర్ పోలీసులు కేసు నమోదు చేశారు. గర్వాల్-10 బెటాలియన్ పై హత్య, హత్యాయత్నం కేసును నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు, ఘటనపై పూర్తి నివేదిక సమర్పించాలంటూ సైన్యాన్ని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదేశించారు.


వారేమైనా పాకిస్థానీలా ఎందుకీ మతపిచ్చి?

- వివాదం రేపిన కలెక్టర్ ఫేస్ బుక్ పోస్టు
- ఘర్షణలు చెలరేగినప్పుడల్లా ముస్లింల ఇళ్ల ముందుకు వెళ్లి పాక్
- వ్యతిరేక నినాదాలు చేస్తున్నారు
- వారు కూడా భారతీయులే కదా? అలా ఎందుకు చేస్తున్నారు?
- ఇంత మత పిచ్చి ఎందుకు? ఇది దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తుంది



లక్నో: లక్నోలోని కాస్ గంజ్ మత ఘర్షణలపై బరేలీ కలెక్టర్ తన ఫేస్ బుక్ ఖాతాలో చేసిన పోస్టు ఒకటి పెను ప్రకంపనలకు కారణమైంది. కాస్ గంజ్ లో గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా విద్యార్థి సంఘాలు బద్దూ నగర్‌లో తిరంగ ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంగా విద్యార్థులు పాకిస్థాన్ వ్యతిరేక నినాదాలు చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగి, హింసాత్మకంగా మారింది. ఈ ఘటనలో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోగా, పదుల సంఖ్యలో యువకులు గాయపడ్డారు. దీంతో అక్కడ అల్లర్లు చెలరేగడంతో, కర్ఫ్యూ విధించి, భద్రతా బలగాలను రంగంలోకి దింపారు. 80 మందిని అదుపులోకి తీసుకుని పరిస్థితి చక్కదిద్దారు. దీనిపై కలెక్టర్ ఆర్. విక్రమ్ సింగ్ తన అభిప్రాయం వ్యక్తం చేస్తూ ఈ మధ్యకాలంలో ఒక కొత్త సంప్రదాయం పుట్టుకొచ్చింది. ఘర్షణలు చెలరేగినప్పుడల్లా కొందరు చేసే పనులు విచిత్రంగా ఉంటాయి. మాట్లాడితే ముస్లింల ఇళ్ల ముందుకు వెళ్లి పాక్ వ్యతిరేక నినాదాలు చేస్తున్నారు. ఇదంతా ఎందుకు? వారేమైనా పాకిస్థాన్ వాసులా? కాదు కదా, భారతీయులే కదా? అంటూ ఫేస్ బుక్ లో సుదీర్ఘమైన పోస్టు పెట్టారు. పనిలో పనిగా గతేడాది బరేలీలో జరిగిన ఘర్షణల ప్రస్తావన చేస్తూ, అప్పట్లో కొందరు కన్వరియాలు (శైవ భక్తులు) ముస్లింలు అధికంగా ఉండే ప్రాంతంలోకి వెళ్లి, పాక్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆ ప్రాంతంలోనే నా నివాసం కూడా ఉంది. బయటికొచ్చిన నేను వారిని అలా చేయొద్దని వారించాను. కానీ, వారు నా మాట వినలేదు. ఇంత మత పిచ్చి వాళ్లకు ఎందుకు? ఇది దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తుంది' అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తీవ్ర దుమారం చెలరేగింది. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉంటూ మతపరమైన వ్యాఖ్యలు చేయడమేంటని, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు మండిపడుతున్నారు.

షారుఖ్ ఖాన్‌కు ఆదాయపు పన్నుశాఖ షాక్



ముంబై: బాలీవుడ్ బాద్షా, సీనియర్ హీరో షారుఖ్ ఖాన్‌కు ఆదాయపన్ను శాఖ షాక్ ఇచ్చింది. షారుఖ్ బినామీ ఆస్తికి సంబంధించిన ఆధారాల్ని సేకరించిన ఐటీ శాఖ కొరడా ఝుళిపించేందుకు సిద్ధమవుతోంది. ఇటీవల ఇచ్చిన ఐటీ నోటీసులకు స్పందించకపోవడంతో షారూఖ్‌కు చెందిన విలాసవంతమైన ఫాం హౌస్‌ను తాత్కాలికంగా ఎటాచ్ చేసింది. ఈ మేరకు బినామి ఆస్తి లావాదేవీల చట్టం (పిబిపిటి) కింద అటాచ్‌మెంట్ నోటీసు జారీ చేయనుందని బిజినెస్ స్టాండర్డ్ రిపోర్ట్ చేసింది. ఈ పరిణామాన్ని ధృవీకరించిన ఐటీ శాఖ సీనియర్ సెక్షన్ 24 ప్రకారం బినామీదారుడు దర్యాప్తు సంస్థ గుర్తిస్తే ఆ వ్యక్తికి లేదా ప్రయోజనకరమైన యజమానికి అటాచ్‌మెంట్ నోటీసును జారీ చేయవచ్చని తెలిపారు. ఆస్తి అటాచ్‌మెంట్ నోటీసు జారీ చేసిన 90 రోజుల తరువాత తరువాత సదరు ఆస్తిని స్వాధీనం చేసుకునే అవకాశం ఉందని చట్టం పేర్కొందన్నారు. దీనికి సంబంధించి డిసెంబర్‌లోనే నోటీసులు జారీ చేసినట్టు చెప్పారు. 19,960 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ ఆస్తి విలువ (సర్కిల్‌రేటు) సుమారు.రూ. 146.7 మిలియన్లు(15 కోట్లు) అయితే మార్కెట్ ధర దీనికి ఐదు రెట్లు పెరగనుందని మరో ఐటి అధికారి చెప్పారు. ఇందులో ఒక బీచ్, స్విమ్మింగ్‌పూల్ తోపాటు, ఒక ప్రైవేట్ హెలిప్యాడ్ లాంటి సౌకర్యాలను ఈఫాం హౌస్‌లో ఉన్నాయట. కింగ్ ఖాన్ నేరం రుజువైతే ఆరు నెలలనుంచి ఏడేళ్ల దాకా శిక్ష, ఆస్తిలో 10 శాతం మేర జరిమానా విధించే అవకాశం ఉందని తెలుస్తోంది.

అలా చేస్తే అమ్మాయిలే అత్యాచారాన్ని కోరుకున్నట్టు!

- రాయ్‌పూర్ సెంట్రల్ వర్శిటీ లేడీ ప్రొఫెసర్ వికృత బోధన!
- విద్యార్థినీ విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చిన లేడీ ప్రొఫెసర్
- పొట్టి దుస్తులు ధరించినా, అవయవాలు చూపినా రేప్‌కు ఆహ్వానం పంపినట్టే
- తప్పు అమ్మాయిలదేగానీ, అబ్బాయిలది కాదు
- ప్రొఫెసర్ వ్యాఖ్యలపై కేసు

రాయ్ పూర్: రాయ్‌పూర్ సెంట్రల్ యూనివర్శిటీలో బయాలజీ బోధించే ప్రొఫెసర్ ఒకరు అమ్మాయిల గురించి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ఇప్పుడు కలకలం రేపుతున్నాయి. ఇక్కడ బోధించే స్నేహలతా శంఖ్వార్ అనే మహిళా టీచర్, విద్యార్థినీ, విద్యార్థులకు కౌన్సెలింగ్ సెషన్ నిర్వహిస్తూ, అమ్మాయిలు జీన్స్ వేసుకుని, లిప్ స్టిక్ పెట్టుకుంటే నిర్భయ వంటి ఘటనలు చోటు చేసుకుంటాయని హెచ్చరించారు. అందాన్ని చూపించేలా దుస్తులు ధరిస్తే, అత్యాచారం చేయమని ఆహ్వానం పలికినట్టేనని అన్నారు. పొట్టి దుస్తులు వేసుకున్నా, ఇష్టం వచ్చినట్టు బయట తిరిగినా నిర్భయకు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. అమ్మాయిలు మరీ సిగ్గు లేకుండా తయారవుతున్నారని అభిప్రాయపడ్డ ఆమె, నిర్భయ అసలు ఓ అబ్బాయితో అంత రాత్రివేళ ఎందుకు బయటకు వెళ్లిందని, ఇటువంటి పనులు ఎందుకు చేస్తారని ప్రశ్నించారు. తన ఉద్దేశంలో తప్పు నిర్భయే చేసిందని, అర్ధరాత్రి బయట తిరిగే అమ్మాయిల తప్పుంటుందే తప్ప అబ్బాయిల తప్పు కాదని వ్యాఖ్యానించారు. అత్యాచారాలు అమ్మాయిలు చేసే పాపాలకు శిక్షని, తన శరీరాన్ని బయటకు చూపించే అమ్మాయిని ఎలాగైనా సొంతం చేసుకోవాలనే అబ్బాయి భావిస్తాడని అన్నారు. అందమైన ముఖాలు లేని అమ్మాయిలు తమ శరీరాన్ని బయటకు చూపించవచ్చని ముక్తాయింపు ఇచ్చారు స్నేహలత. ఇక ఆమె వ్యాఖ్యలపై విద్యార్థినుల తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

తిండి పెట్టండి లేదా చంపేయండి

- యూపీ మహిళ వినూత్న నిరసనతో తలపట్టుకున్న అధికారులు!
- యూపీలో నిరుపేద మహిళకు రేషన్ కార్డు ఇచ్చేందుకు లంచం
- లంచం తీసుకుని కూడా కార్డు ఇవ్వని అధికారులు
- మరోసారి లంచం అడిగేసరికి నిరసనకు దిగిన మహిళ

లక్నో: ఉత్తరప్రదేశ్ కు చెందిన ఓ పేద మహిళ తనకు అన్నం పెట్టాలని, లేకుంటే చంపేయాలని అధికారుల ముందు వినూత్న నిరసనకు దిగడం కలకలం రేపింది. ఝాన్సీ ప్రాంతానికి చెందిన నర్గిస్ అనే మహిళ, కలెక్టర్ కార్యాలయానికి వచ్చి 'రోటీ దో యా ఫిర్ మౌత్ దో' (తిండి పెట్టండి లేకుంటే చంపేయండి) అన్న ప్లకార్డును పట్టుకుంది. రోజువారీ కూలీగా పని చేస్తున్న ఆమె, చౌక ధరల దుకాణం నుంచి రేషన్ కోసం కార్డును పొందడానికి రూ. 4 వేలు కట్టింది. వాస్తవానికి ఈ కార్డులు ఉచితంగా ఇస్తారు. ఇక అంత డబ్బు కట్టిన తరువాత కూడా రేషన్ ఆమెకు ఇవ్వడం లేదు. ఆమె కార్డు కాలదోషం పట్టిందన్న సమాధానం వచ్చింది. మళ్లీ కార్డు ఇవ్వాలంటే మరో 4 వేలు సమర్పించుకోవాల్సిందేనని ఆమెకు స్పష్టం చేస్తుండటంతో, అంత డబ్బు తన వద్ద లేదని, విడతల వారీగా ఇస్తానని ఆమె మొరపెట్టుకున్నా అధికారులు వినలేదు. దీంతో తినేందుకు తిండి లేక ఇక తనకు మరణమే శరణ్యమంటూ ఇలా నిరసనకు దిగింది. తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని, వారి పోషణ తనకు కష్టంగా మారిందని కూడా నర్గిస్ వాపోయింది. కనీసం తనను కలెక్టర్‌ను కలిసేందుకు కూడా అనుమతించలేదని చెప్పుకొచ్చింది.

వేదికపై నృత్యం చేస్తూనే కుప్పకూలిన గీతానందన్

- 'ఒట్టాన్ థుల్లాల్'కు ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చిన గీతానందన్
- 30కిపైగా చిత్రాల్లో నటించిన కళాకారుడు
- కుప్పకూలి మృతి

తిరువనంతపురం: కేరళ శాస్త్రీయ నృత్యమైన 'ఒట్టాన్ థుల్లాల్'కు ప్రపంచ స్థాయిలో గుర్తింపు తేవడంతో పాటు సంగీత నాటక అకాడమీ అవార్డు సహా ఎన్నో అవార్డులు పొందిన కళాకారుడు, మలయాళ చిత్ర నటుడు గీతానందన్, వేదికపై నృత్యం చేస్తూ గుండెపోటుతో ప్రాణాలు వదలడంతో కేరళ కళారంగం దిగ్భ్రాంతికి గురైంది. ఇరింజలక్కుడలోని ఓ ఆలయంలో 58 ఏళ్ల గీతానందన్ ప్రదర్శన ఇస్తూ, నృత్యం చేస్తున్న వాయిద్యకారుల ముందు మోకరిల్లి, చేతులు జోడిస్తూ కుప్పకూలిపోయారు. వెంటనే ఆయన్ను ఆసుపత్రికి తరలించినా లాభం లేకపోయింది. తన చివరి క్షణం వరకూ ఒట్టాన్ థుల్లాల్ తోనే ప్రయాణిస్తానని పదే పదే చెప్పే ఆయన, చివరకు అదే నృత్యాన్ని ప్రదర్శిస్తూ కన్నుమూయడం పలువురిని కలచి వేసింది. ఆయన మలయాళంలో దాదావు 30 కిపైగా చిత్రాల్లో నటించారు. ఆయన మృతి పట్ల కేరళ సీఎం పినరయి విజయన్ సహా పలువు ప్రముఖులు, సినీ నటులు సంతాపం వెలిబుచ్చారు.

నేను బతికే ఉన్నాను: రాహుల్ ఉపాధ్యాయ్



లక్నో: ఉత్తరప్రదేశ్ కాస్‌గంజ్‌లో మతఘర్షణలు తీవ్రరూపం దాల్చడానికి ప్రధాన కారణం.. రాహుల్ ఉపాధ్యాయ్ అనే వ్యక్తి మృతి చెందాడని వదంతులు చెలరేగడమే నిజానికి రాహుల్ ఉపాధ్యాయ్ మరణించలేదు. ఆ విషయాన్ని పోలీసులు సోమవారం స్పష్టం చేశారు. మంగళవారం రాహుల్ ఉపాధ్యాయ్ స్వయంగా మీడియా ముందుకు వచ్చి.. తాను చనిపోలేదని స్పష్టత ఇచ్చాడు. కాస్‌గంజ్ అల్లర్లలో నేను చనిపోయినట్టు సోషల్ మీడియాలో వదంతులు చెలరేగుతున్నట్టు నా స్నేహితుడు ఒకరు తెలిపారు. కానీ, అల్లర్లు జరిగిన సమయంలో నేను కాస్‌గంజ్‌లో లేను. నేను ఊరికి వెళ్లాను. నేను బాగున్నాను అని రాహుల్ వివరించాడు. రాహుల్ మృతి చెందాడని వదంతులు వ్యాప్తి చేస్తూ.. మతఘర్షణలను మరింత రెచ్చగొట్టాలని చూస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్టు అలీగఢ్ రేంజ్ ఐజీ సంజీవ్ గుప్తా తెలిపారు. గణతంత్ర దినోత్సవం నాడు ఇరువర్గాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణల్లో చందన్ గుప్తాతోపాటు రాహుల్ ఉపాధ్యాయ్ కూడా చనిపోయాడని తీవ్రస్థాయిలో సోషల్ మీడియాలో రూమర్లు చక్కర్లు కొట్టాయి. రాహుల్ మృాఎతి చెందాడన్న వదంతులను నమ్మిన మూక.. గత మూడురోజులుగా హింసకు దిగుతోంది. గణతంత్ర దినోత్సవం నాడు చేపట్టిన తిరంగ యాత్ర ఉద్రిక్తతలకు దారితీసి.. ఒకరి మృతికి, ఇద్దరు గాయపడటానికి కారణమైంది.

సూర్య
హైదరాబాద్
బుధవారం
31 జనవరి 2018

సూర్య స్పోర్ట్స్

వన్డే సిరీస్‌కు ముందు సౌతాఫ్రికాకు షాక్



జోహన్నెస్‌బర్గ్ : వన్డే సిరీస్‌కు ముందు దక్షిణాఫ్రికా జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గాయం కారణంగా తొలి మూడు వన్డేలకు విధ్వంసకర బ్యాట్స్‌మన్ ఏబీ డివిలియర్స్ దూరమయ్యారు. భారత్‌తో జరిగిన మూడో టెస్టులో డివిలియర్స్ చేతి వేలికి గాయమైంది. ఈ గాయం మానడానికి మరో రెండు వారాల సమయం పట్టవచ్చునని డాక్టర్లు తేల్చడంతో దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు డివిలియర్స్‌కు విశ్రాంతినిచ్చింది. తతడివిలియర్స్ స్థానంలో మరొకరిని ఎంపిక చేయడం లేదని బోర్డు ప్రకటించింది. ఫిబ్రవరి 10న జరగబోయే పింక్ వన్డే(నాలుగో వన్డే) సమయానికి డివిలియర్స్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేసింది. భారత్, దక్షిణాఫ్రికాల మధ్య జరిగే ఆరు వన్డేల సిరీస్‌లో తొలి వన్డే ఫిబ్రవరి 1న కింగ్స్‌మీడ్ మైదానంలో జరుగనుంది.

ఫైనల్లో భారత్





- సెమీస్‌లో 69 పరుగులకే కుప్పకూలిన పాక్
- 203 పరుగుల తేడాతో భారత్ ఘనవిజయం
- అండర్ 19 ప్రపంచకప్ సెమీఫైనల్ మ్యాచ్

క్రైస్ట్ చర్చ్ (న్యూజిలాండ్) : అండర్-19 ప్రపంచకప్‌లో యువభారత్ మరోసారి అదరగొట్టింది. సెమీఫైనల్లో పాక్‌ను 203 పరుగులతో చిత్తుగా ఓడించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. 273 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన పాక్ కేవలం 69 పరుగులకే కుప్పకూలింది. ఈ టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత్... శనివారం జరగనున్న తుదిపోరులో ఆస్ట్రేలియాతో తలపడనుంది. భారత్‌పై ప్రపంచకప్ ఫైనల్‌కు చేరడం ఇది ఆరోసారి. ప్రపంచకప్‌ను చెరో మూడుసార్లు గెలుచుకుని సమవుజ్జీలుగా ఉన్న భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఫైనల్ జరగనుండటంతో తుదిపోరు మరింత ఆసక్తి కలిగించడం ఖాయం.

గిల్ జిగేల్..

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఓపెనర్లు శుభారంభం ఇచ్చారు. కెప్టెన్ పృూఎథ్వీ షా, మన్‌జోత్ కల్రాతో కలిసి తొలి వికెట్‌కు 89పరుగులు జోడించారు. ధాటిగా ఆడే క్రమంలో షా 41 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రనౌట్‌గా వెనుదిరిగాడు. 17ఓవర్‌లోనే మరో ఓపెనర్ కల్రా అర్ధశతకానికి చేరువయ్యే క్రమంలో 47 పరుగులు వద్ద పెవిలియన్‌కు చేరాడు. దీంతో భారత్ 94 పరుగులకు రెండు వికెట్లు కోల్పోయింది. వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన శుభ్‌మన్ గిల్ మొదటి నుంచి దూకుడుగా ఆడటం ప్రారంభించాడు. మ్యాచ్ మొత్తానికి అతడి ఇన్నింగ్సే హైలెట్. 108 స్ట్రైయిక్‌రేటుతో 94బంతుల్లో 102 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచాడు. ఇందులో 7 ఫోర్లు ఉన్నాయి. గిల్‌కు అండగా నిలిచిన దేశాయ్ ఇన్నింగ్స్ నిలబెట్టే ప్రయత్నం చేశాడు. కానీ జట్టు స్కోరు 148 వద్ద ఔటయ్యాడు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన రాయ్ 45 బంతుల్లో 33 పరుగులు సాధించాడు. అర్ధశతకం దిశగా అడుగులు వేస్తున్న క్రమంలో మహమ్మద్ ముసా చేతికి చిక్కాడు. 45 ఓవర్లో రాయ్ అవుట్ కావడం, తర్వాత బ్యాట్స్‌మెన్ నుంచి సరైన సహకారం లేకపోవడంతో భారత్ స్కోరు 272/9కే పరిమితం కావాల్సి వచ్చింది. గిల్ సెంచరీ సాధించినా భారత్ భారీస్కోరు సాధించే అవకాశాలు కోల్పోయింది. పాక్ బౌలర్లలో మహమ్మద్ ముసా 4వికెట్లు, అర్షద్ ఇక్బాల్ 3వికెట్లు తీసి భారత్‌ను కట్టడి చేశారు.

పాక్ టపటపా

273 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాక్‌కు మొదటి నుంచే కష్టాలు మొదలయ్యాయి. యువ బౌలర్ పోరెల్ ధాటికి పాక్ బ్యాట్స్‌మెన్ అల్లాడిపోయారు. జట్టు మొత్తం స్కోరు కనీసం వంద పరుగుల మార్కు కూడా దాటలేకపోయిందంటే భారత్ బౌలర్లు ఏవిధంగా చెలరేగిపోయారో అర్థం చేసుకోవచ్చు. పోరెల్ ఆరు ఓవర్లకు 17పరుగులిచ్చి నాలుగు వికెట్లు తీశాడు. ఓపెనర్లు ఇమ్రాన్ షా (2), మహమ్మద్ జైద్ (7)లతో పాటు అలీ జర్‌యబ్ ఆసిఫ్ (1) పోరెల్ ధాటికి ఐదు ఓవర్లకే పెవిలియన్ బాట పట్టారు. మరో బౌలర్ పరాగ్ కూడా చెలరేగి రోహైల్ నజీర్ (18), హసన్ ఖాన్ (1)ను వెంటవెంటనే పెవిలియన్ పంపాడు. ఓ క్రమంలో పాక్ 25 ఓవర్లు ముగిసేసరికి 8 వికెట్లు కోల్పోయి 48పరుగులు మాత్రమే చేసింది. దీంతో కనీసం 50పరుగులైనా సాధిస్తుందా అన్న అనుమానం కలిగింది. షాద్ ఖాన్(15) కాసేపు నిలబడే ప్రయత్నం చేసిన వికెట్ కీపర్ దేశాయ్ అతడిని స్టంపౌంట్ చేసి పాక్ ఓటమిని దాదాపు ఖాయం చేశాడు. అర్షద్ ఇక్బాల్‌ను అభిషేక్ శర్మ ఔట్ చేయడంతో పాక్ ఇన్నింగ్స్ 69 పరుగుల వద్ద ముగిసింది.

బౌలర్లు చెలరేగినా..

మ్యాచ్ మొదట్లో పాక్ బౌలర్లు కూడా కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. ఓ వైపు శుభ్‌మన్ గిల్ చెలరేగి ఆడుతున్నా.. అవతలి ఎండ్ బ్యాట్స్‌మెన్లను వరుసపెట్టి పెవిలియన్‌కు పంపి భారత్ భారీస్కోరు సాధించకుండా అడ్డుకున్నారు. అయితే పాక్ బ్యాట్స్‌మెన్ మాత్రం అవకాశాన్ని సద్వినియోగించుకోలేకపోయారు. మహమ్మద్ ముసా ఏకంగా 4వికెట్లు, అర్షద్ ఇక్బాల్ 3 వికెట్లు తీసి భారత్ చేజిక్కించుకున్నాడు. దీనికితోడు మిగతా బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో భారత్ 272పరుగులకే పరిమితం కావాల్సి వచ్చింది.

కోహ్లి.. సచిన్‌లా కాదు!



జొహానెస్‌బర్గ్ : ప్రస్తుతం భారత జట్టులో కోహ్లికి, మిగతా బ్యాట్స్‌మెన్‌కు అంత రం చాలా ఎక్కువని వెస్టిండీస్ దిగ్గజ ఫాస్ట్‌బౌలర్ మైకేల్ హోల్డింగ్ అభిప్రాయ పడ్డాడు. గతంలో సచిన్ భారత జట్టులో అత్యుత్తమ బ్యాట్స్‌మన్. ఐతే ద్రవిడ్, లక్ష్మణ్ లాంటి ఆటగాళ్లకు, అతడికి అంతరం తక్కువుండేది. కానీ ఇప్పుడు కోహ్లి కి, మిగతా వాళ్లకు చాలా ఎక్కువ తేడా ఉంది. ఇక విరాట్ ఇంగ్లాండ్‌లోనూ సత్తా చాటి తన గొప్పదనాన్ని చాటుతాడని ఎదురు చూస్తున్నా అన్నాడు. వివ్ రిచర్డ్స్ తరహాలోనే కోహ్లి ముున్ముందు దూకుడు తగ్గి ప్రశాంతంగా మారతాడని హోల్డింగ్ చెప్పాడు. ప్రస్తుతం కోహ్లి యువ కెప్టెన్. అతను నేర్చుకునే దశలో ఉన్నాడు. ఒక కెప్టెన్‌గా ఉండాలంటే ఏం చేయాలో అర్థం చేసుకుంటున్నాడు. కోహ్లి కొంచెం ఎక్కువ ఉత్సాహం, ఉద్వేగంతో కనిపిస్తుంటాడు. కొన్నిసార్లు ఉద్వేగం ఎక్కువ కావడం వల్ల ప్రత్యర్థులకే కాక సహచరులకు కూడా అతడిని చూస్తే భయం కలుగుతుంది. కోహ్లిని రిచర్డ్స్‌తో బ్యాటింగ్‌లోనే కాదు, కెప్టెన్సీ విషయంలోనూ పోలుస్తాను. రిచర్డ్స్ కెప్టెన్ అయ్యాక ప్రశాంత చిత్తుడిగా మారాడు. తర్వాత ఫలితాలు వాటంతటవే వచ్చాయి. విరాట్ విషయంలోనూ ఇలాగే జరుగుతుందని భావిస్తున్నా. దక్షిణాఫ్రికాతో తొలి రెండు టెస్టులకు రహానెను తప్పించడం నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది. అందరూ అతను శ్రీలంకతో సిరీస్‌లో బాగా ఆడలే దని అంటున్నారు. కానీ రహానెకు విదేశాల్లో మంచి రికార్డుంది. పరుగులు చేయక పోయినా అతడికి జట్టులో చోటివ్వాలి అన్నాడు. దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌లో సత్తా చాటిన బుమ్రా.. ఇంగ్లాండ్‌లో మాత్రం రాణించలేడని, తానైతే అతడిని అక్కడ తుది జట్టులో ఆడించనని హోల్డింగ్ చెప్పాడు.

కింగ్స్ ఎలెవన్ పేరు మార్పు?

న్యూఢిల్లీ : ఐపీఎల్ ఫ్రాంఛైజీ కింగ్స్ ఎలెవన్ పంజాబ్ పేరు మారబోతుందా? ఔననే అంటున్నాయి బీసీసీఐ వర్గాలు. తమ జట్టు పేరు మార్చుకునేందుకు అనుమతి ఇవ్వాలంటూ కింగ్స్ ఎలెవన్ పంజాబ్ సహ యజమాని బీసీసీఐకి దరఖాస్తు చేసుకున్నట్లుగా బోర్డు వర్గాల ద్వారా తెలిసింది. అసలు తమ ఫ్రాంఛైజీని మొహాలి నుంచి వేరే నగరానికి మార్చేయాలని కింగ్స్ యాజమాన్యం కోరుకుంటున్నట్లు కూడా పేర్కొన్న సదరు అధికారి... కొన్నేళ్ల కిందటి నుంచే ఈ రకమైన వార్తలు వస్తూనే ఉన్నాయి.

కోహ్లీ, పాండ్యతో ధోనీ సంబరాలు



జొహానెస్‌బర్గ్ : ఆతిథ్య దక్షిణాఫ్రికాతో జొహానెస్‌బర్గ్‌లోని వాండరర్స్ మైదానంలో జరిగిన చివరి టెస్టులో భారత్ విజయం సాధించి వైట్ వాష్ నుంచి తప్పించుకున్న సంగతి తెలిసిందే. చివరి టెస్టులో విజయంతో కోహ్లీ సేన సంబరాలు చేసుకుంది. ఇందుకు సంబంధించిన ఫొటోలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. ముఖ్యంగా కోహ్లీ, పాండ్యతో కలిసి ధోనీ ఉన్న ఫొటో సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా చక్కర్లు కొడు తోంది. ధోనీ జట్టులో లేడు కదా మరి ఎక్కడి నుంచి వచ్చాడు అనే కదా మీ సందేహం. దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్ కోసం ధోనీ ఈ మధ్యే సఫారీ గడ్డపై అడుగు పెట్టాడు. వాండరర్స్ మైదానంలో చివరి టెస్టులో మరో రోజు ఆట మిగిలి ఉండగానే కోహ్లీ సేన విజయం నమోదు చేసుకుంది. ఆ సమయానికి ధోనీ అక్కడే ఉన్నాడు. మ్యాచ్ అనంతరం ఆటగాళ్లు శాండ్‌టన్‌లో ని ఓ హోటల్‌లో పార్టీ చేసుకున్నారు. ఈ సందర్భంగా దిగిన ఫొటోను పాండ్య తన ట్విటర్ ద్వారా పంచుకు న్నాడు. ఈ ఫొటోలో కోహ్లీ, ధోనీ, పాండ్య, చాహల్, కేఎల్ రాహుల్ ఉన్నారు. ధోనీ ఉన్న ఈ ఫొటో ప్రస్తు తం నెట్టింట్లో చక్కర్లు కొడుతోంది. భారత్- దక్షిణాఫ్రి కా మధ్య ఆరు వన్డేల సిరీస్ ఫిబ్రవరి 1న ప్రారంభంకానుంది. దర్బ న్‌లో తొలి వన్డే జరగనుంది. భారత కాలమానం ప్రకారం సాయం త్రం 4 గంటల నుంచి మ్యాచ్ జరగనుంది.

ఒత్తిడికి గురికాలేదు

- రోజూ మాదిరిగానే భోజనం చేసి పడుకున్నా
- పాక్‌తో మ్యాచ్‌కి ముందురోజు అనుభవాలను తెలిపిన అండర్-19 జట్టు కెప్టెన్ పృథ్వీషా



న్యూఢిల్లీ : అండర్-19 ప్రపంచకప్‌లో యువభారత్ అదరగొట్టింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను సెమీస్‌లో చిత్తు చేసింది. కోచ్ రాహుల్ ద్రవిడ్ శిక్షణలో రాటు దేలిన పృథ్వీషా నేతృత్వంలోని ఈ టీమిండియా ప్రపంచకప్‌లో ఒక్క ఓటమి కూడా లేకుండా ఫైనల్‌కు దూసుకెళ్లింది. నాలుగోసారి ప్రపంచకప్‌ను కైవసం చేసుకోవడానికి ఇంకా ఒక్క అడుగు దూరంలో మాత్రమే ఉంది. ఫైనల్లో ఆస్ట్రేలియాతో యువ భారత్ తలపడనుంది. సెమీస్‌లో అద్భుత శతకంతో భారీ స్కోరుకు బాటలు వేసిన 18 ఏళ్ల పంజాబ్ కుర్రాడు శుభ్‌మన్ గిల్ ప్రదర్శన గురించే ఇప్పుడు అందరూ చర్చించుకుంటున్నారు. ఈ మ్యాచ్‌లో 102 పరుగులతో నాటౌట్‌గా నిలిచి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు సొంతం చేసుకున్న గిల్ ఆటతీరును సచిన్, లక్ష్మణ్ లాంటి దిగ్గజ క్రికెటర్లు మెచ్చుకుంటూ ట్వీట్లు పెట్టారు. ఈ టోర్నీలో జింబాబ్వే, బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లపై 90, 86, 102 పరుగులతో ఆకట్టుకున్న గిల్... తాను క్రికెట్ ఆడటానికి సచిన్, ద్రవిడ్, లక్ష్మణ్‌లే కారణమని చెబుతున్నాడు. ఆ ముగ్గురే నాకు ఆదర్శం. వారి ఆటను చూడటమంటే నాకిష్టం. చిన్నప్పుడు వారి ఆటతీరును అనుకరించేవాడిని. గోడకు బంతిని విసిరి వారి మాదిరిగా షాట్లు ఆడటానికి ప్రయత్నించేవాడిని అని గిల్ చెప్పుకొచ్చాడు. బ్యాటింగ్ చేసేప్పుడు ఎలాంటి ఒత్తిడికి గురికాను. పాక్‌తో మ్యాచ్ అంటే ఒత్తిడి సహజమే. అయితే మ్యాచ్‌కి ముందు రోజు రాత్రి మాత్రం ఎలాంటి ఒత్తిడికి గురి కాలేదు. మంచి భోజనం చేసి హాయిగా నిద్రపోయా. ఈ క్రెడిట్ అంతా నా తండ్రి, సోదరునికే చెందుతుంది. ఆస్ట్రేలియాతో ఫైనల్ కోసం ఎదురుచూస్తున్నా. అని మ్యాచ్ అనంతరం గిల్ అన్నాడు. గిల్‌ను ఇటీవల జరిగిన ఐపీఎల్ వేలంలో కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు రూ.1.8 కోట్లకు చేజిక్కించుకున్న విషయం తెలిసిందే.

మాకూ ఓ ద్రవిడ్ ఉంటే గెలిచే వాళ్లం



న్యూఢిల్లీ : అండర్-19 ప్రపంచ కప్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను యువ భారత్ చిత్తు చేసి ఫైనల్‌లోకి ప్రవేశించిన విషయం తెలిసిందే. సెమీస్‌లో పాక్‌పై టీమిండియా 203 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. ఈ టోర్నీలో భారత కుర్రాళ్ల ఆటతీరును, కోచ్ రాహుల్ ద్రవిడ్ శిక్షణను మెచ్చుకోని వారు లేరు. టీమిండియా ఆటతీరును మెచ్చుకుంటూ పలువురు ప్రముఖులు వరుస ట్వీట్లు పెడుతున్నారు. ఈ జాబితాలోకి ఇప్పుడు పాక్ అభిమానులు కూడా చేరిపోయారు. రాహుల్‌ను పొగుడుతూ ట్వీట్లు పెడుతున్నారు. భారత్ గెలవడానికి వారి వెనక రాహుల్ ద్రవిడ్ శిక్షణ ఉంది. మరి మా పాకిస్థాన్ జట్టు వెనక అలాంటి వారు ఎవరూ లేరు. అందుకే మేం ఓడాం. అంటూ పాక్ అభిమానులు ట్విటర్‌లో పేర్కొంటున్నారు. పాక్ జట్టు ప్రధాన కోచ్‌గా ఉన్న మన్సూర్ రాణాకు ఎలాంటి అనుభవం లేదని తిట్టిపోస్తున్నారు. మన్సూర్ రెండు వన్డేలు మాత్రమే ఆడాడు. 15 పరుగులే చేశాడు. వికెట్లు ఏమీ తీయలేదు. టెస్టు మ్యాచ్ ఆడిన అనుభవం అసలే లేదు అంటూ పాక్ అభిమానులు దుమ్మెత్తిపోస్తున్నారు. సీనియర్ ఆటగాళ్లు ఎవరూ యువ పాక్ జట్టుకు సహాయపడేందుకు ముందుకురాకపోవడంపై కూడా వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాక్‌పై జరిగిన సెమీస్‌లో భారత్ టాస్ గెలిచి 272 పరుగులు చేయగా.. లక్ష్య ఛేదనకు దిగిన పాక్ కేవలం 69 పరుగులకే కుప్పకూలింది. సునాయాస విక్టరీ సొంతం చేసుకున్న భారత్ ఫైనల్స్‌లోకి దూసుకెళ్లింది.

ఐపీఎల్ వల్ల ఒనగూరిన ప్రయోజనమేంటో



బాంబే హైకోర్టు సూటి ప్రశ్న

ముంబై : ఐపీఎల్ వుణ్యమాని ఫిక్సింగ్, బెట్టింగ్‌లు బాగా ప్రాచుర్యం పొందాయని, మరి ఈ లీగ్‌తో క్రికెట్ ఆటకు ఒనగూరిన ప్రయోజనమెంటో చూడాలని బాంబే హైకోర్టు వ్యాఖ్యానించింది. ఐపీఎల్ మాజీ కమిషనర్ లలిత్ మోడిపై నమోదైన విదేశీ మారక నిల్వల (ఫెమా) కేసు విచారణ సందర్భంగా డివిజన్ బెంచ్‌లోని న్యాయమూర్తులు జస్టిస్ ధర్మాధికారి, భారతి దంగ్రే వ్యాఖ్యానిస్తూ ఐపీఎల్‌ను విజయవంతం చేశారు సరే. గడిచిన పదేళ్లలో ఆర్థిక అవకతవకలు, కేసుల కంటే ఈ లీగ్ ఆటకెంత మేలు చేసిందో నిర్వాహకులు సమీక్షించుకోవాలి. ఇప్పటికే ఫిక్సింగ్ బెట్టింగ్‌లతో ఐపీఎల్ బాగా పాపులర్ అయింది. ఈ నేపథ్యంలో కేంద్రం, రిజర్వ్ బ్యాంక్, ఐపీఎల్ నిర్వాహకులు ఈ లీగ్ క్రికెట్ క్రీడ కోసమా లేదా అనేది తెలుసుకోవాల్సిన అవసరం వచ్చింది అని అన్నారు. లలిత్ మోడిపై నమోదైన కేసు దర్యాప్తులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సాక్షుల క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను తమ మార్గదర్శనంలో చేయాలని ఈడీని ఆదేశించింది. మార్చి 2న మొదలయ్యే ఈ ప్రక్రియను 31లోగా పూర్తి చేయాలని డివిజన్ బెంచ్ ఆదేశించింది.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22,ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044-